ఆదివారం
4•3•2018
హైదరాబాద్
• వెల.6 రూ.
• సంపుటి 7 • సంచిక 266
• పేజీలు : 18 + (20/16) + 36 పేజీల ఆదివారం అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW.NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

అవసరమైతే దేశ రాజకీయాల్లోకి

అక్కడికి వెళ్లడం గౌరవంగా భావిస్తా.. దేశ ప్రజలు గుణాత్మక మార్పు ఆశిస్తున్నరు: సీఎం కేసీఆర్

కేంద్రం ఏమిచ్చింది?

చెప్పింది చేయలేదు..
హామీలను నెరవేర్చలేదు

చట్టం ప్రకారమే సాయం చేశారు

పైసా ఎక్కువ ఇచ్చింది లేదు

గత నాలుగేండ్లలో అందిన మొత్తం
రూ.81,362 కోట్లు మాత్రమే

కేంద్ర సాయంపై వివరాలు
విడుదలచేసిన సీఎం కేసీఆర్

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

'కేంద్ర ప్రభుత్వం చెప్పింది చేయలేదు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు. తెలంగాణకు బాజాప్తాగా రావాల్సిన వాటానే ఇచ్చింది' అని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటాలో భాగంగానే నిధులను విడుదలచేసిందని, అంతకుమించి పైసా ఎక్కువ ఇచ్చింది లేదని పేర్కొన్నారు. పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని చెప్పారు. పద్నాలుగో ఆర్థిక సంఘం సిఫారసుకు అనుగుణంగా

మిగతా 3వ పేజీలో



శనివారం టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు

మార్పుల గురించి మాట్లాడాల్సినవాళ్లతో మాట్లాడుతున్నా

- ప్రధానిని తూలనాడినట్టు వస్తున్న వార్తలు శుద్ధ అబద్ధం
- ఎవరికోసమో నేను మాట్లాడే ప్రజల భాష మార్చుకోను
- కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే
- ప్రజలకు, రైతులకు చేసిందేమీలేదు
- మేం చేస్తున్న అభివృద్ధితో వారికి ఫ్రస్ట్రేషన్
- అడగకుండానే అన్ని వర్గాలకు అన్నీ ఇస్తున్నం
- విభజన హామీలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నయి
- రాజ్యసభ సభ్యుల ఎంపిక పార్టీ అంతర్గత వ్యవహారం
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

జాతీయ రాజకీయాలకు తన అవసరం ఏర్పడితే.. దేశంకోసం పనిచేయడం గొప్ప గౌరవంగా భావిస్తానని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. దేశానికి ఒక కొత్త దిశానిర్దేశం అవసరమని, దేశ ప్రజలు పరివర్తన కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఏడు దశాబ్దాలుగా విన్నకథలనే వింటూ ప్రజలు విసిగిపోయారని చెప్పారు. శనివారం టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం తర్వాత మీడియాతో మాట్లాడుతూ జాతీయ రాజకీయాలపై తన స్పందనను తెలియజేశారు. కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందేనని దుయ్యబట్టారు. రెండుపార్టీలు మార్చిమార్చి దేశాన్ని పరిపాలిస్తున్నా పథకాల పేర్ల మార్పు తప్ప ప్రజలకు, రైతులకు ఒరిగిందేమీలేదని మండిపడ్డారు. ప్రత్యామ్నాయ రాజకీయ సంఘటన గురించి ప్రస్తావిస్తూ.. థర్డ్ ఫ్రంటో మరో ఫ్రంటో.. దేశంలో రాజకీయ గుణాత్మక మార్పుల గురించి మాట్లాడాల్సినవాళ్లతో మాట్లాడుతున్నానని చెప్పారు. ఆవిర్భవించిన అనతికాలంలోనే అధికారం అందుకున్న రాజకీయ శక్తుల చరిత్ర మనకు ఎరుకేనని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇప్పటికే ఆలోచనలు సాగుతున్నాయని, జాతీయస్థాయికి వెళ్లాల్సి వస్తే బాజాప్తా పోతామని కుండబద్దలు కొట్టారు. దేశం కోసం పనిచేసే హక్కు మాకు లేదా? అని సీఎం అన్నారు. పంటల కనీస మద్దతు ధర కనీసం ఐదొందలు చొప్పున పెంచాలని కేంద్రాన్ని డిమాండ్‌చేయాలని టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నిర్ణయించామని చెప్పారు. ప్రధానిని తాను దూషించినట్టుగా జరుగుతున్న ప్రచారం అంతా వట్టిదేనని కొట్టిపారేశారు. మీడియాతో జరిపిన సుదీర్ఘ సంభాషణలో ఆయన దేశంలో గుణాత్మక మార్పు రావాల్సి ఆవశ్యకత గురించి పదేపదే నొక్కిచెప్పారు. చైనా అద్భుత అభివద్ధిని సాధించిందని, మనమెందుకు ఆ స్థాయికి ఎదుగలేమని నిలదీశారు. నదుల్లో వేలకొద్దీ టీఎంసీల నీరుంటే దేశంలో కరువులు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ప్రబలమైన ఆవశ్యకత ఉన్నప్పుడు ఎలాంటి మార్పులు వచ్చాయో చరిత్ర చెప్తున్నదని సీఎం కేసీఆర్ అన్నారు. 'జనతా పార్టీ పుట్టడం.. ఎన్నికల్లో స్వీప్ చేయడం 60 రోజుల్లో జరిగింది. ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ 8, 9 నెలల్లోనే స్వీప్ చేసింది. ఇక టీఆర్‌ఎస్ పుట్టిన 60 రోజుల్లోనే పంచాయతీ ఎన్నికల్లో స్వీప్ చేసింది. ఎక్కడ ఎప్పుడు ఏం జరుగుతుందో.. ఎలా ప్రారంభమవుతుందో చెప్ప లేం. కానీ సమయం నిర్ణయిస్తది. పనిమాత్రం ఆగదు' అని పేర్కొన్నారు. దేశంలో రాజకీయ పరివర్తన తీసుకురావడానికి తనవంతు కృషిచేస్తానని, మార్పు విషయంలో నాయకత్వం వహించాల్సి వస్తే.. తప్పక ఆలోచిస్తానని స్పష్టంచేశారు. 70 ఏండ్ల స్వతంత్రం తర్వాత కూడా ఇంకా రిజర్వేషన్ల అంశం కేంద్రం వద్ద పెట్టుకోవడం సరైంది కాదని అన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో చెప్పిన అనేక అంశాలు ఇప్పటికీ అమలుకాలేదని, దీనిపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. కేంద్రం తెలంగాణకు చేసిన మెహర్బానీ ఏమీ లేదని, రాష్ట్రానికి ఉన్న హక్కుగా తప్పితే తెలంగాణకు ఒక్క రూపాయి అదనంగా ఇవ్వలేదని స్పష్టంచేశారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక పార్టీ అంతర్గత వ్యవహారమని చెప్పారు. సుదీర్ఘ మీడియా సమావేశంలో సీఎం కేసీఆర్ వెల్లడించిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

విభజన చట్టం హామీలపై పార్లమెంట్‌లో నిలదీస్తాం

'రాష్ట్ర విభజన చట్టంలో చెప్పిన అనేక అంశాలు ఇప్పటికీ అమలుకాలేదు. వాటి మీదనే కేంద్రాన్ని పెద్దఎత్తున నిలదీయాలని, పోరాటం చేయాలని నిర్ణయించాం. చాలా సందర్భాల్లో దరఖాస్తులు ఇచ్చినం. డెలిగేషన్ రూపంలో వెళ్లి చెప్పాం. మా లోక్‌సభ, రాజ్యసభ పార్టీ నాయకుల నేతృత్వంలో అనేకసార్లు వినతులు ఇచ్చాం. రాష్ట్ర మంత్రులు

మిగతా 2వ పేజీలో



విజయం: త్రిపుర బీజేపీ నేత బిప్లవ్‌దేవ్



మోదం: ప్రధాని మోదీ



ఖేదం: మాణిక్ సర్కార్

ఈశాన్యంలో బీజేపీ హవా

త్రిపురలో చారిత్రక విజయం

నాగాలాండ్‌లో మిత్రపక్షంతో కలిసి ప్రభుత్వ ఏర్పాటు!

మేఘాలయలో ఎవరికీ మెజారిటీనివ్వని ఓటర్లు

శూన్యం నుంచి శిఖరానికి చేరామన్న ప్రధాని మోదీ

5



శనివారం ప్రగతిభవన్‌లో టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే కేశవరావు, లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత జితేందర్‌రెడ్డి, ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీ మల్లారెడ్డి, జి నగేశ్, బీబీ పాటిల్, సీతారాం నాయక్, వినోద్‌కుమార్, కల్వకుంట్ల కవిత, బాల్క సుమన్,పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, పసునూరి దయాకర్, కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఉన్నారు.

అవసరమైతే దేశ రాజకీయాల్లోకి

మొదటిపేజీ తరువాయి...

కూడా వెళ్లి కేంద్రానికి మా సమస్యలు చెప్పారు. నాలుగేండ్లయినా ఆశించినస్థాయిలో స్పందన రాలేదు. ఇక రిజర్వేషన్ల విషయం ప్రధానమంత్రి గారికి నేను స్వయంగా చెప్పాను. 70 ఏండ్ల స్వతంత్రం తర్వాత కూడా ఇంకా రిజర్వేషన్ల అంశం మీ దగ్గర (కేంద్రం పరిధిలో) పెట్టుకోవడం సరికాదని చెప్పాం. అసెంబ్లీ తీర్మానం చేసినప్పుడు కూడా ఈ మాట బలంగా చెప్పి పంపించాం. విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించే రిజర్వేషన్లు మా రాష్ట్రాల పరిధిలో మేం ఇచ్చుకుంటున్నాం. మేం కేంద్రాన్ని అడుగడం లేదు. కాబట్టి, ఈ అంశం మీ దగ్గర పెట్టుకోవద్దని చెప్పాను. దానిపైన స్పందన లేక పోగా, పాతపద్ధతే కొనసాగిస్తామని చెప్తున్నారు. దీనిపైనా పెద్దఎత్తున పోరాటం కొనసాగిస్తాం. రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ చేయవచ్చునని సుప్రీంకోర్టు చెప్పింది. ఇది పెద్ద విషయం కాదు. కేంద్రం అనుకుంటే ఆర్టికల్ 16ను సవరించవచ్చు. దీనికి అన్ని రాష్ట్రాలు సపోర్ట్ చేస్తాయి. ఏకగ్రీవంగా బిల్లు పాస్ అయితది. కానీ, కేంద్రం తన పెత్తనాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేదు. అసలు రహస్యం ఇదే.

పారిశ్రామిక ప్రోత్సాహకాల కొనసాగింపుపై పోరాటం

ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్స్ రెండు రాష్ట్రాలకు ఇవ్వాలని విభజన చట్టంలో చెప్పారు. కానీ కంటితుడుపుగా ఒకటో రెండో ఇచ్చారు. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఇస్తున్నట్టుగా ఇస్తే, కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రాల్లో పెట్టుబడులు బాగా పెరుగుతాయి. ఉభయరాష్ట్రాలు అభివృద్ధి చెందే ఆస్కారం ఉంటుందని అందరూ కొట్లాడి అడిగితే.. కాంగ్రెస్ ప్రభుత్వం విభజన చట్టంలో పెట్టింది. వీళ్లు (బీజేపీ) తీసేసింండ్రు. విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్స్ కొనసాగించాలని పెద్ద ఎత్తున పోరాటం చేస్తం. గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుబంధం చేయాలని కూడా మా ఎంపీలు పోరాటం చేస్తరు. ఇవికాకుండా తెలంగాణకు ఇవ్వాల్సిన బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఎయిమ్స్, కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, ఇలా అనేకం పెండింగ్‌లో ఉన్నయి. వీటిపైన కేంద్రాన్ని నిలదీస్తం. ఆ ప్రకారంగా పార్లమెంట్ సమావేశాల్లో ముందుకుపోవాలని సమావేశంలో నిర్ణయించినం. ఎప్పటికప్పుడు మా ఎంపీలతో సమీక్షించుకుంటూ ముందుకు వెళుతం.

ఎవ్వరూ మమ్మల్ని ఏం చేయలేరు..

మాకు ఉన్నదేంది.. మేం చేసిన కుంభకోణమేంది? ఎవ్వరూ మమ్మల్ని ఏమీ చేయలేరు. అంత నిటారుగా మేం ఉన్నాం. మాకున్న ఆస్తులన్నీ బహిరంగ రహస్యమే. మాకు పెద్దగా ఆస్తులు కూడా లేవు. ఈ దుర్మార్గమైన ఆస్తులు మనకు అక్కర్లేదని మా కుటుంబం అంతా కూర్చుని తీర్మానం కూడా చేసుకున్నాం. మాకు ఎంత ఉందో దాన్ని ఎప్పటికప్పుడు, నికరంగా నా జేబుకు ఉన్న పెన్నుతో సహా ప్రతి సంవత్సరం ఐటీ లెక్కలు సమర్పిస్తున్నాం. ఎన్నికలకు వెళ్లినప్పుడు అఫిడవిట్ సమర్పిస్తాం. దాని ప్రకారమే యాజిటీజ్, కచ్చితంగా ఉన్నాం. అంతకుమించి మమ్మల్ని చేయగల్గింది కూడా ఏం లేదు. ఎవరైనా భ్రమల్లో, భ్రాంతుల్లో ఉంటే ఏమీ చేయలేం. గతంలో మాదిరిగా కుంభకోణాల్లో ఉన్నోళ్లు, అక్రమ సంపాదనల్లో ఉన్నోళ్లు భయపడుతరు. కేసీఆర్ భయపడరు. ఆ అవసరం లేదు కేసీఆర్‌కు. ముట్టుకుని చూస్తే తెలుస్తది కథేంది అనేది. ఎవరిని పడితే వారిని ఏదిపడితే అది ఊహించుకుంటే కుదరదు.

అన్ని పార్టీల మాదిరిగానే మా పార్టీ నడుస్తది..

ఎన్నికలప్పుడు ప్రతిపార్టీకి చందాలు ఇస్తరు. ప్రపంచ వ్యాప్తంగా పార్టీలు ఎట్లా నడుస్తున్నయో, టీఆర్ఎస్ కూడా అట్లనే నడుస్తున్నది. అవి ఎన్నికల రాజకీయాలు. ఎన్నికలు వచ్చినప్పుడు బీజేపీ, కాంగ్రెస్ ఎట్ల నడుస్తాయో మా పార్టీ కూడా అట్లనే నడుస్తది. అమెరికాల ట్రంప్ పార్టీ ఎట్లా నడుస్తదో.. భారతదేశంలో అన్ని పార్టీలు ఏ పద్ధతిని అవలంబిస్తయో.. మా పార్టీ కూడా అదే పద్ధతిని అవలంబిస్తది. టీఆర్ఎస్‌కు బోలెడంత మంది సానుభూతిపరులున్నారు. మా పార్టీ సభ్యులే 70 లక్షల మంది ఉన్నరు. అయినా ఎలక్షన్లలో పిచ్చి పిచ్చి కథలు చేయాల్సిన అవసరం మాకు లేదు.

ఇన్నాళ్లు మిమ్మల్ని ఎవరైనా ఆపారా?

నిర్మలా సీతారామన్‌గారు వచ్చి ఇకపై తెలంగాణపై దృష్టి సారిస్తామని అంటున్నరు. ఎవరు వద్దన్నరు వాళ్లని. ఇప్పటిదాకా ఎవరన్న ఆగబట్టినారా? దృష్టి.. రోజు కాక పోతే గంటగంటకు సారించండి. మోస్ట్ వెల్కం. మేం కూడా ఫ్రీగా గెలిచేది ఏం లేదు కదా. మేం కూడా ఎన్నికల్లో పోటీచేసి గెలువాల్సిందే. ప్రజలు మాకు అవకాశం ఇచ్చింండ్రు. మేం ఏం చేయాలో అది ఉత్తమంగా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. మేం మంచిగ చేసినమా? చెడ్డగ చేసినమా? అనేది ప్రజలే నిర్ణయిస్తరు. వచ్చే ఎన్నికల్లో వాళ్లే తీర్పు ఇస్తరు. దాన్ని మేం శిరసావహిస్తం.

సర్వేలో 106 సీట్లు గెలుస్తమని వచ్చింది

మేం రెండు సర్వేలు చేయించుకున్నం. రెండు సర్వేలు కలిపి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3 వేలకు పైగా శాంపిల్స్‌తోటి ఆరున్నల లక్షల శాంపిల్స్ తీస్తే.. ఒక సర్వేలో 106 సీట్లు గెలుస్తమని, మరో దాంట్లో 103 సీట్లు గెలుస్తమని వచ్చింది. రాజకీయాల్లో సన్యాసం తీసుకునుడు, గడ్డాలుపెంచుడు అని కొత్తకథ మోపైంది. ఈ ఫ్యాషన్ ఎక్కడి నుంచి వచ్చిందో నాకు అర్థమయితలేదు. గడ్డాలు పెంచుకున్నరని, సన్యాసం తీసుకుంటా అన్నరని ప్రజలు సపోర్ట్ చేస్తరా? రాజకీయాల్లో ఇలాంటివి ఉంటయా? ఎప్పుడో 40, 50 ఏండ్ల కింద రాజకీయాలు ఇవి. ఇప్పుడు పనికొచ్చేవి కావు.

మీకోసం నా భాషను మార్చుకోను

జైపాల్‌రెడ్డి మొత్తం కేసీఆర్ సంస్కారమే బాగాలేదంటున్నడు. కేసీఆర్ భాషనే అట్లుందంటున్నడు. కేసీఆర్ భాష అట్లనే ఉంటది మరి. ఉన్నది ఉన్నట్టు చెప్తే కేసీఆర్ భాష అట్లనే ఉంటది. ఏం తప్పు మాట్లాడిన? తెలంగాణలో రోజూ మాట్లాడుకునే భాషనే అది. 'ఏమిరా వాడు అటేపాయే.. వీడు అటేపాయే. ఇంకా రాకపాయే' అంటరు. ఇంకా తమాషాగా మాట్లాడుతరు తెలంగాణలో. 'అలిగిపోయిన అలీసాబ్ అటేపాయే.. పిలువబోయిన పీర్‌సాహెబ్ అటేపాయే.. వీడు రాడాయే.. వాడు రాడాయే' అని ప్రతినిత్యం మాట్లాడుకుంటరు. లేని రవ్వత్తులు, కవ్వత్తులు పెట్టి మాట్లాడడం నాతోటి కాదు. ప్రజలతో మాట్లాడుతున్నప్పుడు కచ్చితంగా సింపుల్ లాంగ్వేజీలో, ప్రజల వ్యవహారిక భాషలోనే మాట్లాడుతం. మీకోసం నేను నా భాషను మార్చుకోను. మార్చుకోవాల్సిన ఖర్మ నాకు లేదు.'

బీజేపీని పార్టీకింద చూడం.. జోక్ కింద తీసుకుంటం

'బీజేపీ లక్ష్మణ్ అప్పుడప్పుడూ మేమే ప్రత్యామ్నాయం అంటుంటరు. ఇవి పెద్ద జోకులు. వరంగల్ ఉపఎన్నికల్లో అమెరికా నుంచి ఒక డాక్టర్‌ను తీసుకువచ్చి పోటీకి పెట్టింండ్రు. మా పార్టీ అభ్యర్థికి నాలుగు లక్షల 60 వేల పైచిలుకు మెజారిటీ వచ్చింది. దటీజ్ వాట్ బీజేపీ ఈజ్ ఇన్ తెలంగాణ. ఆ బీజేపీని మేం ఇక్కడ పెద్ద రాజకీయ పార్టీ కింద పరిగణించం. పెద్ద జోక్ కింద తీసుకుంటం. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పలగదీస్తం, పొడుస్తం అంటే చూడలేదా.. ఎన్ని ఎన్నికలు అని చెప్తం?'

ఫ్రస్టేషన్‌లో కాంగ్రెస్

'కాంగ్రెస్ వాళ్లు మెంటల్‌గా ఫ్రస్టేషన్ అయింండ్రు. వాళ్లకున్న ఫ్రస్టేషన్‌ను ప్రజలకున్నట్టు భావించుకొని పిచ్చి ప్రేలాపనలు చెప్పుకుంట పోతున్నరు. మా మీద ప్రజల్లో కోపముంటే నిజంగ బయటపడుతదని, ఏమైనా ఉంటే సరిదిద్దుకుందమని అనుకున్నం. కానీ పెద్ద బస్సుయాత్ర అంటే ఎక్కడా ఐదారువేల మంది దాటుతలేరు. అందుల కూడా ఈయన ఎమ్మడిపోయినోళ్లే సగంమంది ఉన్నరు. అందరికీ తెలిసిన రహస్యం అది. వీళ్ల ప్రజల సమస్యలు డిమాండు చేస్తే మేం నెరవేరుస్తం. ఎవ్వరు డిమాండు చేయకున్నా మేం చాలా నెరవేరుస్తున్నం. రైతులకు పెట్టుబడి ఆర్థిక సహాయం ఎవరు అడిగినరు? పేదింటి ఆడపిల్లల పెండ్లికి డబ్బులియ్యమని ఎవరైనా అడిగింండ్రా? హాస్టళ్లలో సన్నబియ్యం బువ్వ పెట్టమని ఎవరైనా అడిగింండ్రా? అనేక విషయాలు క్రియేటివ్‌గా, ఇన్నోవేటివ్‌గా.. దేశంమొత్తం మీద ఎక్కడాలేని విధంగా సంక్షేమ కార్యక్రమాలు, అద్భుతమైన ప్రాజెక్టు పనులు చేపడుతున్నం.'

సర్కస్ ఫీట్లు చేసినా కాంగ్రెస్‌కు పది సీట్లు దాటవు

'గతంలో రైతుల తలకాయలు పగుల్తే ఎవరూ మళ్లిచూడలే. ఎవరూ పట్టించుకోలే. వందరోజుల్లో భూరికార్డుల ప్రక్షాళన చేయించి పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇవ్వబోతున్నం. ఇంటికాడికి పోయి అయ్యా మీ పహాణి, నకలు ఇదిగో అని ఇప్పటివరకు ఇట్ల ఎవరు ఇచ్చింండ్రు? నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగితే కాని పనిని మేం చేసి చూపించినం. ఇది రైతుల ప్రత్యక్ష అనుభవంలో ఉన్నది. దే ఆర్ ఎంజాయింగ్. ఇవన్నీ ఉన్నయి కాబట్టే సందు దొరుకదు. కాంగ్రెస్ ఎన్ని సర్కస్ ఫీట్లు చేసినా ఆ పార్టీ పది సీట్ల గీత దాటదు. అది కూడా మేం పట్టించుకోకపోతేనే. బీజేపీ మొత్తమే గల్లంతయ్యే పరిస్థితి వచ్చింది. ఇప్పుడున్న సీట్లు కూడా రావు. అదీ వాస్తవ పరిస్థితి. దానికే వారు ఫ్రస్టేట్ అయితున్నరు.'

ఆ 68 నిమిషాలు మాట్లాడిందేమైంది?

'భారత రైతాంగం అసహనానికి గురయితున్నదని నేను చెప్పిన. ఇంకా వాళ్ల ఓపికను పరీక్షించవద్దని చెప్పిన. నేను 70 నిమిషాలు మాట్లాడిన. అందులో రెండు నిమిషాలు.. గారు అంటే గాడు అన్నారని దాన్ని పట్టుకొని చొక్కాలు చిపుకొంటున్నరు. మిగిలిన 68 నిమిషాలు మాట్లాడిందేమైంది? దానికి సమాధానం చెప్పరేంది? ఆ ఇష్యూలు నేను ముందు పెట్టిన కాబట్టే గగ్గోలు పెడుతున్నరు. ఇది వాస్తవంగా జరిగింది. అందుకే దీన్ని ఎవరూ పట్టించుకోనవసరం లేదు. నేను ఎవరినీ దూషించలేదు. దూషించడం నా అభిమతం కాదని మరోసారి స్పష్టతనిస్తున్నా. లేనిదాన్ని ఉన్నట్టుగ చెప్పుకొని ఒక దుష్ప్రచారానికి దిగుతున్నరు. ఇది కరెక్టుకాదు.

బీజేపీ-కాంగ్రెస్ దొందూ దొందే

రైతు ఎడల, ఇంకోదాని ఎడల నేను చెప్పిన సిద్ధాంతాలపరంగా బీజేపీ, కాంగ్రెస్ రెండూ దొందూదొందే. దేశంలో గుణాత్మకమైన మార్పు వస్తలేదు. రావాల్సిన అక్కర ఉన్నది. చాలా సీరియస్‌గా దేశంలో ఏదో ఒకటి జరుగాల్సి ఉంది. 70 ఏండ్ల నుంచి దేశం ఇదే మూసలో పోవాల్సిన అవసరం లేదు. దేశ రాజకీయాల్లో అనేక విషయాల్లో ప్రబలమైన మార్పు రావాలి. ఆ మాటకు నేను కట్టుబడి ఉన్న. ఎట్టిపరిస్థితుల్లోనూ టీఆర్ఎస్ ఆ స్టాండ్‌మీదనే కొనసాగుతది. దాంట్ల ఎలాంటి అనుమానం వద్దు. అనవసరమైన పిచ్చి ప్రయత్నాలు వాళ్లు మానుకుంటే మంచిది. ఎక్కువ తక్కువ మాట్లాడి వారి గౌరవం వాళ్లే తీసుకుంటున్నరు. ప్రజలే న్యాయ నిర్ణేతలు.

గుణాత్మక మార్పుకోసం ప్రజల ఎదురుచూపు

మూడో ప్రత్యామ్నాయమా.. మరోటా అనేది పక్కనపెడితే ఒకటి వెరీ క్లియర్. దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు రావాల్సిన అవసరముంది. ప్రజలు దాని కోసం ఎదురుచూస్తున్నరు. విసిగిపోయినరు. 70 సంవత్సరాలు గడిచిపోయినయి. తక్కువ సమయం కాదు. చాలా సుదీర్ఘ సమయం. అందుకే మార్పునకు శ్రీకారం చుట్టబడతది. ఇప్పటివరకు ఎవరు పాలించినరు? 70 ఏండ్లలో ఐదున్నరేండ్లు చరణ్‌సింగ్, వీపీ సింగ్, జనతాదళ్, చంద్రశేఖర్, దేవెగౌడ, మొరార్జీ దేశాయి వంటి వారి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. గరిష్ఠంగా ఈ ఆరు సంవత్సరాల తక్కువ సమయాన్ని మినహాయిస్తే, మిగిలిన 64 సంవత్సరాలు పూర్తిగా కాంగ్రెస్ లేదా బీజేపీ పాలించినయి. జాతికి వాళ్లు ఏం సమాధానం చెప్తరని నేను సీరియస్‌గా డిమాండ్ చేస్తున్న. 70 ఏండ్ల స్వతంత్ర భారతదేశంలో తాగేందుకు నీళ్లు లేవు. ఇది నిజం కాదా? అబద్ధమా? ఎన్ని రోజులు ఈ స్టోరీలు వింటం? దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పులు రావాల్సి ఉంది. అయితే దానిని సాధారణ భాషలో మూడో ఫ్రంట్ అని మాట్లాడుతున్నరు. ఏమొస్తదో కాలమే నిర్ణయిస్తది. కానీ వందశాతం దేశంలో గుణాత్మక మార్పు రావాలనే దానికి నేను కట్టుబడి ఉన్న. దేశంలో ఓ ప్రశ్న వినిపిస్తున్నది. కాంగ్రెస్ పోయింది.. బీజేపీ వచ్చింది. కానీ ఏం మార్పు తెచ్చింది? ఏం జరిగింది? పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నరు. రైతులకేంచేశారో చెప్పండి. ఫలానా పని చేసినమని చెప్పండి. ఎత్తి చూపించే పథకమేందో చెప్పండి. మీరు పెట్టిన కిరీటమేందో చూపండి. రైతుల పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని మేం డిమాండు చేసినం. ఇప్పుడున్న ఎమ్మెస్పీకి ఓ ఐదేసి వందలు పెంచండి చూద్దాం! రేపు పార్లమెంటుల మా ఎంపీలు దీనిని డిమాండు చేస్తరు. ఇది మా ప్రధాన అజెండా. ఇప్పుడే నిర్ణయం తీసుకున్న. వడ్లకు రూ.1590 ఉంది. దానిని రూ.2100 చేయండి. ఎందుకు చేయరండి? మీదికి మాత్రం రైతులు చనిపోతున్నరు.. ఇంత మంది చనిపోతున్నరని చక్కగ మాట్లాడుతరు. ఇదా మాట్లాడేది?

పథకాల పేర్లలో తప్ప మార్పు ఏది?

వీళ్లొచ్చి వాళ్లొచ్చినా, వాళ్లొచ్చి వీళ్లొచ్చినా.. పథకాల పేరు మార్పు మాత్రమే జరుగుతది. నేను 2004లో ఎంపీగా మొదటిసారి పార్లమెంటుకు పోయిన. అప్పుడు కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ రూ.4లక్షల కోట్లు. 14 సంవత్సరాల తర్వాత ఇప్పుడు 2018లో రూ.24లక్షల కోట్లు. అదే 2-3శాతం ఇంక్రిమెంటల్ ఇంక్రీజ్ తప్ప ఒక ప్రత్యేకమైన కృషి జరిగింది లేదు. ఇంతపెద్ద దేశాన్ని పాలించేవాళ్లం.. మనమీద చాలా బాధ్యత ఉంటది. దేశ ప్రజలు మార్పుకోసం వేచిచూస్తున్నరు. నాతోటి మాట్లాడే చాలామంది అదే అభిప్రాయం వెలిబుచ్చుతున్నరు. దశాబ్దాల తరబడి దేశాన్ని చూస్తున్న సీనియర్ పాత్రికేయులు, ఆర్థికవేత్తలు, ప్రజలు ప్రతి ఒక్కరూ.. కొత్త భావనతో దేశంలో మార్పు కోరుకుంటున్నరు. రేపు బీజేపీ పోయి కాంగ్రెస్ వస్తది.. ఏమైనా మార్పు వస్తదా? గుణాత్మకమైన మార్పు ఏమైనా ఉంటదా? దేశంలో కొత్తగా జరుగుతదని ఏమైనా ఆశిస్తున్నరా? కేవలం పథకాల పేర్లు మారుతయి అంతే.

దేశ రాజకీయాలకు అవసరమైతే పనిచేస్తా

జాతీయ రాజకీయాలకు కేసీఆర్ అవసరమైతే.. దేశం కోసం పనిచేయడం గొప్ప గౌరవంగా భావిస్తాను. దేశానికి ఒక కొత్త దిశానిర్దేశం అవసరం. దేశ ప్రజలు పరివర్తన కోరుకుంటున్నారు. అందుకు వారిని సిద్ధంచేయాలి. గుణాత్మకమైన మార్పురావాలి. అన్ని రంగాల ప్రజలను ఆదుకోవాలి. ఈ నిమిషానికి వచ్చిన గెలుపు, ఓటములతో ఎలాంటి ప్రయోజనం లేదు. నాడు విజయ్‌మాల్యా, నేడు నీరవ్‌మోడీ పారిపోయారు అంటూ కాలం వెళ్లబుచ్చితే లాభం లేదు. దేశ రాజకీయాల్లో మార్పురావాలి. అది గుణాత్మకంగా ఉండాలి. జాతీయ రాజకీయాల్లో ఎన్నో మార్పులొచ్చాయి. ప్రబలమైన ఆవశ్యకత ఉన్నపుడు ఎలాంటి మార్పులు జరిగాయో చరిత్రలో ఉన్నాయి. జనతా పార్టీ పుట్టడం, ఎన్నికల్లో స్వీప్‌చేయడం కేవలం 60 రోజుల్లోనే జరిగింది. ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన 8, 9 నెలల్లోనే స్వీప్ చేసింది. ఇక టీఆర్ఎస్ పుట్టిన 60 రోజుల్లోనే పంచాయతీ ఎన్నికల్లో స్వీప్ చేసి, అనంతరం తన లక్ష్యాన్ని విజయవంతంగా ముద్దాడింది. ఇవి అందరి మనసులో ఉంది. ఎక్కడ ఎప్పుడు ఏం జరుగుతుందో, ఎలా ప్రారంభమవుతుందో చెప్పలేం. కానీ సమయం నిర్ణయిస్తది. పని మాత్రం ఆగదు. జాతీయ రాజకీయాల గురించి వందశాతం మాట్లాడుతాం. తప్పు లేదు. ఇప్పటికే ఆలోచనలు కూడా ప్రారంభమయ్యాయి. మాట్లాడేవారు మాట్లాడుతున్నారు. అది తప్పా? ఇంత పెద్ద జాతీయ రాజకీయాల గురించి మాట్లాడేటప్పుడు కేసీఆర్ ముసుగు వేసుకొని పోవాలా ఏంది? బాజాప్తా పోతం. దేశంకోసం పని చేసే హక్కు మాకు లేదా? ప్రజాస్వామ్యంలో ఎవరైనా పనిచేయొచ్చు కదా!

మోదీకి నేను మంచి దోస్తును

మోదీ అంటే నాకు ఎలాంటి వ్యతిరేకత లేదు. ప్రధానిగా ఆయనను అమితంగా గౌరవిస్తాను. ఇంకా ముఖ్యమైన విషయం ఏమిటంటే.. మోదీకి నేను మంచి మిత్రుడిని. దేశంలో మందగించిన అభివృద్ధికి నేను వ్యతిరేకం. అది జీర్ణించుకోలేకపోతున్నాను. గుణాత్మక మార్పులు రావడం లేదనేదే నా ఆవేదన. ఎందుకు ఇంకా నక్సలైట్లున్నారు? సామాజిక ఉద్యమాలు ఎందుకు జరుగుతున్నాయి? దళితులు, గిరిజన గొడవలు ఎందుకు జరుగుతున్నాయి? మహారాష్ట్రలో 52, తమిళనాడులో 69, ఇంకో దగ్గర 50 శాతం రిజర్వేషన్లు.. ఎందుకు ఇంత తేడా? బీజేపీ, యూపీఏ పాలన ఏదైనా.. ఎందుకు పరిష్కారం చూపలేదు? ఎందుకు సమాన రిజర్వేషన్లు కల్పించలేదు?

కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వలేదు

కేంద్రం తెలంగాణకు ఇచ్చిన మెహర్బానీ ఏం లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 270 కింద ఆర్థికసంఘం ద్వారా నిధుల కేటాయింపు ఉంటుంది. అది అన్ని రాష్టాలకు ఉన్న హక్కు. బీజేపీ ఉన్నా.. ఎవరున్నా అది చేయాల్సిందే. దీని ప్రకారం, తెలంగాణకు అదనంగా ఒక రూపాయి కూడా ఇవ్వలేదు. నాలుగేండ్లలో మొత్తం రూ.81,362 కోట్లు వచ్చాయి. ఇదంతా రాజ్యాంగబద్ధం. తెలిసీతెలియని నాయకులు కేంద్రం నిధులిచ్చిందని అంటున్నారు. వారు చెప్పేది శుద్ధ తప్పు. వారికున్న అజ్ఞానానికి చింతిస్తున్నాను. కేంద్రం ఇచ్చిన దానికంటే మన రాష్ట్రం కేంద్రానికిచ్చిందే ఎక్కువ. దాదాపు రెండున్నర రెట్లు అందించాం. వాళ్లిస్తే మనం బతికేది ఏం లేదు. నీతి ఆయోగ్ తెలంగాణలో ప్రారంభమైన రెండు మంచి స్కీములను గుర్తించింది. భగీరథకు రూ.19వేల కోట్లు, మిషన్ కాకతీయకు రూ.5వేల కోట్లు.. అంటే మొత్తం రూ.24 వేల కోట్లు ఇవ్వాలని కేంద్రానికి సిఫారసుచేస్తే.. 24 రూపాయలు కూడా ఇవ్వలేదు. ఎన్నిసార్లు అడిగినా ప్రయోజనం లేదు.

పూర్తి మద్దతు అనుకుంటే పొరపాటే

'నో కాన్ఫిడెన్స్ మోషన్' అనేది చీప్ పొలిటికల్ స్టంట్. దేశ పరిస్థితిని అది మార్చుతుందా? వ్యక్తిగతంగా మోదీ తో నాకు ఎలాంటి పంచాయితీ లేదు. రాజకీయ వ్యవస్థ గురించి మాట్లాడుతున్నాను. కొన్ని అంశాలకు మద్దతు ఇచ్చాను. డీమానిటైజేషన్ వస్తే బ్లాక్‌మనీ అదుపులోకి వస్తుందని, దొంగల ఆటకట్టొచ్చని భావించాను. ఇక జీఎస్టీవల్ల ట్యాక్సేషన్ పెరిగి దేశానికి మంచి జరుగుతుందని అనుకున్నాను. దళితుడిని రాష్ట్రపతిగా చేసే క్రమం లో సహకారం అందించాలని కోరితే మద్దతు తెలిపాను. ఇలా అంశాలవారీగా మద్దతు ఇచ్చాను. కానీ పూర్తిస్థాయిలో మద్దతు తెలిపామని అనుకుంటే పొరపాటే.

పదేండ్లలో జరుగనిది నాలుగేండ్లలో!

'పదేండ్ల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 23 జిల్లాల ఆంధ్రప్రదేశ్‌కు పెట్టిన పెట్టుబడి వ్యయం రూ.1.19 లక్షల కోట్లు. అదే నాలుగేండ్లలో టీఆర్ఎస్ హయాంలో పది జిల్లాలకు పెట్టిన పెట్టుబడి రూ.1.19 లక్షల కోట్లు. ఇప్పుడు సంక్షేమం.. అభివృద్ధి జరుగుతున్నది. పదేండ్ల కాంగ్రెస్ హయాంలో 23 జిల్లాలకు జరిగింది ఇప్పుడు నాలుగేండ్లలో పది జిల్లాలకు జరిగింది. ఇవన్నీ ప్రజలకు తెలిసిపోయాయి. మా పథకాలన్నీ గోప్యంగా ఉండేవి కావు. ప్రజలకు తెలుస్తయి. మిషన్ భగీరథతో నాకే నల్లా వస్తది. 24 గంటల కరంటు నాకే బాయిదగ్గర, ఇంటిదగ్గర వస్తది. కళ్యాణలక్ష్మి నాకే వచ్చే. కేసీఆర్ కిట్ నా బిడ్డకే వచ్చే. ఎవరన్న చెప్పాల్న? గురుకుల పాఠశాల పెడితే మా పిల్లగాడే, మా బిడ్డనే చదువుకొనే. ఇలా టీఆర్ఎస్ డిజైన్ చేసిన ప్రతిఒక్క స్కీం కూడా ప్రజల అనుభవంలో ఉన్నది.'

చైనా స్ఫూర్తి మనకెందుకు సాధ్యంకాదు?

1976 వరకు చైనాలో మావో బతికి ఉన్నంతవరకు రెండుసార్లు తీవ్ర కరువు వచ్చింది. మొత్తం 15 లక్షల మంది చనిపోయినరు. చైనాలో వ్యవసాయ అనుకూల భూమి మన దేశంలోకంటే తక్కువ. జనాభా మనకంటే ఎక్కువ. గత 20-28 ఏండ్లలో చైనాలో ఎంత మార్పు వచ్చింది? అక్కడేమైనా బంగారం తింటున్నరా? హిమాలయాలకు వాళ్లు అవతలివైపు, మనం ఇవతలివైపు. ఇప్పుడు ప్రపంచంలోనే అమెరికా తర్వాత రెండో ఆర్థిక శక్తిగా చైనా ఉన్నది. విదేశీ మారక నిల్వల్లో ప్రపంచంలో చైనా నంబర్‌వన్. అదెలా సాధ్యమైంది? అక్కడ ఉన్నోళ్లు మనుషులే. అది ఆసియా ఖండంలోనే ఉన్నది. కాకపోతే అవసరమైన చట్టాలు, మార్పులు చేసుకున్నరు. 25-30 ఏండ్లలో ఇంత ప్రబలమైన శక్తిగా బలపడ్డరు. అది మనకెందుకు సాధ్యం కాదు? మనం మనుషులమేకదా!

అసలు దేశంలో కరువు ఎట్ల ఉంటది?

దేశంలో ఉన్న నీళ్లను 30-35 శాతమే వాడుకుంటమా? కరువు కాటకాలొస్తయి.. నార్తర్న్ చైనాకు సౌత్ చైనా నుంచి 2400 కిలోమీటర్లు తీసుకువెళ్లి 1600 టీఎంసీలు ఇస్తున్నరు. మనకు లేకనా? బ్రహ్మపుత్ర, గంగానదిలో 40వేల టీఎంసీలు ఉన్నయి. దేశంలో కరువు ఎట్ల ఉంటది? ఎందుకు ఉండాలి? దేశంలో ఆ పని ఎందుకు జరుగతలేదు? సాగునీళ్లురావు. తాగునీళ్లురావు. కరంటు ఉండదు. ఉత్పత్తి అయిన కరంటును దేశం వాడుకోజాలదు. అవసరమైన చట్టాలు మార్చాలి. జాతీయస్థాయిలో నైతే చట్టం, రాజ్యాంగ మార్చవచ్చు. ఈ రోజు అది జరుగుతలేదు.

ప్రధానమంత్రిని నేను ఆ మాట అనలేదు



గత నాలుగు రోజులుగా నేను టౌన్‌లో లేను బయట ఉన్నా. కొన్ని చిత్రవిచిత్రమైన విషయాలు వింటున్నా. ఆదిలాబాద్, కరీంనగర్ పర్యటన సందర్భంగా ప్రధానమంత్రినో, మరొకరినో నేను తూలనాడినట్టు మాట్లాడుతున్నారు. అది వందశాతం శుద్ధతప్పు. దాన్ని నేను ఖండిస్తున్నా. నేను అననిదాన్ని అన్నట్టుగా చిత్రీకరించారు. నేను కూడా టేప్ తెప్పించుకొని విన్నాను. నేను అందులో ప్రధానమంత్రి గారికి అని, మోదీ గారికి అని స్పష్టంగా చెప్పిన, దాన్ని నేను గాడికి అన్నట్టుగా వారు (బీజేపీ వాళ్లు) చెప్తున్నారు. అది వాళ్ల ఖర్మ. ప్రధానమంత్రిని మేమే కించపర్చుకుంటాం అని బీజేపీ వాళ్లు అనుకుంటే నేను చేసేది ఏమీలేదు. నేను మాట్లాడిన కాంటెక్స్ట్ వింటే ప్రతి ఒక్కరికీ అర్థమైతది. అక్కడ నేను ఆ మాట అనాల్సిన కాంటెక్స్ట్ లేనే లేదు. రెండో విషయం ఇతరత్రా కొన్ని లేనిపోనివి చేసి అసంబద్ధంగా మాట్లాడుతున్నారు. అది మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. నేను వాడు, వీడు అని పదజాలం వాడిన, అయితే అది మోడీగారిని కాదు. నేను మళ్లీ టేపులు తెప్పించి చూశా. రెండు కాంటెక్స్ట్‌ల్లో మాట్లాడిన. ఒక సందర్భంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా, బీజేపీ అధికారంలోకి వచ్చినా.. ఒరిగేది ఏం లేదు. 70 ఏండ్లలో వీళ్లు చేసింది ఏమీ లేదు. ఇదే పాతచింతకాయ పచ్చడి తప్ప వచ్చేది ఏం లేదని చెప్పిన. ఐ స్టాండ్‌బై మై వర్డ్స్. ఆ విషయంలో నా వైఖరిలో మార్పు లేదు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు సంబంధించి మాట్లాడినప్పుడు వాడు, వీడు అని మాట్లాడిన. 30 ఏండ్ల నుంచి నేను ఇక్కడే ఎమ్మెల్యేగా, ఎంపీగా ఉన్నా అని చెప్పిన. ప్రతిపక్షంలో ఉన్నాను. అధికారంలో ఉన్నాను. టీడీపీ అధికారంలో ఉంటే కాంగ్రెస్‌వాడు, కాంగ్రెస్ అధికారంలో ఉంటే టీడీపీవాడు వరి కంకులు, కందిళ్లు తీసుకుని అసెంబ్లీకి తెచ్చింండ్రు. వీడు అధికారంలో ఉంటే వాడు తెచ్చిండు, వాడు అధికారంలో ఉంటే వీడు తెచ్చిండు. కానీ పల్లెల్లో కరంటు తెచ్చింది గులాబీ జెండావాడు మాత్రమే అని చెప్పిన. అంతకుమించి నేను ఎవరినీ దూషించలేదు. దూషించే అలవాటు నాకు లేదు.

బీజేపీ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి

బీజేపీ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి. ప్రధానమంత్రినే విమర్శిస్తారా? అని అంటున్నారు. రాజ్యాంగంలో ఎక్కడైనా ఉందా ప్రధానమంత్రిని విమర్శించొద్దని! ఇది ప్రజాస్వామ్యం. అవసరమైతే దేశంలో ఎవరినైనా విమర్శించే అవకాశం ఇస్తది ప్రజాస్వామ్యం. రెండోది.. ఓ బీజేపీ ఎమ్మెల్యే మాట్లడుతరు.. కేసీఆర్‌కు జైలుకు పోవాలని ఉందా? అని అంటే ఏం అన్నట్టుండి? అంటే జైలుకు పంపిస్తారా? దేశంలో మాట్లాడినోళ్లందర్నీ జైలుకు పంపిస్తరా? ఏం రాజకీయం ఇది? వీళ్లు ఏమన్నా తానీషాలా? ఎవరైనా సరే, మేం ఏదో చేయగలం అని అనుకుంటే సరికాదు. కొన్ని సందర్భాల్లో కొందర్ని ముట్టుకుంటే భస్మం అయితరు. నాకు ఉన్నదేంది.. నేను జైలుకు పోయేదేంది? కడుపు కట్టుకుని, నోరు కట్టుకుని మేం అద్భుతమైన పాలన సాగిస్తున్నాం. ఈ ప్రధానమంత్రిగారే పదిసార్లు కితాబిచ్చారు. దేశంల అందరు కరంటు ప్రైవేటువాళ్ల దగ్గర కొంటుంటే, కేసీఆర్.. బీహెచ్ఈఎల్ కే కరంటు ఇచ్చిండని ప్రధానమంత్రే ప్రశంసించారు.

దేశ రాజకీయాల్లో ప్రబలమైన మార్పు రావాలి

ప్రస్తుత రాజకీయ వ్యవస్థ దారుణంగా విఫలమైంది. దేశ రాజకీయాల్లో ప్రబలమైన మార్పు రావాల్సిన అవసరం ఉంది. ఇందుకు ప్రజల ఆలోచనల్లో కూడా మార్పు రావాల్సిన అవసరం ఉంది. రాజకీయాల్లో గుణాత్మక మార్పుల కోసం ఎవరితో మాట్లాడాలో వారితో మాట్లాడుతున్నా. థర్డ్‌ఫ్రంట్ అంటరో.. మరో ఫ్రంట్ అంటరో లేక మెయిన్ ఫ్రంట్ కూడా కావొచ్చు. భారత రాజకీయ పరివర్తనలో మార్పు తీసుకరావడానికి నా వంతు ప్రయత్నం చేస్తా. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నాకు వ్యక్తిగత మిత్రుడు. ఆయనతో కలిశా. మాట్లాడా. రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం కొత్త ప్రయత్నాలు జరుగుతున్నాయి. మార్పు విషయంలో నాయకత్వం వహించాల్సి వస్తే తప్పక ఆలోచిస్తా. జాతీయ రాజకీయాలకు నాయకత్వం వహించే అవకాశం వస్తే తెలంగాణవాదులంతా గర్వపడాలి. 1999 నుంచి తెలంగాణ సాధించాలనే తపన ఉంది. 2001 నుంచి బయటికి వచ్చి పోరాడినం. టీఆర్ఎస్ ఏర్పడిన మొదటి ఏడాదే స్థానిక ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేశాం. 14 ఏండ్లకు తెలంగాణ సాధించాం. తెలంగాణలో ప్రజలందరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను అనుభవిస్తూ సంతోషంగా ఉన్నారు. ప్రతిపక్ష పార్టీలకు తప్ప ఎవరికీ ఏ ఇబ్బంది లేదు. తెలంగాణ శాంతియుతంగా ఉంది. ప్రాజెక్టుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ప్రపంచంలోని ఎవ్వరు వచ్చినా.. ప్రపంచనేతలు, ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అధికారులు.. ఎవ్వరు వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు అద్భుతం అని ప్రశంసిస్తున్నారు. తెలంగాణలో ప్రజలకు ఏ ఇబ్బంది లేదు. ఆరోగ్యం సహకరించి, భగవంతుడి ఆశీస్సులు ఉంటే దేశ రాజకీయాల్లో ప్రబలమైన మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తా. త్వరలోనే ప్రక్రియ ప్రారంభమవుతుంది.

రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక పార్టీ అంతర్గత వ్యవహారం

అమరవీరుల కుటుంబాలను ఎన్నికల్లో ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌ది. రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక అనేది టీఆర్ఎస్ పార్టీ అంతర్గత వ్యవహారం. దీనిని విలేకరులకు చెప్పడం పద్ధతికాదు. అమరవీరులకు రాజ్యసభ సీటు ఇవ్వాలని కోరే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు. అమరవీరుల గురించి మాట్లాడేది కాంగ్రెసా?! అమరవీరుడి తల్లి శంకరమ్మను ఓడగొట్టిందే టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. ఆనాడు ఎన్నికల్లో ఈ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎట్లా డబ్బులు పంచిండో తెలంగాణ ప్రజలు చూసింండ్రు. శంకరమ్మను ఓడించేందుకు డబ్బులు పంచింది, కారు బాయ్‌నెట్‌లో డబ్బులు తరలించింది ఈ మహానుభావుడే కదా! రాజ్యసభ సీటుకు పోటీ పెడతామని కాంగ్రెస్ చెప్పడం విడ్డూరం. టీఆర్ఎస్‌కు మూడు సీట్లు గెలిచే సంపూర్ణ మెజార్టీ ఉన్నది. కాంగ్రెస్‌కు మెజార్టీ లేనప్పుడు పోటీ పెడుతామనపడం కాంగ్రెస్‌వాళ్ళ 'ఫ్రస్టేషన్'. అది ఏ స్థాయిలో ఉన్నదో ప్రజలు అర్థం చేసుకోవాలి. గెలిచే అవకాశం ఉంటేనే పోటీచెయ్యాలి. లేకుంటే చంద్రబాబు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏమి చేసిండో.. ఏమి జరిగిందో అందరూ చూసిన్రు.

వంచన నుంచి ప్రజలు బయటపడాలనేది నా తపన

ఆంధ్రప్రదేశ్‌లోని రాజకీయ పార్టీలు ప్రజలకు స్పష్టత ఇవ్వడం లేదు. కేంద్రం స్పష్టత ఇవ్వడం లేదు. తమాషా చేస్తున్నారు. ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారు. ప్రత్యేక హోదా ఇస్తారో.. ఇవ్వరో కుండ బద్దలు కొట్టినట్టు చెప్పాలి. ఏపీ ప్రజలు ఆవేదనలో ఉన్నారు. ప్రజలను వంచిస్తున్నారు. వంచన నుంచి ప్రజలు బయటపడాలనేది నా తపన. చెప్పింది చెయ్యాలి. నేను కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడుతా. రాజకీయాల్లో ప్రబలమైన మార్పు కోసం 100 శాతం నావంతు కృషి చేస్తా.

ముహూర్తం



సూర్యోదయం: 6.36 గంటలకు



సూర్యాస్తమయం: 6.20 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, కృష్ణ –విదియ తె.ఝా 2.20 వరకు, తదుపరి కృష్ణ–తదియ, నక్షత్రం: హస్త రాత్రి 8.17 వరకు, తదుపరి చిత్త, అమృతఘడియలు: మధ్యాహ్నం 2.26 నుంచి 4.02 వరకు, రాహుకాలం: సాయంకాలం 4.52 నుంచి 6.20 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.46 నుంచి 5.33 వరకు, వర్జ్యం: తెల్లవారుజామున 5.06 నుంచి ఉదయం 6.42

లోకం పోకడ






శనివారం ప్రగతిభవన్‌లో టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే కేశవరావు, లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత జితేందర్‌రెడ్డి, ఎంపీలు గుత్తా సుఖేందర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బాల్క సుమన్, జీ నగేశ్, కల్వకుంట్ల కవిత, డీ శ్రీనివాస్, మంత్రి హరీశ్‌రావు కూడా ఉన్నారు.

తెలంగాణ వైపు దేశం చూపు: ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సామాజిక అభివృద్ధి లక్ష్యంగానే రాజకీయాలు సాగాలని, ఈ విషయంలో దేశం మొత్తం తెలంగాణవైపు చూస్తున్నదని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తెలిపారు. అభివృద్ధికి తెలంగాణ ప్రయోగశాలగా మారిందన్నారు. మూస విధానాలకు స్వస్తిపలికిన తెలంగాణ సామాజికాభివృద్ధిలో దేశానికే దిక్సూచిగా మారిందని ఒక ప్రకటనలో తెలిపారు.



కేంద్రం ఏమిచ్చింది?

మొదటిపేజీ తరువాయి...

రాజ్యాంగంలోని ఆర్టికల్ 270 ప్రకారం అన్ని రాష్ట్రాలకు మాదిరిగానే నిధులను విడుదల చేసింది తప్ప తెలంగాణకు ప్రత్యేకంగా చేసిందేమీలేదన్నారు. గత నాలుగేండ్లలో రూ.81,362కోట్లను మాత్రమే ఇచ్చిందని తెలిపారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి విడుదలైన నిధుల వివరాలను సీఎం కేసీఆర్ విలేకరులకు అందించారు.

అంశం	2014-15	2015-16	2016-17	2017-18	మొత్తం (కోట్లలో)
కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా	8,189	12,353	14,876	12,929	48,346
నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్డీఆర్ఎఫ్) కింద రాష్ట్రానికి కేంద్రం సాయం	472	328	58	858	1716
స్థానిక సంస్థలకు ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు	2,090	1,078	1,992	1,168	6,328
ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 94(2) ప్రకారం రాష్ట్ర ఖజానాకు చేరిన నిధులు					
ప్రత్యేక సహాయం (స్పెషల్ అసిస్టెన్స్)	–	450	450	450	1350
కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాల కింద	5,028	6,047	6,579	5,463	23,116
కేంద్ర సేవల పన్ను నష్టపరిహారం (నిజానికి రూ.11,443కోట్ల బకాయిలు రావాల్సి ఉంది)					1,253
సీఎస్టీ నష్టపరిహారం	–	919	334	–	1,253
ఇతర గ్రాంట్లు	–	111	–	–	111
మొత్తం	**15,307**	**21,429**	**24,560**	**20,067**	**81,362**

విభజన చట్టంలో హామీలు

ఇచ్చిన హామీ	చేసిన సాయం, ప్రస్తుత పరిస్థితి
గిరిజన విశ్వవిద్యాలయం	రాష్ట్ర ప్రభుత్వం స్థలం సేకరించింది. నిర్మాణం ప్రారంభం కాలేదు
హార్టికల్చర్ వర్సిటీ	రూ.300కోట్లు అవసరం. రూ. 200కోట్లు మంజూరు చేశారు. రూ.135కోట్లు ఇప్పటివరకు ఇచ్చారు.
బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ	ఇనుప ఖనిజం లభ్యతపై స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా పరిశీలన జరుపాలి. వేసిన కమిటీ ఇప్పటివరకు నివేదిక ఇవ్వలేదు.
కోచ్ ఫ్యాక్టరీ	కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయలేదు. ప్రతిపాదనను కూడా ఉపసంహరించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 180ఎకరాల స్థలం సేకరించినా కేంద్ర ప్రభుత్వం వెనుకకు పోయింది.
నాలుగువేల మెగావాట్ల విద్యుత్	ఎన్టీపీసీ కేవలం 2X800 యూనిట్‌లను ప్రారంభించింది.
పారిశ్రామికరంగంలో	ఎలాంటి ప్రోత్సాహకాలు అందలేదు. పన్ను మినహాయింపు లేదు.
53:47 నిష్పత్తిలో విద్యుత్	ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా పీపీఏలు రద్దు చేసుకుంది. సీలేరులో విద్యుత్ వాటా తేల్చలేదు. నీరజా మాథూర్ కమిటీ ఇంకా విద్యుత్ విషయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించలేదు.



కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాబట్టండి

టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టేందుకు ఎంపీలు కృషిచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్లమెంటరీ పార్టీ సమావేశం శనివారం సీఎం కేసీఆర్ అధ్యక్షతన ప్రగతిభవన్‌లో దాదాపు రెండు గంటలపాటు జరిగింది. ఈ సమావేశంలో ప్రధానంగా సోమవారం నుంచి ప్రారంభంకానున్న పార్లమెంట్ మలివిడుత బడ్జెట్ సమావేశాల్లో పార్టీపరంగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. కేంద్రం నుంచి వివిధశాఖలకు రావాల్సిన నిధులను సీఎం కేసీఆర్ వారికి వివరించారు. వీటిని రాబట్టడానికి కృషిచేయాలని సూచించారు. రిజర్వేషన్లు, విభజన హామీలను సమావేశంలో చర్చించారు. పార్టీ ఎంపీలకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే కేశవరావు, లోక్‌సభ పక్ష నేత ఏపీ జితేందర్‌రెడ్డి , ఉప నాయకులు బోయినపల్లి వినోద్‌కుమార్, లోక్‌సభ సభ్యులు కల్వకుంట్ల కవిత, బాల్క సుమన్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బూర నర్సయ్య, సీతారాంనాయక్, మల్లారెడ్డి, నగేశ్, బీబీ పాటిల్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పసునూరి దయాకర్, రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, డీ శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితోపాటుగా రాష్ట్ర మంత్రులు టీ హరీశ్‌రావు, నాయిని నర్సింహారెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులు నర్సింగరావు, రాజశేఖర్‌రెడ్డి, స్మితాసభర్వాల్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

‘కాలేయ’ మార్పిడితో ‘లివర్ ఫెయిల్యూర్’ వ్యాధిగ్రస్తులకు కొత్త జీవితం

కాలేయం విఫలమవటం మరణశాసనం ఏమీ కాదు. ప్రమాదకర రసాయనాలు, పదార్థాల నుంచి శరీరాన్ని నిరంతరం కాపాడుతూ ఉండే బాధ్యతను మోస్తుండే కాలేయం సహజంగానే ప్రమాదకర పరిస్థితులకు చేరువగా పని చేస్తుంటుంది. ఈ క్రమంలో కొన్ని అలవాట్లు, వ్యాధులవల్ల అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుంది. వైరసుల కారణంగా వచ్చే వ్యాధులు, మద్యపానం వంటి అలవాట్లు కాలేయానికి నష్టం కలిగిస్తాయి. లివర్ సిరోసిస్ ఎక్యూట్ హెపాటిక్ నెక్రోసిస్, బైలరీ ఎటీసియా, వైరల్ హెపటైటిస్, విల్సన్స్ డిసీజ్–హెమెటో మెటాబాలిక్ వ్యాధులు, ఆటో ఇమ్యూన్ హెపటైటిస్, కాలేయ కాన్సర్ల వంటి వ్యాధుల కారణంగా ఈ పరిస్థితి ఏర్పడుతుంది. సరైన సమయంలో గుర్తించి చికిత్స చేయకపోవటం, కాలేయాన్ని దెబ్బతీసే అనారోగ్యకరమైన అలవాటులా మానకపోవటం చివరకు కాలేయం పూర్తిగా విఫలమయ్యే ఎండ్ స్టేజ్ లివర్ డిసీజ్‌కు కారణం అవుతుంది. కాలేయం విఫలం అయ్యిందంటే ఇక మరణమేనని, కాలేయ కాన్సరుకు పరిష్కారం లేదన్న అభిప్రాయం ఇటీవలి కాలం వరకూ ప్రచారంలో ఉన్నది. ఎండ్ స్టేజ్ లివర్ డిసీజెస్‌కు సంబంధించి పలువురు డాక్టర్లలో కూడా ఇదే అభిప్రాయం ఉన్నది. కానీ మన దేశంలో పెద్ద సంఖ్యలో కేసులు నమోదవుతున్న కాలేయ కాన్సర్‌తోసహా కాన్సర్ వ్యాధుల చికిత్సకు సంబంధించి అనూహ్యమైన మార్పులు జరిగాయి. అత్యాధునిక చికిత్సా విధానాలు, శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. కాలేయం విఫలం కావటం ఇపుడు ప్రాణాల పైన ఆశలు వదులుకోవలసిన పరిస్థితి ఎంతమాత్రం కాదు. కాలేయపు వ్యాధుల లక్షణాలు ఏమిటి? ఎటువంటి ముందు జాగ్రత్తలతో కాలేయ వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు, వాటికి అందుబాటులో ఉన్న చికిత్సలను గూర్చి తెలుసుకోవటం తొలిదశలో గుర్తించి సరిచేసుకోవటానికి చాలా అవకాశం ఇస్తుంది. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోవటానికి సిద్ధం చేస్తుంది.

కాలేయానికి కాటువేసేవి ఏమిటి?

కాలేయం మన జీర్ణవ్యవస్థకు అనుబంధంగా ఉన్న అతిపెద్ద గ్రంధి. ఇది దాదాపు అయిదు వందల విధులను నిర్వర్తించే కాలేయం వ్యాధులు, అలవాట్ల కారణంగా కొంత దెబ్బతిన్నా యధావిధిగా పనిచేస్తుంది. సాధారణంగా శరీరంలో ఏదైనా ఒక భాగంలో కణాలు దెబ్బతింటే ఆ అవయవాలు మళ్ళీ అవి అభివృద్ధి చెందవు. చర్మం తరువాత ఒక్క కాలేయంలో మాత్రమే కణాలు తిరిగి అభివృద్ధి చెందుతాయి. ఈ ప్రత్యేక సామర్థ్యం ఉండటం వల్ల కాలేయంలో దాదాపు డెబ్బయ్ శాతం కణాలు దెబ్బతిన్నా తక్కిన భాగంతోనే తన విధులన్నింటినీ నిర్వహించ గలుగుతుంది. అయితే కొన్ని అలవాట్లు మరికొన్ని పొరపాట్లు మన కాలేయానికి అదే పనిగా నష్టం కలిగిస్తుంటాయి. మితిమీరిన, క్రమం తప్పని మద్యపానం (నాలుగైదేళ్లకు పైబడి), హెపటైటిస్ బి, సి. వైరస్ ఇన్‌ఫెక్షన్లు ఈ విధంగా కాలేయాన్ని దెబ్బతీసి ఎక్కువగా కాలేయ వ్యాధులకు కారణమవుతున్నాయి. వీటితో మొదట కామెర్ల వ్యాధి వస్తుంది. వ్యాధిని గుర్తించి వెంటనే చికిత్స చేయించుకోని పక్షంలో అది ముదిరి కాలేయం పనితీరు తీవ్రంగా కుంటువడుతుంది. ఊబకాయం కూడా కాలేయ వ్యాధులకు కారణం అవుతున్నది. ఫాట్ సిరోసిస్ లేదా నాన్ అల్కాహలిక్ స్టియటోనాష్ ఏర్పడుతుంది. ప్రస్తుతం కాలేయ సమస్యలతో వస్తున్న వారిలో దాదాపు సగం మందిలో ఈ ఫాట్ స్లిరోసిస్ వ్యాధే కనిపిస్తోంది. ఆరోగ్యకరమైన జీవన విధానం, రెగ్యులర్ ఏరోబిక్ ఎక్సర్‌సైజెస్, అనారోగ్యకరమైన ఎర్రటి మాంసాన్ని తినకుండా ఉండటం ద్వారా ఫాట్ సిరోసిస్ రాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవచ్చు. ఇక పిల్లలో వస్తున్న కాలేయ వ్యాధులు చాలా వరకు పుట్టుకతో వచ్చేవి, శరీర ధర్మక్రియలకు సంబంధించినవే. విల్సన్ డిసీజ్, బైల్ డక్ట్స్ లేకపోవటం, కురుపులు వంటి సమస్యలు పిల్లలలో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

కాలేయ సంబంధిత వ్యాధులకు అందుబాటులో అత్యాధునిక వైద్య చికిత్సలు

కాలేయవ్యాధులకు అత్యాధునిక చికిత్సలు

కాలేయవ్యాధుల చికిత్సకు ఇపుడు మంచి ఫలితాలు ఇవ్వగల మందులు, అత్యాధునిక శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాధుల వల్ల కాలేయానికి జరిగిన నష్టాన్ని బట్టి దానిని మూడు స్థాయిలుగా గుర్తిస్తారు. వీటిని ఎ, బి, సి. చైల్డ్ పగ్ స్టేజెస్ అంటున్నారు. ఎ చైల్డ్ స్థాయిలోనే గుర్తించ గలిగితే మందులతో, అలవాట్ల మార్పులతో చికిత్సచేసి పూర్తి సాధారణ పరిస్థితిని పునరుద్ధరించటం సాధ్యపడతుంది. మొదటి రెండు (ఎ.బి. చైల్డ్ స్టేజెస్) స్థాయిల్లోనూ చాలా వరకు తిరిగి కోలుకోవటానికి కాలేయం అవకాశం ఇస్తుంది. బి, సి స్థాయిలలో వస్తే వ్యాధి తీవ్రత, వ్యక్తి తట్టుకోగల శక్తిని అంచనావేసి కాలేయ మార్పిడిని సిఫార్సు చేస్తారు. వైరసుల ద్వారా వచ్చే హెపటైటిస్ వ్యాధిని ముందు జాగ్రత్తలతో నిరోధించవచ్చు. కానీ అనివార్యంగా వైరసుల బారిన పడి హైపటైటిస్ బి, సి. వ్యాధులు సోకినపుడు సర్జరీల అవసరం లేకుండా చాలావరకు కేవలం మందులతో చికిత్సచేసి నయం చేయటానికి వీలవుతుంది. అయితే హెపటైటిస్ ఎ, ఇ. వైరసుల వల్ల వచ్చే కామర్లు మాత్రం చాలా ప్రమాదకరం. కలుషితమైన నీళ్ళ, తిండి వల్ల ఈ తీవ్రమైన హైపటైటిస్ ఎ, ఇ. వైరసులు శరీరంలోకి చేరుతుంటాయి. వీటివల్ల హఠాత్తుగా కామెర్ల వ్యాధి సోకి ప్రాణల మీదకు ముంచుకు వస్తుంది. కాలేయం మార్పిడి మాత్రమే దీనికి నమ్మకమైన చికిత్స. అది కూడా బి, సి (తొలిదశ) చైల్డ్ స్టేజీలలో లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ సాధ్యపడుతుంది. బి. స్థాయిలో 90–95 శాతం, సి (తొలిదశ)లో 60–70శాతం సర్జరీలు విజయవంతం అవుతున్నాయి.

ఇక చాలా కాలంగా మితిమీరి మద్యపానం చేయటం వల్ల కాలేయం తీవ్రంగా దెబ్బతింటుంది. లివర్ స్లిరోసిస్ వ్యాధి వస్తుంది. స్లిరోసిస్ చికిత్స చేయించుకునే విషయంలో కూడా ఆలస్యం అయితే కాలేయ మార్పిడి మాత్రమే పరిష్కారమవుతుంది. వైద్యనిపుణులు కాలేయ మార్పిడి సందర్భాలలో సజీవులైన లేదా బ్రెయిన్ డెడ్ అయిన దాత నుంచి సేకరించిన ఆరోగ్యకర కాలేయంతో అవయవమార్పిడి ఆపరేషన్ చేస్తారు. ఫాట్ సిరోసిస్ బి(చివరి), సి. చైల్డ్ స్టేజ్‌లలో కాలేయ కణాలు చాలా వరకు పనిచేయలేని స్థితికి చేరుకుంటాయి. కాలేయ మార్పిడి అనివార్యం అవుతుంది. విల్సన్ డిసీజ్, బైల్ డక్ట్స్ లేకపోవటం, కురుపులు వంటి సమస్యలు ఉన్న పిల్లలకు భవిష్యత్తులో కాలేయ మార్పిడి సర్జరీ అవసరం అవుతుంది. పిల్లలలో కాలేయ మార్పిడి ప్రత్యేక సూపర్ స్పెషాలిటీగా అభివృద్ధి చెందుతుంది. పిడియాట్రిక్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు పిల్లలో కాలేయ మార్పిడి చికిత్సలు చేస్తున్నారు.

దురదృష్టవశాత్తు మనదేశంలో కాలేయ వ్యాధిగ్రస్తులలో అత్యధికులు బి నుంచి సి చైల్డ్ స్టేజికి మారే దశలో, సి చివరి దశలో ఆస్పత్రులకు వస్తున్నారు. బి నుంచి తరువాతి స్థాయికి మారుతున్న స్థితిలో వచ్చిన వారికి, సి చైల్డ్ స్థాయి పూర్తిగా ముదరని దశలో వచ్చిన వారికి కాలేయ మార్పిడి చేసి రక్షించవచ్చు. ఇటువంటి కేసులలో తొంబై అయిదు శాతం వరకు కూడా కాలేయమార్పిడి సర్జరీలు విజయవంతం అవుతున్నాయి. కాలేయ కాన్సర్ అంటే డాక్టర్లలో కూడా దాదాపు 90 శాతం మందికి ఇదివరలో మరణమే అనే భావన ఉండేది. కానీ ఇపుడు పరిస్థితి మారింది. ఇందుకు అవసరమైన అత్యాధునిక శస్త్ర చికిత్స, సర్జరీలతో యశోద ఆస్పత్రులలో కాలేయ కాన్సర్ గడ్డలను విజయవంతంగా తొలగించటం సాధ్యమవుతున్నది. కాన్సర్ గడ్డ 3–5 సెం.మీ. వరకూ ఉంటే ఆర్.ఎఫ్.ఎ., టిఎసిఇ వంటి సర్జరీయేతర చికిత్స చేస్తారు. వీరిలో 90 శాతం మంది కోలుకుంటారు. అయితే ఆ తరువాత కూడా వీరు క్రమం తప్పకుండా డాక్టరుకు చూపించుకుంటూ ఉండాలి.


వ్యాధిగ్రస్థమై పనిచేయలేని స్థితిలో ఉన్న కాలేయాన్ని తొలగించి దాని స్థానంలో ఆరోగ్యకరమైన మరో కాలేయాన్ని అమర్చటానికి చేసే సర్జరీనే కాలేయ మార్పిడి మార్పిడి శస్త్ర చికిత్స. మూత్రపిండాల లాగానే కాలేయ మార్పిడిలో కూడా రెండు పద్ధతులు ఉన్నాయి. మొదటిది, మరణించిన దాత (కెడావరిక్ డోనార్) దేహం నుంచి సేకరించిన దానిని అవసరమైన వారికి అమర్చటం. బ్రెయిన్ డెడ్ (మెదడు మాత్రం మరణించి) వెంటిలేటర్‌పైన ఆధారపడిన వ్యక్తిలో శరీరంలోని ఇతర అవయవాలన్నీ జీవించే ఉంటాయి. వెంటిలేటర్ తొలగిస్తే ప్రాణం పోతుంది. అటువంటి వ్యక్తి నుంచి కాలేయాన్ని తొలగించి కాలేయ మార్పిడి అవసరమై ఎదురుచూస్తున్న వ్యక్తికి అమరుస్తారు. దీనిలో మృతిచెందిన దాత నుంచి మొత్తం కాలేయాన్ని గాని లేదా కొంతభాగాన్నిగానీ సేకరించి అమరుస్తారు. చాలా సందర్భాలలో వ్యక్తి మృతిచెందిన వెంటనే సేకరించిన కాలేయంతోనే కాలేయ మార్పిడి సర్జరీలు చేస్తుంటారు. ఇందుకోసం రాష్ట్ర పభుత్వ నిర్వహణలో ఉన్న జీవన్‌దాన్ సంస్థలో పేరు నమోదు చేసుకుని తమ వంతు వచ్చేంత వరకూ వేచి చూడాల్సి ఉంటుంది.

ఇక రెండో పద్ధతి ఆరోగ్యకరమైన కాలేయం ఉన్న వ్యక్తి ఎవరైనా తన కాలేయంలోని కొంత దానం చేయటం. రక్తం గ్రూపు కలిసిన కుటుంబ సభ్యులు, సమీప బంధువులు తమ ఆప్తులను రక్షించుకునేందుకు కాలేయంలో నాలుగో వంతు భాగాన్ని దానం చేస్తున్నారు. ఈ విధంగా కాలేయంలో కొంత భాగాన్ని పంచుకున్నప్పటికీ దాతలు తక్కిన కాలేయ భాగంతో ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలుగుతున్నారు. మానవ శరీరంలోని అవయవాలలో కాలేయం ఒక్కదానికే కోల్పోయిన భాగాన్ని పునర్నిర్మించుకోగల శక్తి ఉంది. దాంతో కొద్ది వారాలలోనే దాత కాలేయం పూర్వపు పరిమాణానికి పెరుగుతుంది. అంటే దాత తాను పంచుకున్న కాలేయ భాగాన్ని తిరిగి అభివృద్ధి చేసుకోగలుగుతారు. అదే సమయంలో స్వీకర్తలో కూడా కాలేయం పూర్తిస్థాయికి ఎదుగుతుంది. ఈ విధంగా కాలేయాన్ని పంచుకున్న వ్యక్తికి దానివల్ల భవిష్యత్తులో ఎటు వంటి సమస్యలు తలెత్తే అవకాశం లేదు. అందువల్ల బంధువులు ఎవరైనా ముందుకు రావటానికి అవకాశం ఏర్పడుతుంది. జీవన్‌దాన్ క్రింద కాలేయం కేటాయింపు కోసం ఎదురు చూడకుండా కాలేయమార్పిడి సర్జరీ చేయించుకొని సాధారణ జీవితం గడిపేందుకు అవకాశం కలుగుతుంది.

దక్షిణ భారత దేశంలో కాలేయ మార్పిడి ఆపరేషన్ల నిర్వహణకు సంబంధించి యశోద ఆస్పత్రులు కొత్త ఒరవడిని ప్రవేశపెట్టాయి. వయోజనులు, పిల్లలకు లైవ్ డోనార్ కెడావరిక్ డోనార్ కాలేయాలతో విజయవంతంగా కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. వివిధ వైద్యవిభాగాల స్పెషలిస్టులతో కూడిన కాలేయ మార్పిడి నిపుణుల ప్రత్యేక వైద్య బృందం అత్యంత అధునాతనమైన హెపా–ఫిల్టర్డ్ ఆపరేషన్ థియేటర్లలో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తోంది. యశోద హాస్పిటల్స్‌లో ప్రత్యేకమైన లివర్ ఇంటెన్సివ్ కేర్ (ఐ.సి.యు) పోస్ట్ ఆపరేటివ్ కేర్ యూనిట్లను ఏర్పాటు చేశారు. దాదాపు రెండు వేల ఏడు వందలకు పైగా కాలేయ మార్పిడి సర్జరీలు చేసిన అనుభవం గల సర్జన్లు స్థానికంగా అందుబాటులో ఉంటున్నారు. దీనివల్ల ఈ శస్త్రచికిత్సకు అయ్యే ఖర్చు దేశంలోని ఇతర వైద్య సంస్థలు, ఆస్పత్రులతో పోల్చినపుడు దాదాపు సగానికి తగ్గుతున్నది. ఈ కారణంగా దేశవిదేశాల నుంచి వ్యాధిగ్రస్తులు కాలేయమార్పిడి ఆపరేషన్లకు ఈ ఆస్పత్రులకు వస్తున్నారు.

మొత్తం మీద వ్యాధి నిర్ధారణ పరీక్షలు, శక్తివంతమైన మందులు, ఖచ్చితమైన శస్త్రచికిత్సలు, కాలేయ మార్పిడి సర్జరీలు అత్యధికశాతం విజయవంతం అవుతుండటం కాలేయ వ్యాధుల నుంచి నమ్మకమైన ఉపశమనం కలిగిస్తున్నాయి. కానీ దీర్ఘకాలం నిర్లక్ష్యం చేసే పక్షంలో మాత్రం పరిస్థితి చేజారి పోయే అవకాశం ఉంటుంది. మొత్తం మీద కాలేయ వ్యాధుల చికిత్స ఇదివరకు ఎన్నడూ లేని స్థాయిలో ఆధునికత సంతరించుకుంది. అందువల్ల కాలేయ వ్యాధుల ప్రమాదాన్ని గుర్తించి మేల్కొన్న వారికి కాలేయం మరో అవకాశం ఇస్తుంది.





డాక్టర్ పి.బాలచంద్రన్ మీనన్
సీనియర్ లివర్ టాన్స్ ప్లాంట్ సర్జన్
యశోద హాస్పిటల్స్
సికింద్రాబాద్.

యశోద కాలేయ వ్యాధులు & లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విభాగం
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్. ఫోన్: 81210 22333

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం, 4 మార్చి 2018
WWW.NTNEWS.COM

విజ్ఞానానికి వ్యాపార సంకెళ్ళు

విజ్ఞానం



కార్ల్ మలామడ్

విద్యార్థులు కావలసిన సమాచారాన్ని ఇంటర్‌నెట్ కారడివిలో వెదుకులాడటానికి బదులు, సులభంగా కావలసిన మెటీరియల్ అందుకోవడానికి విద్యాసంస్థలు తోడ్పడాలె. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధనా పత్రాలు, వైజ్ఞానిక పరిశోధనలు పెద్ద సముద్రం వంటివి. కొత్త పరిజ్ఞానాన్ని సృష్టించాలంటే, ఈ సముద్రంలో ఈదులాడాలె. ఇప్పుడున్న విజ్ఞానంపైనే కొత్తది నిర్మించాలె. మహానుభావుల భుజాల మీద మనం నిలబడుతాం.

ఆధునిక కాలంలో విజ్ఞానం కొన్ని కార్పొరేషన్స్ చేతిలో బందీగా మారింది. ప్రత్యేకించి బ్రిటిష్ కంపెనీ 'రీడ్ ఎల్సెవియెర్' సైంటిఫిక్ జర్నల్స్ వ్యాసాలపై పూర్తి ఆధిపత్యం కలిగి ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శాస్త్రవేత్తల కృషిని సేకరించి, వాటిపై తనకే హక్కు ఉన్నట్టు చెప్పుకుంటున్నది. ఈ కొత్తరకం ఈస్ట్ ఇండియా కంపెనీ ఆదాయం 2016లో 62 వేల కోట్ల రూపాయలు. ఈ సంస్థ సైంటిఫిక్ పబ్లిషింగ్ అనుబంధ సంస్థకు 39 శాతం లాభాల వాటా ఉన్నది.

క్రాస్‌రెఫ్ అనే లాభాపేక్ష లేని సంస్థ అంచనా ప్రకారం- జర్నల్స్, పుస్తకాలలో కలిపి తొమ్మిది కోట్లకుపైగా పరిశోధనలు ఉన్నాయి. జర్నల్ ఆఫ్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్, ఇండియన్ జర్నల్ ఆఫ్ సైంటిఫిక్ రీసెర్చ్‌తో సహా మొత్తం జర్నల్స్ సంఖ్య 56 వేల 726 ఉన్నాయి. ఈ పత్రికలు అందరికీ అందుబాటులో లేవు. ఒక్కో పరిశోధనా పత్రం పొందడానికి 1,941 రూపాయలు చెల్లించవలసి వస్తుంది. అదే విశ్వవిద్యాలయాలు అయితే ప్రతి ఏటా మిలియన్ల కొద్ది డాలర్లు చెల్లించవలసి వస్తున్నది. ఇంత డబ్బు చెల్లించినా వాటిని ఉపయోగించుకునే క్రమంలో అనేక పరిమితులు ఉంటాయి.

2011లో తన చదువు కోసం పరిశోధనాపత్రాలు లభించక ఇబ్బంది పడిన కజఖ్‌స్థాన్‌కు చెందిన ఒక యువ గ్రాడ్యుయేట్ విద్యార్థిని అలెగ్జాండ్రా ఎల్బాక్యాన్ తానే 'సై- హబ్' పేర రష్యా కేంద్రంగా ఒక వెబ్‌సైట్‌ను సృష్టించింది. ఈ సైట్‌లో ఇప్పుడు ఆరు కోట్ల డెబ్భై లక్షల జర్నల్ ఆర్టికల్స్ ఉన్నాయి. 'సై-హబ్' ఈ సమాచారాన్ని అందరికి ఉచితంగా అందుబాటులో పెడుతున్నది. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్‌లలో చదువుకునే ధనిక బిడ్డలకు లభించే సమాచారం అందుకోలేని పేద దేశాలలోని పాఠశాలల్లో ఈ 'సై-హబ్' చాలా ప్రాచుర్యం పొందింది. ఈ సైట్ నుంచి అనేకమంది ప్రతిరోజు రెండు లక్షల పత్రాలను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. తాము డౌన్‌లోడ్ చేసుకున్న సమాచారాన్ని తమ తరగతిలోని, బడిలోని తోటివారికి కూడా అందజేస్తున్నారు. గత సంవత్సరం చైనాలో అతి ఎక్కువగా రెండు కోట్ల నలభై లక్షలకు పైగా డౌన్‌లోడ్ చేసుకున్నారు. చైనా తర్వాత ఎక్కువగా డౌన్‌లోడ్ చేసుకునేది భారత్‌లోనే. గత ఏడాది ఇక్కడ కోటీ 30 లక్షలకు పైగా పత్రాలు డౌన్‌లోడ్ అయ్యాయి. భారత్‌లోని విద్యార్థులు ఒక పద్ధతి ప్రకారం సై-హబ్‌ను వినియోగించుకుంటారు. సై-హబ్‌ను ఉపయోగించుకునే టాప్ టెన్ దేశాలలో బ్రెజిల్, ఇరాన్, ఇండోనేషియా, రష్యా ఉన్నాయి. అమెరికా, ఫ్రాన్స్, యూకే కూడా ఈ లిస్టులో ఉన్నాయి.

పరిశోధనా పత్రాల మీద గుత్తాధిపత్యం కోరుకుంటున్న బడా సంస్థలు సై-హబ్‌ను సృష్టించిన ఎల్బక్యాన్‌పై కన్నెర్ర చేశాయి. పెద్ద ఎత్తున న్యాయవాదులను నియమించి, అమెరికా కోర్టుల నుంచి మల్టిమిలియన్ డాలర్ల తీర్పులు ఇప్పించుకున్నాయి. ఇంటర్‌నెట్ ప్రొవైడర్లకు ఆదేశాలు జారీ చేయించాయి. కానీ ఇవేవీ పనిచేయలేదు. ఎల్బక్యాన్ రష్యాలో దాక్కున్నారు. కానీ సై-హబ్ మాత్రం వృద్ధి చెందుతూనే ఉన్నది. డౌన్‌లోడ్స్ పెరుగుతూనే ఉన్నాయి. విజ్ఞాన తృష్ణ అంత సులభంగా తీరదు కదా!

కొందరు బుద్ధిజీవులు మాత్రం ఈ విధంగా పరిశోధనా పత్రాలు అందుబాటులోకి తేవడం పైరసీ కిందికి వస్తుందని, దాన్ని నిరోధించాలని అంటున్నారు. కానీ కాపీరైట్ అనేది పరిపూర్ణ హక్కు కాదు. కొంతకాలానికి, కొంతమేరకు వర్తించేది. విజ్ఞానంపై భారీ అద్దె వసూలు చేస్తూ, ప్రజలకు సమాచారం చేరకుండా పరిమితులు సృష్టించడం ద్వారా కంపెనీలు మితిమీరుతున్నాయి. తమ స్వార్థంకోసం విజ్ఞానంపై ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. 'మరకేశ్ ఒడంబడిక'పై భారత్ సహా 79 దేశాలు సంతకాలు చేశాయి. ఈ ఒడంబడిక ప్రకారం దృష్టి లోపం ఉన్న వారికి సమాచారం అందించడంలో కాపీరైట్ చట్టం వర్తించదు. మరి జర్నల్ ఆర్టికల్స్‌ను క్యాష్ రిజిస్టర్ కింద పెట్టుకొని దాచుకుందామంటే ఎట్లా కుదురుతది? సాహితీ, కళాఖండాల పరిరక్షణ ఒడంబడిక 'బెర్న్ కన్వెన్షన్' ప్రకారం- బోధనా అవసరాలకు కాపీరైట్ చట్టం వర్తించదు. భారత కాపీరైట్ చట్టం 52 సెక్షన్ కూడా ఇదే చెబుతున్నది. భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుగా చేరిన విద్యాహక్కు ఈ చట్టానికి ఆధారం.

రీడ్ ఎల్సెవియెర్ వంటి కంపెనీలు కాపీరైట్ చట్టంకింద తమ పరిమితులు దాటి వ్యవహరిస్తున్నాయి. తమకు కాపీరైట్ హక్కులేని వాటిపై కూడా అధికారం చెలాయిస్తున్నాయి. అమెరికా ప్రభుత్వ ఆధ్వర్యంలో సాగే పరిశోధనలకు కాపీరైట్ చట్టం వర్తించదు. ఉదాహరణకు- వ్యాధి నియంత్రణ కేంద్రాలు, జాతీయ ఆరోగ్యసంస్థలలో సాగే అధ్యయనాలు ఆయా వైద్యుల విధినిర్వహణలో భాగంగా సాగుతాయి. వీటికి కాపీరైట్ వర్తించదు. ఇటువంటి జర్నల్ ఆర్టికల్స్ పన్నెండు లక్షలకు పైగా ఉన్నాయి. వీటి నుంచి పదివేల పత్రాలు తీసి అధ్యయనం చేస్తే వీటిని కూడా ప్రచురణకర్తలు కాపీరైట్ చట్టం వర్తింపచేస్తున్నారని వెల్లడైంది.పెన్సిల్వేనియా పరిశోధకులు నిర్వహించిన అధ్యయనంలో కూడా పబ్లిషింగ్ సంస్థలు తమకు అధికారంలేని పత్రాలపై కాపీరైట్ చట్టాన్ని ఉపయోగిస్తున్నాయని వెల్లడైంది. 1964కు ముందు చట్టం ప్రకారం నిర్ణీత క్రమంలో కాపీరైట్ రిజిస్ట్రేషన్‌ను కొనసాగించుకుంటూ ఉండాలె. ఈ రిజిస్ట్రేషన్ రినీవల్ జరుగకపోతే కాపీరైట్ ఉండదు. కానీ వీటిపై కూడా పబ్లిషింగ్ సంస్థలు గుత్తాధిపత్యం సాగిస్తున్నాయి.

> దేశంలోని విశ్వవిద్యాలయ గ్రంథాలయాలు ఒక కన్సార్టియంగా ఏర్పడాలె. తాము సేకరించిన పత్రాల ఫొటోకాపీలు తీసి విద్యార్థులకు అందుబాటులో పెట్టాలె. భారత్ గతంలో ఎన్నోసార్లు ప్రపంచానికి దారిచూపింది. గాంధీ ఉప్పుపై పన్నుకు, పరిమితులకు నిరసనగా ఉప్పుసత్యాగ్రహం చేశారు. విజ్ఞానం పై పరిమితులు విధించడం కూడా ఇటువంటిదే. శరీరానికి ఉప్పు, విజ్ఞానం రెండూ అత్యవసరం. కొందరు సై-హబ్‌ను పైరసీ సైట్‌గా విమర్శిస్తున్నారు. కానీ ఇది లైసెన్స్‌లేని ఉప్పు కర్మాగారం. జ్ఞాన తృష్ణగల విద్యార్థులు దీన్ని ఉపయోగించుకుంటున్నారు.

పరిశోధనాపత్రాలను అందుబాటులో పెట్టుకోవడానికి కొన్ని కంపెనీలకు భారీగా చెల్లించుకోవలసి వస్తున్నది. దీనివల్ల ఆర్థిక పుష్టి గల విద్యాసంస్థలు కూడా వెనుకడుగు వేస్తున్నాయి. ఏడాదికి 32.3 కోట్ల నుంచి 129.4 కోట్ల వరకు చెల్లించవలసి వస్తున్నది. దీంతో ప్రపంచంలోనే అత్యంత ధనిక విశ్వవిద్యాలయమైన హార్వర్డ్ కూడా 2012లో పరిశోధనా పత్రాల అందుబాటును తగ్గించుకున్నది. జర్మనీలోని కోన్‌స్టాంజ్ విశ్వవిద్యాలయం రీడ్ ఎల్సెవియెర్ జర్నల్స్‌కు యాక్సెస్ వదులుకున్నది. అత్యంత ధనిక విశ్వవిద్యాలయాలే లబోదిబోమంటుంటే, మిగతా విద్యాసంస్థల సంగతి అర్థం చేసుకోవచ్చు. కానీ విద్యార్థులు జ్ఞానతృష్ణ తీర్చుకోవడానికి తపన పడుతుంటారు. అందుకే భారత్‌లో సై-హబ్ ప్రాచుర్యం పెరిగింది. పరిశోధనా పత్రాలు కొన్ని కంపెనీల చేతిలో ఉండటం వల్ల శాస్త్ర పరిశోధన కూడా సాగడం లేదు. విశ్వవిద్యాలయాలు పూర్తి ప్యాకేజీ డబ్బు చెల్లించకపోతే, పరిశోధనా పత్రాల జాబితా కూడా అందకుండా చేస్తున్నాయి. ఏయే వ్యాసాల్లో ఏయే ఉమ్మడి అంశాలు ఉన్నాయో కూడా తెలువకపోతే పరిశోధన సాధ్యం కాదు.

భారత్‌లో బోధనాక్రమంలో ఉపయోగించే మెటీరియల్‌కు కాపీరైట్ వర్తించదు. ఢిల్లీ విశ్వవిద్యాలయం కాపీషాప్ కేసులో ఢిల్లీ హైకోర్టు ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఢిల్లీ విశ్వవిద్యాలయం ఆవరణలో ఉన్న రామేశ్వరి ఫొటోకాపీ షాప్ విద్యార్థులకు జర్నల్స్‌లోని వ్యాసాల ప్రతులతో కోర్సుప్యాక్ అమ్ముతున్నది. మూడు ప్రముఖ పబ్లిషింగ్ సంస్థల ఆరోపణలతో సాయుధ పోలీసులు ఈ షాప్‌పై దాడిజరిపి కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘించారంటూ భారీ నేరాలు మోపారు. కానీ విద్యార్థి సంఘాలు, అకడమిక్ అసోసియేషన్ బోధనావసరాలకు కాపీరైట్ వర్తించదని వాదిస్తున్నారు. దీంతో కోర్టు నేరమేమీ జరుగలేదని తీర్పు ఇచ్చింది. ప్రచురణకర్తల ఆరోపణల మీద విద్యాహక్కు విజయం సాధించింది. భారత్‌లో కాపీరైట్ చట్టం బోధనాంశాలకు వర్తించదని స్పష్టంగా చట్టం ఉన్నప్పటికీ, ఇక్కడి విద్యార్థులు సై-హబ్ ద్వారా కూడా పత్రాలు పొందలేకపోతున్నారు. ఇంటర్‌నెట్‌లో అన్వేషించే శ్రమ లేకుండా ఉపాధ్యాయుల తోడ్పాటుతో విద్యార్థులు పూర్తి సమాచారం పొందే పరిస్థితి ఉండాలె.


దేశంలోని విశ్వవిద్యాలయ గ్రంథాలయాలు ఒక కన్సార్టియంగా ఏర్పడాలె. తాము సేకరించిన పత్రాల ఫొటోకాపీలు తీసి విద్యార్థులకు అందుబాటులో పెట్టాలె. భారత్ గతంలో ఎన్నోసార్లు ప్రపంచానికి దారిచూపింది. గాంధీ ఉప్పుపై పన్నుకు, పరిమితులకు నిరసనగా ఉప్పుసత్యాగ్రహం చేశారు. విజ్ఞానంపై పరిమితులు విధించడం కూడా ఇటువంటిదే. శరీరానికి ఉప్పు, విజ్ఞానం రెండూ అత్యవసరం. కొందరు సై-హబ్‌ను పైరసీ సైట్‌గా విమర్శిస్తున్నారు. కానీ ఇది లైసెన్స్‌లేని ఉప్పు కర్మాగారం. జ్ఞాన తృష్ణగల విద్యార్థులు దీన్ని ఉపయోగించుకుంటున్నారు. విజ్ఞానంపై వలసవాద సంకెళ్లను తెంచడం, సమాచారాన్ని ప్రజాస్వామీకరించడం మన ముందున్న సవాలు. అందరికీ విజ్ఞానాన్ని అందుబాటులోకి తేవడం ద్వారా ఇంటర్‌నెట్‌ను సంపూర్తిగా ఉపయోగించుకోగలం. భవిష్యత్‌తరాలకు ఉత్తమ ప్రపంచాన్ని అందించగలం. విజ్ఞానం అందరికి అందుబాటులో ఉంటే సార్వత్రిక విద్యావకాశాలు లభిస్తాయి. ఉత్తమ పౌరులతో ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుంది. విజ్ఞానాన్ని సృష్టిస్తూ పరిష్కారాలను సాధించడం ద్వారా పేదరికం, ఆకలి, రోగాలు, నీటి కొరత, పర్యావరణ విధ్వంసం, అసమానతలు వంటి అనేక సమస్యలను నిర్మూలించవచ్చు.

విజ్ఞాన సాగరంలో స్వేచ్ఛగా ఈదులాడే భారతీయ విద్యార్థులు, ఉపాధ్యాయుల హక్కుకు మనమంతా మద్దతు ఇవ్వాలె. ఇది భారత్‌కే కాదు, ప్రపంచానికి అంతటికీ మంచిది. విజ్ఞాన సాగరం వైపుగా అడుగులు వేద్దాం.

(వ్యాసరచయిత: అమెరికాలో, భారత్‌లో విజ్ఞానాన్ని అందుబాటులో పెట్టే లాభాపేక్ష లేని అమెరికా సంస్థ 'పబ్లిక్.రిసోర్స్.ఆర్గ్' అధ్యక్షులు)

వివాదంలో వినోదం

సినిమా



వారాల ఆనంద్

సామాన్య బడుగుజీవికి దేశంలో ఉన్న వినోద సాధనాల్లో అందుబాటులో ఉన్న ముఖ్యమైన వేదిక సినిమా. అంతేకాదు సినిమా వారి జీవితాల్లో అంతర్భాగమైపోయింది. ప్రేక్షకుల పైన సినిమా ప్రభావం ఎంతగా ఉందంటే వారు మాట్లాడే భాష, ఆహార్యం, ఆహార పుటలవాట్లు మొత్తంగా జీవనసరళి సినిమా ప్రభావంలో పడి ఎప్పటికప్పుడు మారిపోయే పరిస్థితి ఏర్పడింది. అలాంటి సినిమా ఇవాళ ప్రదర్శనారంగంలో వచ్చిన వివాదం నేపథ్యంలో వెండితెర మీద బొమ్మపడకుండా వినోదం మూతపడే స్థితి ఏర్పడింది.

సినిమాకు సంబంధించి ఉన్న ప్రధాన మూడు విభాగాలు- నిర్మాణం, పంపిణీ, ప్రదర్శనరంగాల్లో ఏర్పడిన సంక్షోభం తీవ్రమై దక్షిణ భారతంలో సినిమాహాళ్ళ మూసివేతకు దారితీసేదాకా వెళ్లింది. నిజానికి సినిమా నిర్మాణ రంగంలో వచ్చిన అనేక మార్పులతోపాటు వ్యాపారమే ఇరుసుగా ఉన్న పంపిణీ రంగం కూడా ఆది నుంచి అనేక మార్పులకు గురైంది. నైజాం ఏరియాగా పిలుచుకునే తెలుగు సినిమా రంగానికి సంబంధించి సికింద్రాబాద్ రాష్ట్రపతి రోడ్డు నిండా అనేక ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్ల ఆఫీసులుండేవి. కాలక్రమంలో సినిమాలకు జిల్లాలవారీ అమ్మకాలు మొదలవడంతో డిస్ట్రిబ్యూటర్లు క్రమంగా వెనక్కుతగ్గారు. టేబుల్ ప్రాఫిట్‌లు మొదలై స్టార్డమ్ విపరీతంగా పెరిగిపోయింది. పెద్ద హీరోల సినిమాలకు పెద్ద పెద్ద బిడ్డింగులు మొదలయ్యాయి. తమ థియేటర్లలో పెద్ద సినిమాలు విడుదల చేయడానికి సినిమాహాళ్ళ యజమానులు ముందస్తు అడ్వాన్సులు చెల్లించి హాళ్లున్నాయి. వాటిల్లో 95 శాతానికి పైగా డిజిటల్ స్క్రీనింగ్‌లకు మారిపోయాయి. ఫలితంగా ప్రధాన డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ సేవల్లోకి వెళ్లిపోయాయి. వాటిల్లో దాదాపు హాళ్లన్నీ క్యూబ్, యుఎఫ్ఓ లాంటి ప్రధాన సంస్థలతో ఒప్పందాలను చేసుకున్నాయి. దానిలో భాగంగా డిజిటల్ ప్రొజెక్షన్‌కు అవసరమైన పరికరాలు సమకూర్చడం కూడా ఉన్నది. ఇంకా వర్చువల్ ప్రింట్ ఫీజు కూడా మరో ప్రధానమైన అంశం. మొదట్లో అంతా బాగానే ఉన్నా డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు క్రమంగా వర్చువల్ ప్రింట్ ఫీజు పెంచడం ఆరంభించారు. ఫలితంగా సినిమాహాళ్లను లీజుకు తీసుకున్న వర్గానికి ఆర్థికభారం ఆరంభమైంది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు తమ ఆధిపత్యాన్ని చూపించడం మొదలుపెట్టారు. పరికరాల కోసం తాము పెట్టిన పెట్టుబడిని కూడా వీలైనంత త్వరగా వసూలు చేసుకోవాలని ప్రయత్నించడం మొదలు పెట్టడంతో ఇన్నేండ్లుగా సినిమా రంగంపైన గుత్తాధిపత్యం చెలాయించిన వర్గాలకు సెగ తగులడం మొదలైంది. దాంతో దక్షిణ భారతానికి చెందిన సౌత్ ఇండియన్ నిర్మాతల మండలి జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి సినిమాహాళ్ల మూసివేతకు పిలుపునిచ్చింది. దాంతో వినోదం కాస్తా వివాదంలో పడిపోయింది. దాదాపుగా సినిమాహాళ్లను లీజుకు తీసుకొని సినిమా రంగాన్నే నియంత్రించే స్థాయికి చేరినవాళ్లంతా రోడ్డెక్కారు. అంటే తాము ఇన్నాళ్లుగా చేస్తున్న ఆధిపత్య దోపిడీ ప్రపంచీకరణ నేపథ్యంలో సాంకేతిక విప్లవ నేపథ్యంలో ఆవిర్భవించిన డిజిటల్ ప్రొవైడర్ల దెబ్బకు కునారిల్లిపోయే స్థితిలోకి నెట్టివేయబడ్డారు.

> ఇంటింటికీ ఇంటర్నెట్ వినియోగం, అరచేతిలో స్మార్ట్‌ఫోన్లు రావడంతో అంతర్జాలం మొత్తంగా అవరించిపోతున్నది. సినిమాల విషయం వచ్చేసరికి యూట్యూబ్ ప్రమాదాన్ని మించి నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ వీడియో లాంటి ఆన్‌లైన్ సినిమా ప్లాట్‌ఫాంలు వెల్లువలా ముంచుకు వస్తున్నాయి. పాత సినిమాలతో పాటు సరికొత్త సినిమాలను కూడా అవి విడుదల చేస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను చేరుకుంటున్నాయి.

సినిమాలను వేలంలో కొన్నట్టుగా కొనడం మొదలుపెట్టారు. సినిమాలకు వసూళ్లు తగ్గడంతో సినిమా హాళ్ల యజమానులు తీవ్ర నష్టాలను చవిచూశారు. సరిగ్గా అప్పుడే వారంతా సినిమా హాళ్లను లీజుకు ఇవ్వడం ప్రారంభించారు. దాంతో రెండు రాష్ట్రాల్లోని వందలాది సినిమాహాళ్లు లీజులతో కొంతమంది చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఫలితంగా సినిమాల విడుదల విషయంలో లీజుదార్ల ఇష్టాయిష్టాలు ప్రధాన పాత్ర పోషించడం ఆరంభమైంది.

ఇట్లా పంపిణీరంగం కొన్నేండ్లుగా ఒడిదొడుకులకు గురై ఎగ్జిబిషన్ మేనేజ్‌మెంట్ ఫలితంగా మొత్తం సినిమా రంగాన్ని కొన్ని వర్గాలు గుత్తాధిపత్యంలోకి తెచ్చుకొని మొత్తం సినిమా రంగాన్ని నిర్దేశించే పరిస్థితి ఏర్పడింది. దాని ఫలితంగా చిన్న సినిమాలు తీవ్రమైన ఒత్తిడికి గురయ్యాయి. అది అందరూ అంగీకరిస్తున్నదే. సినిమా ఆవిర్భవించిన తొలినాళ్లలో స్టూడియోల ఆధిపత్యం నడిచింది. తర్వాత హీరోయిజం పెరిగి వారి ఆధిపత్యం కొనసాగింది. అనంతరకాలంలో సినిమాహాళ్ళ, లీజుదారుల చేతుల్లోకి సినిమారంగం వెళ్లిపోయింది. ఏ ఆధిపత్యమైనా సమాజంలో కొంతకాలమే నడుస్తుంది కనుక ఇప్పుడు ప్రదర్శనారంగంలో సంక్షోభం మొదలైంది. ఫలితంగా వినోదం కాస్తా వివాదంలో పడిపోయింది. పంపిణీరంగాన్ని నియంత్రిస్తూ వచ్చిన వర్గాలకు సాంకేతికంగా వచ్చినమార్పులు అశనిపాతంగా మారాయి.

సినిమా నిర్మాణ రంగంలో సెల్యులాయిడ్ కాలం పోయి డిజిటల్ తరం ఆరంభమైన తొలినాళ్లలో దాని ప్రభావం నిర్మాణ రీతికే పరిమితమవుతుందనుకున్నారు. రీళ్లు పోయి సాఫ్ట్‌వేర్ తెర మీదికి రావడంతో ఫిల్మ్‌బాక్సులు పోయి ఆధునికమైన హార్డ్ డిస్కులతో మొదలై ఉపగ్రహాల ద్వారా సినిమాహాళ్లకు నేరుగా సినిమాను ప్రదర్శించే వసతులు ఏర్పడ్డాయి. పర్యవసానంగా సర్వీస్ ప్రొవైడర్ల యుగం ఆరంభమైంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 900కు పైగా సింగిల్ స్క్రీన్ హాళ్లు, 200కు పైగా మల్టీ ప్లెక్స్ దాంతో చర్చలు సమ్మెలు మొదలుపెట్టారు. డిజిటల్ ప్రొవైడర్లు మొత్తం జాతీయస్థాయి వ్యాపార లక్ష్యాలతో వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాహాళ్ల మూసివేత బహుశా ఎంతోకాలం కొనసాగక పోవచ్చు. త్వరలోనే ఒప్పందం కుదిరిపోవచ్చు. కానీ ఈ సమ్మె వల్ల పెద్ద నిర్మాతలకు పెద్ద సినిమాలకు ఎలాంటి ప్రమాదం లేకుండా చూసుకొనే సమ్మెకు దిగారు. జాయింట్ యాక్షన్ కమిటీ సమ్మెకు దిగిన ఈ సమయంలో పెద్ద సినిమాలేవీ విడుదలకు లేవు కాబట్టి వాళ్లంతా సేఫ్. ఇక ప్రస్తుతం థియేటర్లలో ఆడుతున్నది. అధిక శాతం చిన్న సినిమాలే. కనుక నష్టపోయేది చిన్నవాళ్లే. పోట్లాడే పోట్లగిత్తల కాళ్ల కింద పడి నలిగిపోయేది చిన్న లేగ దూడలే.

ఇదిలా ఉంటే పంపిణీ రంగం భవిష్యత్తు మరింత ప్రమాదంలో పడిపోయే స్థితి కూడా ఉన్నది. ఇంటింటికీ ఇంటర్నెట్ వినియోగం, అరచేతిలో స్మార్ట్ ఫోన్లు రావడంతో అంతర్జాలం మొత్తంగా అవరించిపోతున్నది. సినిమాల విషయం వచ్చేసరికి యూట్యూబ్ ప్రమాదాన్ని మించి నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ వీడియో లాంటి ఆన్‌లైన్ సినిమా ప్లాట్‌ఫాంలు వెల్లువలా ముంచుకు వస్తున్నాయి. పాత సినిమాలతో పాటు సరికొత్త సినిమాలను కూడా అవి విడుదల చేస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను చేరుకుంటున్నాయి. ఫలితంగా సరికొత్త సినిమా తెరలు ఆవిష్కృతమవుతున్నాయి. ప్రస్తుతానికి ఆ ప్లాట్‌ఫారమ్స్ అతి తక్కువ ధరలకు లెక్కలేనన్ని సినిమాలను అందుబాటులోకి తెచ్చాయి. వాటి విస్తృతి క్రమంగా పెరిగి సినిమాహాళ్లకు, పంపిణీ రంగానికి పెద్ద సవాల్‌గా మారే ప్రమాదం పొంచి ఉన్నది. ప్రస్తుతానికి మాత్రం జాయింట్ యాక్షన్ కమిటీకి సర్వీస్ ప్రొవైడర్లకు నడుమ వర్చువల్ ప్రింట్ ఫీజు విషయంలో ఒక ఒప్పందం కుదిరి వినోదంలోని వివాదం అంతరిస్తుందని ఆశిద్దాం. ఎప్పటిలాగే సాధారణ ప్రేక్షకులకు వినోదాన్ని అందించే పని మొదలవుతుందని కోరుకుందాం.



ఎంతోమంది మహిళలు హోలీ సంబురాలు జరుపుకోవలసింది. కానీ హోలీ ఆడటానికే భయపడుతున్నారు. మనం ఒక ప్రశ్న వేసుకోవాలె. ఏహ్ కహా ఆగయే హమ్.

రాజ్‌దీప్ సర్దేశాయ్



అద్భుతమైన ద్వంద్వ ప్రమాణాలు, ఆశ్చర్యకరమైనరీతిలో వివక్ష! నీరవ్ మోదీ, లలిత్ మోదీ, మాల్యా పారిపోతున్నా ఆపలేదు. కార్తీని మాత్రం విదేశాల నుంచి దేశంలో అడుగు పెట్టగానే అరెస్టు!!

అభిషేక్ సింఘ్వి



అన్ని ఫొటోలలో కార్తీ చిదంబరం చేయి ఊపుతున్న ఫొటో! ఆయనేదో శత్రు భూభాగాన్ని జయించి దేశానికి తిరిగి వచ్చినట్టు! నేనేమీ తక్కువకాదు అన్నట్టు-ఆయన న్యాయవాది అభిషేక్ సింఘ్వి కూడా న్యాయస్థానానికి చేరుకోగానే విక్టరీ సింబల్ చూపించారు.

కిరెన్ రిజిజు



కార్తీ చిదంబరం అరెస్టు జరిగింది. మోదీ ఇంకా నీరవ్ మోదీ కుంభకోణం నుంచి దృష్టి మళ్లించడానికి కొత్త వార్తలు సృష్టిస్తున్నారా?

స్వాతి చతుర్వేది

పరోక్ష ఎన్నికే మంచిది

గ్రామ పాలన

పుల్లూరి జగదీశ్వర్ రావు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంచెలంచెలుగా పాలనారంగంలో సంస్కరణలు చేపడుతూ బంగారు తెలంగాణ దిశగా అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగా జిల్లాల పునర్విభజన జరిగింది. జిల్లా కేంద్రాలు ప్రజల ముంగిటకు చేరుకున్నాయి. ప్రజలకు దూరభారం తగ్గింది. అధికారుల పర్యవేక్షణ ఎక్కువైంది. తద్వారా పౌరసేవలు మెరుగయ్యాయి. అదేబాటలో మండలాల సంఖ్యను పెంచారు. చివరగా అతి ముఖ్యమైన గ్రామ పంచాయతీల పై ప్రభుత్వం దృష్టి సారించింది. తండాలకు గ్రామ పంచాయతీ హోదా కల్పించనున్నారు. అదేవిధంగా మరికొన్ని ఆవాస ప్రాంతాలను సైతం నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయనున్నారు. ఇదివరకున్న 8 వేల పైచిలుకు గ్రామ పంచాయతీలకు, మరో నాలుగు వేల నూతన గ్రామపంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి.

ప్రస్తుతం ఉన్న గ్రామ పంచాయతీ చట్టం లోపభూయిష్టమైందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం, దాని స్థానంలో మెరుగైన చట్టాన్ని తీసుకురావడానికి కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా, పంచాయితీశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో ఏడుగురి సభ్యుల కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న చట్టాలను అధ్యయనం చేసి అనేక సూచనలు చేస్తూ కమిటీ నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు అందజేసింది.

గతంలో గ్రామీణాభివృద్ధి కుంటుబడిందని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. కోట్లాది రూపాయలు ఖర్చుచేసినా ఫలితం ఆశించినట్లుగా లేదని, నిధుల దుర్వినియోగం ఎక్కువగా ఉందని అభిప్రాయపడ్డారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని పకడ్బందీగా చట్టాన్ని రూపొందించాలన్న ఆలోచనతో ముసాయిదా బిల్లును తయారుచేస్తున్నారు.

ముసాయిదా బిల్లు బహిర్గతం కాకపోయినప్పటికీ, సర్పంచ్ ఎన్నిక ప్రత్యక్ష పద్ధతి ద్వారా కాకుండా పరోక్ష పద్ధతి ద్వారా ఎన్నుకోవాలన్న ప్రతిపాదన చర్చనీయాంశమైంది. దీన్ని కొన్ని వర్గాలు, కొన్ని రాజకీయ పార్టీలు వివాదాస్పదం చేస్తున్నాయి. ఈ పద్ధతి కర్ణాటక, పంజాబ్, జమ్ముకశ్మీర్‌లాంటి రాష్ట్రాల్లో అమల్లో ఉన్నది. ఇప్పుడున్న పరిస్థితుల్లో సర్పంచ్ ఎన్నికకు పరోక్ష పద్ధతే మెరుగైంది. మన రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటుచేయనున్న గ్రామ పం చాయతీలతో కలుపుకొని 12 వేలు ఉన్నాయి. అందులో 80 శాతం గ్రామ పంచాయతీలు మైనర్ పంచాయతీలే. వీటి జనాభా నాలుగువేల లోపే. ఈ పంచాయతీల్లో వార్డులు సైతం పదిలోపే. ఈ వార్డులను రిజర్వేషన్ల వారీగా కేటాయిస్తే, జనరల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు రెండు లేదా మూడు వార్డులకు మించిరావు. ఇందులో మళ్లీ మహిళలకు 50 శాతం రిజర్వు చేయాలి. ఉదాహరణకు ఒక గ్రామం ఎస్సీ మహిళా సర్పంచ్ పదవికి కేటాయిస్తే, ఆ గ్రామంలో ఒకే వార్డు నుంచి ఎవరు గెలిచినా ఆ గ్రామానికి సర్పంచ్‌గా ఎన్నిక వుతారు. వార్డుల్లో పోటీ తక్కువగా ఉంటుంది. ఖర్చు తక్కువ. అర్థబలం, అంగబలం పాత్ర అతి తక్కువగా ఉంటుంది.

అందుకు భిన్నంగా ప్రత్యక్ష పద్ధతి అయితే రిజర్వ్ చేయబడిన సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు గ్రామంలోని అన్నివర్గాల ప్రజల ఆమోదం కోసం లక్షలాది రూపాయలు ఖర్చుచేయాల్సి వస్తుంది. ఇలా డబ్బు ఖర్చుపెట్టి గెలిచిన సర్పంచులు ప్రజా సం క్షేమం పక్కనపెట్టి, ఖర్చుపెట్టిన డబ్బు ఎలా రాబట్టుకోవాలో ఆలోచిస్తారు. కొంతమంది నిధుల దుర్వినియోగానికి పాల్పడే అవకాశం ఉన్నది. రాష్ట్రంలో నిధుల దుర్వినియోగం అభియోగాలపై సుమారు 800 మంది సర్పంచుల చెక్ పవర్ రద్దుచేశారు. మరి కొంతమందిపై అనర్హతవేటు కత్తి వేలాడుతున్నది.

సర్పంచ్ ఎన్నికల ఖర్చు తగ్గించడానికి, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు సులువుగా గెలువడానికి పరోక్ష పద్ధతే సరైంది. ప్రచార వ్యవధి మూడు రోజులకు కుదిస్తే మరీ మంచిది. పోటీపడిన అభ్యర్థుల గుణగణాలు గ్రామంలోని ప్రతి ఒక్కరికీ ముందే తెలుసు కనుక ఆ వ్యవధి సరిపోతుంది.

రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టుగా, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కనీస విద్యార్హత పదోతరగతిగా నిర్ధారించాలి. అక్షరాస్యత లేని సర్పంచులవల్ల పలు సమస్యలు ఉత్పన్నమవు తున్నాయి. ఉత్తర్వులు చదివి వినిపించాల్సి వస్తున్నది. అధికారులు ఏమి రాసుకున్నారో తమకు తెలియదని వాపోతున్నారు. కొంతమంది గ్రామ కార్యదర్శులు ఈ సర్పంచుల ను తప్పుదోవ పట్టిస్తున్న పరిస్థితి ఉన్నది. అదేవిధంగా కొంతమంది సర్పంచులు తప్పంతా కార్యదర్శులదేనని అంటూ తప్పించుకుంటున్నారు. అందువల్ల నిరక్షరాస్యులైన వ్యక్తులకు సర్పంచ్ పదవులకు నిలబడే అర్హత లేకపోవడమే సరైన నిర్ణయం.

పరోక్ష ఎన్నిక ద్వారా సర్పంచిగా ఎన్నికైతే వార్డుమెంబర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తుందని వారి చేతిలో కీలుబొమ్మ అవుతారని ఆరోపణ. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామాల్లో అస్థిరత్వం నెలకొంటుందని, తద్వారా అభివృద్ధి కుంటుపడుతుందని వాదిస్తున్నారు. ఒకసారి సర్పంచ్ పదవికి ఎన్నికైన తర్వాత, మూడేండ్ల వరకు అవిశ్వాసం పెట్టే వీలులేకుండా చట్టంలో పొందుపర్చాలి. ఆ తర్వాత ఒక్కసారికి మించి అవకాశం కల్పించకూడదు. ఈ నిబంధనల వల్ల సర్పంచ్ పదవికి ఏ ఇబ్బంది ఉండదు. అస్థిరత్వానికి తావుండదు.

> నూతనంగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రతినిధులకు, పంచాయతీరాజ్ చట్టం గురించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, నిధులు, విధులపై అవగాహన కల్పించడానికి ఎన్నికైన వారికి నెలరోజుల పాటు శిక్షణ ఇవ్వాలి. ఆ తర్వాతనే పదవీ బాధ్యతలను అప్పగించాలి. అప్పుడు గ్రామాలు అభివృద్ధి బాట పడుతాయి. నిరుద్యోగం తగ్గుముఖం పడుతుంది. వలసల వేగం తగ్గిపోతుంది. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య భావన సాకల్యమవుతుంది.

భారతదేశంలో ఏ స్థాయిలోనూ లేని ప్రత్యక్ష పద్ధతి, సర్పంచ్ పదవికి ఎందుకో అర్థం కాదు. నిజానికి, ప్రత్యక్ష పద్ధతి వల్ల ఎన్నికైన సర్పంచ్ ఏకపక్షంగా నియంతలా వ్యవహరించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.


విఫల సర్పంచులను తొలిగించే నిబంధనలను సైతం చట్టంలో పొందుపర్చాలి. ఖర్చుచేసే ప్రతి పైసాకు సర్పంచ్‌ను బాధ్యున్ని చేయాలి. గ్రామ సభలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి. గ్రామసభలకు ప్రజలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి. గ్రామ స్థాయిలో సంక్షేమ పథకాల అమలు, వివిధ అభివృద్ధి పథకాల లబ్ధిదారుల ఎంపిక అంతా పారదర్శకంగా, రాజకీయ ఒత్తిడిలకు అతీతంగా ఉండేలా చర్యలు ఉండాలి.

73వ రాజ్యాంగ సవరణలో సూచించిన 29 అంశాలను గ్రామ పంచాయతీలకే దాఖలు పరుచాలి. ప్రతి చిన్న అంశానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైపు చూడకుండా, స్వతంత్రంగా నిధులు సమకూర్చుకునేలా ప్రోత్సహించాలి.

నూతనంగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రతినిధులకు, పంచాయతీ రాజ్ చట్టం గురించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు, నిధులు, విధులపై అవగాహన కల్పించడానికి ఎన్నికైన వారికి నెలరోజుల పాటు శిక్షణ ఇవ్వాలి. ఆ తర్వాతనే పదవీ బాధ్యతలను అప్పగించాలి. అప్పుడు గ్రామాలు అభివృద్ధి బాట పడుతాయి. నిరుద్యోగం తగ్గుముఖం పడుతుంది. వలసల వేగం తగ్గిపోతుంది. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య భావన సాకల్యమవుతుంది. ఈ విధమైన విధివిధానాలతో తెలంగాణ గ్రామీణ సమాజం ముందుకుపోతే, గ్రామీణాభివృద్ధిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శమవుతుందనడంలో సందేహం లేదు. తెలంగాణ పునర్నిర్మాణానికి, బంగారు తెలంగాణ ఆవిష్కరణకు ఈ విధమైన విధాన నిర్ణయాలు ఎంతో దోహదం చేస్తాయి. తెలంగాణ పునర్నిర్మాణానికి సరికొత్త బాటన పయనిద్దాం. గ్రామీణ సమాజాన్ని ప్రజాస్వామీకరించుకొని అభివృద్ధి బాటన సాగిపోదాం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

ఎర్రకోట కైవసం



ఓట్లు గెలిచినా సీట్లు రాని సీపీఎం
చలో పల్టాయికి స్పందించిన త్రిపుర ప్రజలు
సీఎంగా బిప్లవ్ దేవ్‌ను ఎన్నుకొనే అవకాశం


త్రిపురలో బీజేపీ మహిళా కార్యకర్తల సంబురాలు

అగర్తలా: త్రిపురలో 25 ఏండ్ల వామపక్ష ప్రభుత్వానికి బీ జేపీ చరమగీతం పాడింది. ఇండిజినస్ పీపుల్స్ ఫ్రం ట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్‌టీ) అనే ప్రాంతీయ పార్టీతో జత కట్టిన బీజేపీ అసెంబ్లీలోని 60 సీట్లకు 43 సీట్ల ను కైవసం చేసుకుంది. సీపీఎం 16 సీట్లతో సరిపెట్టుకుంది. గతనెల 18న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జ రుగగా శనివారం ఓట్లను లెక్కించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ కూటమి సంపూర్ణ మెజారిటీని సాధించింది. 2013లో జరిగిన ఎన్నికల్లో 1.7 % ఓట్లతో ఖాతా కూడా తెరువని బీజేపీ ఈసారి ఏకంగా అధికారానికి రావడం విశేషం. త్రిపురలో రెండుసార్లు ప్రభుత్వం ఏర్పాటుచేసి, సుదీర్ఘ కాలం ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఈసారి ఖాతా తెరువలేదు. ఆ పార్టీ అభ్యర్థులు దాదాపు అన్ని స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయారు. త్రిపురలోని తృణమూల్ కాంగ్రెస్ శాఖ త మ పార్టీలో విలీనం కావడం, సీపీఎం పట్ల ప్రజల వ్యతిరేకత తమకు ఈ విజయాన్ని తెచ్చి పెట్టిందని బీజేపీ కీలకనేత, అసోం విద్యా శాఖ మంత్రి హి మంత బిశ్వ వర్మ అన్నారు. త్రిపురలో తమ సీఎం అభ్యర్థిని బీజేపీ ప్రకటించకున్నా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బిప్లవ్ దేవ్‌ను శాసనసభాపక్ష నేతగా ఎన్నుకోవచ్చని భావిస్తున్నారు. రాష్ట్రంలో బీజేపీ విజయం ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా వల్లే సాధ్యమైందని బిప్లవ్ దేవ్ చెప్పారు. న్యూఢిల్లీలో సమావేశమయ్యే బీజేపీ పార్లమెంటరీ బోర్డు సీఎం ను నిర్ణయిస్తుందన్నారు. 'చలో పల్టాయి (మార్పు తెద్దాం)' అని తమ పిలుపునకు త్రిపుర ప్రజలు స్పం దించారని చెప్పారు. యువతను తమవైపుకు తిప్పుకున్న బీజేపీ సీపీఎంకు బలమైన స్థావరమైన గిరిజన సీట్లపై దృష్టి కేంద్రీకరించింది. గిరిజనులకు రిజర్వు చేసిన మొత్తం 20 సీట్లను బీజేపీ కూటమి గెలుచుకుంది. ఐపీఎఫ్‌టీ ప్రధాన కార్యదర్శి మేవాట్ జమాతియా ఏడువేల ఓట్ల భారీ మెజారిటీతో గెలి చారు. 2013 ఎన్నికల్లో బీజేపీ 50 సీట్లలో పోటీ చే యగా, 49 స్థానాల్లో డిపాజిట్లు సైతం దక్కలేదు. సీపీఎం 55 సీట్లలో పోటీ చేసి 49 గెలుచుకోగా, 48 సీట్లలో పోటీపడిన కాంగ్రెస్ 10 చోట్ల విజయం సా ధించింది. సీపీఎం ఈసారి అధికారం కోల్పోయినా 43% ఓట్లను పొందింది. గత ఎన్నికల్లో 1.7% ఓ ట్లు పొందిన బీజేపీ ఈసారి 42.8% ఓట్లను పొం దింది. బీజేపీ మిత్రపక్షం ఐపీఎఫ్‌టీ 7.7% ఓట్లు పొందింది.

బీజేపీ భారీగా డబ్బు గుమ్మరించింది: సీపీఎం

త్రిపురలో ఓటమిని సీపీఎం అంగీకరించింది. ఇతర అంశాలతోపాటు ఎన్నికలను ప్రభావితం చేసేందుకు బీజేపీ భారీగా డబ్బు గుమ్మరించిందని ఆ పార్టీ ఆరోపించింది. ఎన్నికల ఫలితాల అనంతరం సీపీఎం ఒక ప్రకటన విడుదల చేస్తూ త్రిపురలో 43 శాతం మంది ఓటర్లు తమకు ఓటు వేసినందుకు కృతజ్ఞతలు తెలిపింది. ఓటమికి గల కారణాలను జాగ్రత్తగా విశ్లేషిస్తామని, అనంతరం తగు చర్యలు తీసుకుంటామని తెలిపింది.



శనివారం ఢిల్లీలో బీజేపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా.. ఢిల్లీలో బీజేపీ కార్యకర్తల ప్రదర్శన

ఎదురులేని కమలం

త్రిపుర ఎర్రకోటలో కాషాయ జెండా ■ 25 ఏండ్ల వామపక్ష పాలనకు చరమగీతం
నాగాలాండ్‌లోనూ బీజేపీదే హవా ■ హంగ్ దిశగా మేఘాలయ ■ కాంగ్రెస్‌కు మింగుడుపడని ఫలితాలు

అగర్తలా/షిల్లాంగ్/కోహిమా, మార్చి 3:

రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అప్రతిహతంగా సాగిపోతున్న బీజేపీ మరోసారి తన విజయపరంపరను కొనసాగించింది. ఈశాన్య భారతంలోని మూడు రాష్ట్రాల ఎన్నికల్లో తన సత్తా చాటింది. త్రిపురలో తమ సైద్ధాంతిక ప్రత్యర్థి సీపీఎంను దెబ్బతీసి పూర్తి మెజారిటీ సాధించిన బీజేపీ, నాగాలాండ్‌లో మిత్రపక్షంతో కలిసి ప్రభుత్వ ఏర్పాటు కు పావులు కదుపుతున్నది. ఎవరికీ సంపూర్ణ మెజా రిటీ రాని మేఘాలయలోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తా మని చెబుతున్నది. ఇప్పటికే దేశంలోని 29 రాష్ట్రాలకు 19 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ ఈశాన్యంలో సైతం తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. అసోం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్ ఇప్పటికే ఆ పార్టీ చేతిలో ఉండగా, తాజాగా త్రిపుర, నాగాలాండ్‌తోపాటు మే ఘాలయ కూడా దాని ఖాతాలో చేరనున్నట్టు తెలుస్తున్న ది. అధికారంలో ఉన్న ప్రభుత్వాల పట్ల వ్యతిరేకత, ప్రాంతీయ పక్షాలతో పొత్తులు బీజేపీకి అనూహ్య ఫలితాలను తెచ్చిపెట్టాయి. త్రిపుర, నాగా లాండ్‌లో కాంగ్రెస్‌కు ఒక్కసీటు కూడా లభించలేదు. పదేండ్లుగా అధికారంలో ఉన్న మేఘాలయలో సంపూర్ణ మెజారిటీకి పది సీట్ల దూరంలో ఆగిపోయింది. మేఘాలయ ఓటర్లు ఏ పార్టీకి సంపూర్ణ మెజారిటీని ఇవ్వలేదు. మూడు రాష్ట్రాలలోను 60 చొప్పున అసెంబ్లీ సీట్లు ఉండగా, వేర్వేరు కారణాలతో 59 స్థానాలకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. ఐదేండ్ల క్రితం త్రిపుర అసెంబ్లీలో కనీసం ఉనికి కూడా లేని బీజేపీ ఈసారి ఏకంగా అధికారాన్ని కైవసం చేసుకుంది. త్రిపురలో బీజేపీ సొంతంగా 35 సీట్లు గెలుపొందగా, దాని మిత్రపక్షం ఐపీఎఫ్‌టీ 8 సీట్లను గెలుపొందింది.25 ఏం డ్లుగా అధికారంలో ఉన్న సీపీఎం 16 సీట్లను మాత్రమే గెలుచుకుంది. త్రిపుర ఫలితాలపై ప్రధాని మోదీ స్పందిస్తూ, 'ఈ ప్రయాణం శూన్యం నుంచి శిఖరానికి చేరింది' అని అన్నారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యా లయంలో పార్టీ కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడు తూ, బీజేపీ విజయ పరంపరకు ప్రధాన 'రూపశిల్పి' అధ్యక్షుడు అమిత్ షా అని అభివర్ణించారు. నాగాలాండ్ లో ఏ పార్టీకి సంపూర్ణ మెజారిటీ రాలేదు. ఎన్‌పీఎఫ్ నేత, సీఎం టీఆర్ జేలియాంగ్ తమ ప్రభుత్వంలో చేరా లని బీజేపీని ఆహ్వానించారు. నాగా లాండ్‌లో ఎన్‌పీఎఫ్ 27 సీట్లతో ఏకైక పెద్ద పార్టీగా అవతరించింది. ఎన్‌డీపీపీ 18 సీట్లతో రెండోస్థానంలో నిలిచింది. బీజేపీకి 11 సీట్లు లభించాయి. మేఘాలయ లో కాంగ్రెస్ 21 స్థానాలను గెలుచుకోగా, ఎన్‌పీపీ 19 సీట్లతో రెండో స్థానంలో నిలిచింది. యూడీపీ ఆరు, పీడీఎఫ్ 4, బీజేపీ రెండు సీట్లను గెలుచుకున్నాయి. ఇతర ప్రాంతీయ పార్టీలు, ఇండిపెండెంట్లు 7 స్థానాల్లో గెలుపొందారు.

> **శూన్యం నుంచి శిఖరానికి చేరాం**
>
> 'త్రిపురలో 25 ఏండ్లపాటు అధికారంలో ఉన్న కామ్రేడ్‌లు ఓడిపోవడం, బీజేపీ గెలువడం మామూలు విషయం కాదు. శూన్యం నుంచి శిఖరానికి చేరాం. ఇది గొప్ప విజయం. ప్రజాస్వామ్య విజయం. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ హోదా పెరిగినా ఆయన వ్యక్తిత్వం, ఆయనపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతున్నది. త్రిపుర, నాగాలాండ్‌లో ఆ పార్టీ ఖాతా కూడా తెరువలేదు. కర్ణాటకలోనూ మేమే గెలుస్తాం. బీజేపీపై నమ్మకాన్ని ఉంచి అధికారం అప్పగించిన త్రిపుర ప్రజలకు ఎలా కృతజ్ఞతలు తెలుపాలో అర్థం కావడం లేదు. మీ రుణం తీర్చుకుంటా. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి, ఎన్నికల్లో విజ యానికి కృషి చేసిన ప్రతి బీజేపీ కార్యకర్తకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. మేఘాలయ, నాగాలాండ్‌లోనూ బీజేపీకి మద్దతు తెలిపిన ప్రజలకు కృతజ్ఞతలు'
>
> **-ప్రధాని మోదీ**


> **ప్రధాని విధానాలకు ప్రజల ఆమోదముద్ర**
>
> 'లెఫ్ట్(వామపక్షాలు) పార్టీలు ఈ దేశానికి రైట్ కాదని త్రిపుర ఫలితాలతో రుజు వైంది. దేశాభివృద్ధి కోసం ప్రధాని అమలు చేస్తు న్న విధానాలకు లభించిన విజయమిది. ఈ గెలుపు చారిత్రాత్మకం. వీటి ప్రభావం త్వరలో జరిగే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలపైనా పడనుంది. ఆ ఎన్నికల్లోనూ మే మే గెలుస్తాం. ఇన్ని రోజులు బీజేపీ ఉత్తరాదికే పరిమితమని ప్రచారం జరిగింది. కానీ, దేశ ప్రజలంతా మాకు మద్దతు ఇస్తున్నారు. కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశాలోనూ గెలిస్తే ఇక బీజేపీ కి స్వర్ణయుగమే. బీజేపీకి బ్రహ్మరథం పట్టిన ఈశాన్య ప్రజలకు, పార్టీ గెలుపు కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు. ఆదివారం దేశవ్యాప్తంగా విజయోత్సవాలు జరుపుకుంటాం.
>
> **-అమిత్ షా(బీజేపీ జాతీయ అధ్యక్షుడు)**

కాంగ్రెస్ అస్త్రసన్యాసం!

■ స్పష్టతలేని కేంద్ర నాయకత్వం

న్యూఢిల్లీ: నీరసంగా ప్రచారం, వామపక్షాలతో లోపాయకారీ అవగాహన, పోరాట రాహిత్యం, వనరుల కొరత, దృఢమైన కేంద్ర నాయకత్వం లేమి తదితర కారణాలు ఈశాన్యంలో కాంగ్రెస్ పుట్టి ముంచాయి. మేఘాలయలోనే ఆ పార్టీ కొంతమేర ప్రభావం చూపింది. త్రిపుర, నాగాలాండ్‌లో దశాబ్దాలుగా క్షీణిస్తున్న కాంగ్రెస్ రాజకీయ ప్రభ.. తాజా ఫలితాలతో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. త్రిపురలో వామపక్షాలతో వ్యూహాత్మక అవగాహనతో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఓటుబ్యాంకును బీజేపీ పూర్తిగా లాగేసుకున్నది. 2013లో 48 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్.. 36.53% ఓట్లతో పది సీట్లను గెలుచుకున్నది. ప్రస్తుత ఎన్నికల్లో కేవలం 1.8% ఓట్లతో ఒక్క స్థానాన్నీ పొందలేకపోయింది. సీపీఎంకు సహకరించాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ చేసిన రాజకీయం బెడిసికొట్టడంతోపాటు లెఫ్ట్ వ్యతిరేక ఓట్లన్నీ ఏకీకృతమయ్యేలా చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ త్రిపురలో ఒక్క సభలో ప్రసంగించారు. నాగాలాండ్‌లో కాంగ్రెస్ పార్టీ అసలు ఉనికే లేదు. అభ్యర్థులను వెతుక్కోవడమే కష్టంగా మారడంతో వారికి నిధులు సమకూర్చలేకపోయింది. నిధుల కొరతతోఐదుగురు కాంగ్రెస్ అభ్యర్థులు తమ నామినేషన్లను వెనుకకు తీసుకున్నారు. కేవలం 18 స్థానాలకు మాత్రమే కాంగ్రెస్ పోటీ చేసింది. 2013లో 56 స్థానాలకు పోటీచేసి 8 చోట్ల విజయం సాధించిన కాంగ్రెస్‌కు 24.89 శాతం ఓట్లు లభించాయి. ఈసారి ఆ స్ఫూర్తిని కాంగ్రెస్ చూపలేకపోయింది. కాంగ్రెస్ ప్రస్తుత దుస్థితికి పార్టీ ఈశాన్య రాష్ట్రాల ఇంచార్జి సీపీ జోషీనే కారణమని నాగాలాండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేవ్ ఖేప్ థేరీ ఆరోపించారు. నాగాలాండ్‌లోనే కాక మొత్తం ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను జోషీ క్రమపద్ధతిలో నాశనం చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. రెండేండ్లుగా ఆయన రాష్ట్రానికి రాలేదని చెప్పారు. కాంగ్రెస్ నాగాలాండ్‌ను మాత్రమే కాక మొత్తం ఈశాన్య ప్రాంతాన్ని వదిలేసిందన్నారు.

నాగాలాండ్‌లో హోరాహోరి



చెరో 29 స్థానాలను కైవసం చేసుకున్న ఎన్‌పీఎఫ్; ఎన్‌డీపీపీ- బీజేపీ కూటమి
ఎన్‌డీపీపీ-బీజేపీకి మద్దతు ప్రకటించిన ఇద్దరు అభ్యర్థులు


సీఎం జెలియాంగ్


నెఫియో రియో

కోహిమా, మార్చి3: నాగాలాండ్‌లో బీజేపీ తన మిత్రపక్షం నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ)తో కలిసి అధికారం చేజిక్కుంచుకునే దిశగా కదులుతున్నది. మొత్తం 60 స్థానాల అసెంబ్లీలో బీజేపీ 11 స్థానాల్లో విజయం సాధించగా, ఎన్‌డీపీపీ 18 సీట్లను కైవసం చేసుకున్నది. ఒక స్వతంత్ర అభ్యర్థి సహా జనతాదళ్ (యు) పార్టీ తరపున గెలిచిన అభ్యర్థి కూడా మద్దతు తెలపడంతో ఎన్‌డీపీపీ కూటమికి అధికార పీఠం దక్కటం ఖాయంగా కనిపిస్తున్నది. హోరాహోరీగా కొనసాగిన కౌంటింగ్‌లో బీజేపీ-ఎన్‌డీపీపీ కూటమి, ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్)లు చెరో 29 స్థానాలను కైవసం చేసుకుని సమఉజ్జీలుగా నిలిచాయి. ఎన్‌పీఎఫ్ అతిపెద్దపార్టీగా అవతరించింది. ప్రభుత్వం ఏర్పాటులో మిగిలిన ఇద్దరు ఎమ్మెల్యేల పాత్ర కీలకంగా మారింది. మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకు గాను 59 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఉత్తర అంగామి-2 నియోజకవర్గం నుంచి ఎన్‌డీపీపీ ముఖ్యమంత్రి అభ్యర్థి అయిన నెపియో రియో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దాంతో మిగిలిన 59 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ నంబర్ 31ని చేరుకోవడంలో ఇరుపక్షాలు విఫలమయ్యాయి. దాంతో స్వతంత్రులుగా విజయం సాధించిన ఇద్దరు కీలకమయ్యారు. అయితే, వారిద్దరూ బీజేపీ-ఎన్‌డీపీపీ కూటమికి మద్దతు ఇస్తున్నట్లు వెల్లడయ్యింది. దీంతో బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చే అవకాశాలు మెరుగయ్యాయి. వాస్తవానికి, ఈ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు వరకూ బీజేపీ.. అధికారపక్షం ఎన్‌పీఎఫ్‌తో కలిసి ఉంది. ఎన్నికల సమయంలో ఆ పార్టీని వీడి ఎన్‌డీపీపీతో చేతులు కలిపింది. అయితే, ఈశాన్యరాష్ట్రాల పరిధిలో ఉన్న ఎన్‌డీఏలో మాత్రం ఇప్పటికీ ఎన్‌పీఎఫ్ భాగస్వామ్యపక్షంగా కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో, మరోమారు తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని, వచ్చి తమతో చేతులు కలుపాలని ఎన్‌పీఎఫ్ అధినేత, ముఖ్యమంత్రి టీఆర్ జెలియాంగ్ బీజేపీని ఆహ్వానించారు.

ముఖ్యమంత్రిగా నెఫియో రియో?

బీజేపీ కూటమి అధికారాన్ని చేపడితే ఎన్‌డీపీపీ అధినేత నెఫియో రియో తదుపరి ముఖ్యమంత్రి కానున్నారు. ఆయన గతంలో మూడు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. నెఫియో రియో కోహిమా జిల్లాలోని ఉత్తర అంగామి నియోజకవర్గం నుంచి విజేతగా నిలిచారు. 67 ఏండ్ల రియో 11 సంవత్సరాల పాటు నాగాలాండ్‌కు సీఎంగా ఉన్నారు. తొలిసారి 2003లో ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించారు. మొదట్లో కాంగ్రెస్‌తో ఉన్న ఆయన కొన్ని అంశాల్లో ఆ పార్టీతో విభేదించి ఎన్‌డీపీపీని ఏర్పాటు చేశారు. నాగాలాండ్‌లో తీవ్రస్థాయిలో ఉన్న అవినీతి తగ్గుముఖం పట్టడంలో విశేషంగా కృషి చేసినందునే ప్రజలు రియో వైపు మొగ్గు చూపినట్లుగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.


సీఎం విజయం

నాగాలాండ్ పీపుల్స్ ఫ్రంట్ నాయకుడు, సీఎం టీఆర్ జెలియాంగ్ విజయం సాధించారు. పేరన్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తన సమీప ఎన్‌డీపీపీ అభ్యర్థి ఎన్‌డాంగ్‌పై 5,432 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. జెలియాంగ్‌కు 14,064 ఓట్లు రాగా, ప్రత్యర్థి ఎన్‌డాంగ్‌కు 8,632 ఓట్లు వచ్చాయి. కాగా గత అసెంబ్లీ ఎన్నికల్లో అతితక్కువగా 2,636 ఓట్ల మెజార్టీతో జెలియాంగ్ గట్టెక్కారు.

మేఘాలయలో హంగ్

ప్రభుత్వ ఏర్పాటుకు పావులు కదుపుతున్న కాంగ్రెస్, బీజేపీ
ప్రాంతీయ పార్టీలు, ఇండిపెండెంట్లకు వల


ముకుల్ సంగ్మా



షిల్లాంగ్: మేఘాలయ ఓటర్లు ఏ పార్టీకి స్పష్టమైన మెజారి టీ ఇవ్వలేదు. దీంతో ఆ రాష్ట్రంలో హంగ్ అసెంబ్లీ ఏర్పడింది. ఫలితంగా ప్రాంతీయ పార్టీలు, స్వతంత్రు లు కీలకంగా మారారు. గత పదేండ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఈసారి 21 స్థానాల్లో గెలుపొందింది. బీజేపీ కేవలం రెండు స్థానాల్లోనే గెలిచినా, దాని మిత్రపక్షాలతో కలిసి ఆ కూటమి బలం 27 సీట్లకు చేరుకుంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్లు (31) ఏ పక్షానికీ లభించలేదు. దీంతో 17 సీట్లను గెలుపొందిన ఇతర చిన్న పార్టీలు, స్వ తంత్రుల్లో కొందరినైనా తమవైపు తిప్పుకొనేందుకు ఇరుపక్షాలు పావులు కదుపుతున్నాయి. ఈ ఎన్నికల్లో ఎన్సీపీ ఒక స్థానాన్ని గెలుచుకుంది. బీజేపీ మిత్రపక్షమైన నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) 19 సీట్లను గెలుపొందింది. గోవా, మణిపూర్ రాష్ట్రాలలో అత్యధిక సీ ట్లు గెలిచినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయిన కాంగ్రెస్ ఈసారి ముందు జాగ్రత్తలు తీసుకుంది. ముందే ఆ పార్టీ సీనియర్ నేతలు కమల్‌నాథ్, అహ్మద్‌పటేల్‌ను షిల్లాంగ్‌కు పంపింది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మద్దతును కూడగట్టేందుకు చిన్న పార్టీలు, స్వతంత్రులతో వారు సంప్రదింపులు జరుపుతున్నారు. ఎన్‌పీపీని లోక్‌సభ మాజీ స్పీకర్ పీఏ సంగ్మా స్థాపించగా, ప్రస్తుతం ఆయన కుమారుడు కాన్రాడ్ సంగ్మా నేతృత్వం వహిస్తున్నారు. ఎన్‌పీపీతోపాటు యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీ (యూడీపీ) బీజేపీకి మిత్రపక్షమైనా ఈ ఎన్నికల్లో పొత్తు పెట్టుకొని పో టీ చేయలేదు. యూడీపీ ఆరు స్థానాలను గెలుచుకుం ది. బీజేపీ, ఎన్‌పీపీ, యూడీపీ కలిస్తే వాటి బలం 27 కు చేరుకుంటుంది. ప్రభుత్వ ఏర్పాటుకు వాటికి ఇం కా నలుగురి మద్దతు కావాలి. దీంతో ఆ పార్టీలూ ప్రాంతీయ పార్టీలకు, స్వతం త్రులకు వల వేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. మేఘాలయలో కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటుకు ప్రయత్నిస్తామని బీజే పీ నేత రామ్ మాధవ్ చెప్పా రు. గోవా, మణిపూర్‌ల్లో బీజేపీ నేతలు తమ ఎమ్మెల్యేలను కిడ్నాప్ చేసి అక్కడ ప్రభుత్వాలను ఏర్పాటు చేశారని, ఈసారి వారి ఆటలు సాగనివ్వబోమని కాంగ్రెస్ నేత అశోక్ గెహ్లాట్ అన్నారు. మేఘాలయలో ఈసారీ తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఫలితాలు ఆశించిన రీతిలో రాలేదని, ప్రభుత్వ ఏర్పాటుకు యత్నిస్తామని సీఎం ముకుల్ సంగ్మా అన్నారు. భావ సారూప్య పార్టీల మద్దతుతో తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఎన్‌పీపీ నేత కాన్రాడ్ సంగ్మా స్పష్టం చేశారు.

అసలు విజేత సంఘ్ పరివార్!

ఈశాన్యంలో బీజేపీకి పూలబాటలు వేసిన ఆర్‌ఎస్‌ఎస్ ■ సేవా కార్యక్రమాలతో గిరిజనులకు చేరువ


సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ కార్యకర్తలు

న్యూఢిల్లీ: ఈశాన్యంలో పాగా వేయాలన్న కమలనాథుల కల అంత సులభంగా ఏమీ నెరవేరలేదు. దాని వెనుక ఎన్నో శక్తుల ఉమ్మడి కృషి ఉన్నది. ఒకప్పుడు బీజేపీ జెండా కనపడితే పెద్ద వింత అనుకునే త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ రాష్ట్రాల్లో ఆ పార్టీ ప్రభుత్వాలు ఏర్పాటు చేసే స్థాయికి ఎదిగిందంటే దాని వెనుక ఉన్న కారణాలు ఏమిటి? క్రైస్తవ ఆధిపత్యం ఉన్న ప్రాంతాల్లోకి కాషాయ కూటమి ఎలా చొచ్చుకెళ్లింది? త్రిపురలో 'ఎర్ర' కోటను ఎలా బద్దలు కొట్టింది? ఈశాన్యంలోని దాదాపు అన్ని రాష్ట్రాలను తన గుప్పిట్లోకి ఎలా తెచ్చుకున్నది? ఈ ప్రశ్నలకు సమాధానాన్ని ఆర్‌ఎస్‌ఎస్ కోణం నుంచి అర్థం చేసుకోవాల్సిందే. ఈ మొత్తం విజయం వెనుక ఉన్న అసలు శక్తి ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంఘాలేనని విశ్లేషణలు అంటున్నాయి.

2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే నాగాలాండ్‌కు చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు రాణీ గైదిన్లియుకు భారతరత్న ఇవ్వాలని ఆర్‌ఎస్‌ఎస్ డిమాండ్ చేసింది. ఈశాన్య ప్రాంతంలో మరుగునపడ్డ గొప్ప నేతను గౌరవించాలని కోరింది. ఈ డిమాండ్ ద్వారా బీజేపీ ఈశాన్య ప్రాంతంలో రాజకీయ పూలబాటను వేసుకుంది. రాణి గైదిన్లియు శత జయంతి ఉత్సవాలకు స్వయంగా ప్రధాని నరేంద్రమోదీ హాజరయ్యారు. మరోవైపు ఈ ప్రాంతంలో అభివృద్ధి లేకపోవడం ఆర్‌ఎస్‌ఎస్ క్షేత్రస్థాయికి వెళ్లేలా చేసింది. ఆర్‌ఎస్ఎస్ అనుబంధ సంస్థలు వనవాసీ కల్యాణ ఆశ్రమ్, వనవాసీ కల్యాణ పరిషత్.. వివిధ గిరిజన వర్గాలకు చేరువయ్యాయి. మారుమూల ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, సేవా ప్రాజెక్టులతో సంఘ్ పరివార్ గిరిజనుల మనసును దోచుకున్నది. అసోం, మణిపూర్‌లో బీజేపీ విజయం సాధించాక.. పరివార్ శక్తులు క్రైస్తవ ఆధిక్యం ఉన్న నాగాలాండ్, మేఘాలయ, త్రిపురలపై దృష్టిసారించాయి. ఆర్‌ఎస్‌ఎస్ చూపిన బాటలో దూసుకెళ్లిన కమలదళం.. ఈ మూడు రాష్ట్రాల్లో ప్రబల శక్తిగా ఎదిగింది. ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయేతర సంస్థయినా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల మధ్య పెద్దగా తేడా ఉండదు. వీరి మధ్య ఉన్న అవగాహనే సామాన్య జనంలోకి దూసుకెళ్లేందుకు దోహదపడింది. దీంతోపాటు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రు లు ఈశాన్యంలో తరుచూ పర్యటిస్తూ ప్రజాకర్షక విధానాలను జనం ముందుకు తీసుకెళ్లారు. గత ఏడాది డిసెంబర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భగవత్ త్రిపురలో పర్యటించారు. దీంతోపా టు గువాహటిలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల భారీ సమ్మేళనంలో ప్రసంగించారు. మరోవైపు ఆర్‌ఎస్‌ఎస్ ఈ ప్రాంతంలో తన పంథాకు భిన్నంగా వ్యూహాత్మకంగా వ్యవహరించింది. దేశవ్యాప్తంగా గోహత్యలను తీవ్రంగా వ్యతిరేకించిన ఆ సంస్థ.. ఇక్కడ మౌనంగా ఉంది. మైనార్టీలకు, చర్చిలకు, గిరిజన సంప్రదాయాలకు ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకమని మేఘాలయలో కొంతమంది ప్రచారం చేశారని.. కానీ అవన్నీ తప్పని తేలిందని రాష్ట్ర నేత ఒకరు తెలిపారు. త్రిపురలో ఆర్‌ఎస్‌ఎస్ ఎదుగుదల ఇప్పటికిప్పుడు జరిగింది కాదు. పరివార్, వామపక్ష కార్యకర్తలకు మధ్య తీవ్ర వివాదాలు తలెత్తాయి. తాము వామపక్ష ప్రభుత్వ పాలనలోని లోపాలే ఎత్తిచూపడంతో ప్రజలు తమ వైపు నిలిచారని బీజేపీ త్రిపుర ఇంచార్జి సునీల్ దియోధర్ తెలిపారు.

నిన్నటి జిమ్ శిక్షకుడే.. రేపటి త్రిపుర ముఖ్యమంత్రి!

■ ఢిల్లీలో చదువుకుంటూ జిమ్‌లో పనిచేసిన బిప్లబ్ కుమార్ దేబ్
■ ఆరెస్సెస్, బీజేపీ నేతలతో సన్నిహిత సంబంధాలు


విజయోత్సవ ర్యాలీలో రాంమాధవ్‌తో బిప్లబ్ కుమార్

అగర్తలా, మార్చి3: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులతో సన్నిహిత సంబంధాలున్న బిప్లబ్ కుమార్ దేబ్ త్రిపుర ముఖ్యమంత్రి రేసులో ముందంజలో కొనసాగుతున్నారు. ఒకప్పుడు ఆయన జిమ్‌లో శిక్షకుడిగా పనిచేశారు. సుమారు 25 ఏళ్ల పాటు కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న త్రిపురలో... బీజేపీకి పూర్తి మెజార్టీ ఖరారైన నేపథ్యంలో సీఎం ఎవరనేదానిపై జోరుగా చర్చ కొనసాగుతున్నది. ఎవరికి వారు తామే సీఎం అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్నప్పటికీ.. పైకి వినిపిస్తున్న పేర్లలో ఆరెస్సెస్‌కు చెందిన బిప్లబ్ కుమార్ దేబ్ ముందు వరుసలో ఉన్నారు. త్రిపుర రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న బిప్లబ్ కుమార్ దేబ్.. చాలా కాలంగా ఆరెస్సెస్‌లో పనిచేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే సీఎం పదవికి బిప్లబ్ కుమార్ అర్హుడని ప్రీ పోల్ సర్వేలో తేలడంతో ఆయన వైపు బీజేపీ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తున్నది. 15 ఏండ్ల క్రితం ఉన్నత చదువుల నిమిత్తం తన మకాంను ఢిల్లీకి మార్చుకున్న బిప్లబ్ అక్కడ ఓ జిమ్‌లో శిక్షకుడిగా చేరి సేవలందించారు. 'నాకు అప్పగించిన బాధ్యత ఏదైనా స్వీకరిస్తాను. సవాళ్లు స్వీకరించకుండా దూరంగా పారిపోను. ఏది ఏమైనా సీఎంఅభ్యర్థిని నిర్ణయించేది బీజేపీ పార్లమెంటరీ బోర్డే. ఇప్పటికే పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా బాధ్యతల్ని సక్రమంగా నెరవేర్చానని నమ్ముతున్నాను' అని బిప్లబ్ కుమార్ దేబ్ మీడియాకు వెల్లడించారు. గోమతి జిల్లాలోని ఉదయ్‌పూర్ వద్ద ఉన్న కుగ్రామం అక్రబాన్‌లో బిప్లబ్ కుమార్ దేబ్ జన్మించారు. త్రిపుర విశ్వవిద్యాలయం నుంచి బీఏ పట్టా అందుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు.

> **బీజేపీది అధికార దుర్వినియోగం**
>
> 'ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో గెలువడానికి బీజేపీ అధికారాన్ని ఉపయోగించింది. డబ్బులను పంచిపెట్టింది. త్రిపురలో 25 ఏండ్ల వామపక్ష పాలన మరువలేనిది. ఒక్క అవినీతి ఆరోపణ లేకుండా ప్రజలకు మెరుగైన పాలన అందించింది. బీజేపీ-ఆరెస్సెస్‌ను ఎదుర్కోవడానికి లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష భావజాలం కలవారంతా ఏకం కావాలి.
>
> **-డీ రాజా(సీపీఐ జాతీయ కార్యదర్శి)**

> '2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుంది. త్రిపుర, నాగాలాండ్, మేఘాలయలో బీజేపీకి లభించిన ఆదరణే దీనికి నిదర్శనం'
>
> **-అసోం సీఎం సోనోవాల్**

> 'కాంగ్రెస్ ముక్త్ భారత్ దిశగా దేశం పయనిస్తున్నది. ఇది నినాదం కాదు.. ఇది వాస్తవం. త్రిపుర ఎన్నికల ఫలితాల ప్రభావం పశ్చిమబెంగాల్‌పై పడనుంది'
>
> **-కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్**

> 'నాగాలాండ్‌లో భాగస్వామ్య పక్షంతో కలిసి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. అభివృద్ధే లక్ష్యంగా బీజేపీ ముందుకుసాగుతున్నది. నాగాలాండ్‌నూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం'
>
> **-కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**



బసవేశ్వరభవన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ శనివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్. చిత్రంలో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ కూడా ఉన్నారు.



శనివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎర్రోళ్ల శ్రీనివాస్



ఆంధ్రప్రదేశ్ రాజధాని విజయవాడలో ఏర్పాటు చేసిన టీఆర్‌ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించాలని రాష్ట్ర ఎంపీలను ఏపీ టీఆర్‌ఎస్ నేత కొణిజేటి ఆదినారాయణ కోరారు. శనివారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరవుతున్న ఎంపీలకు పువ్వులు ఇచ్చి తన కోరికను తెలియజేశాడు.

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ పర్యవేక్షణ

431 పరీక్షాకేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు

హాజరుకానున్న 5,38,867 మంది

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈనెల 15నుంచి ప్రారంభకానున్న పదోతరగతి పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 2375 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. 5,38,867 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా అందులో 5,03,117 మంది రెగ్యులర్, 35,750 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు. సమస్యాత్మకంగా ఉన్న 26 కేంద్రాలను కలుపుకొని మొత్తం 431 కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించకూడదని నిర్ణయించారు.



శనివారం హరితప్లాజాలో తెలంగాణ మహిళా కమిషన్ నిర్వహించిన వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఎంపీ కే కేశవరావు

సైబర్ నేరాలపై మహిళల్లో అవగాహన పెంపొందించాలి: కేకే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళలపై సైబర్ నేరాలు, వేధింపులు పెరిగిపోతున్నాయని.. వీటిపై మహిళల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరమున్నదని రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు పేర్కొన్నారు. మహిళల పట్ల సైబర్ నేరాలపై శనివారం తెలంగాణ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో హరితప్లాజాలో ఒకరోజు వర్క్‌షాపు చైర్‌పర్సన్ త్రిపురాన వెంకటరత్నం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ.. ఎన్ని చట్టాలొచ్చినా, ఎన్ని శిక్షలు వేస్తున్నా కొందరిలో మార్పు రావడంలేదన్నారు. చైర్‌పర్సన్ త్రిపురాన మాట్లాడుతూ.. పురుషులతోపాటుగా మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం ఉండాలని రాజ్యాంగం చెప్తున్నా.. నేటికీ మహిళలంటే చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నల్సార్ లా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కేవీకే సాంథి, ప్రజ్వల ఎన్జీవో సభ్యురాలు సునీతాకృష్ణన్, స్వేచ్ఛ ఎన్జీవో ప్రతినిధి వై కిరణ్‌చంద్ర.. సైబర్ నేరాలపై వీడియో ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షీ టీం పోలీసులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలుష్య నిర్మూలనలో కలిసిరావాలి

పరిశ్రమల యజమానులకు మంత్రి కేటీఆర్ సూచన

అత్యుత్తమ సాంకేతిక పద్ధతులతో కాలుష్య నియంత్రణ మండలి

ప్రభుత్వానికి సహకరిస్తామని ఫార్మా కంపెనీల హామీ



శనివారం కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో బీడీఎంఏ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి కేటీఆర్. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, పీసీబీ సభ్యకార్యదర్శి సత్యనారాయణరెడ్డి, పరిశ్రమలశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కాలుష్య నిర్మూలనకోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు పరిశ్రమల యజమానులు తమవంతు సహకారాన్ని అందించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి కే తారక రామారావు కోరారు. పారిశ్రామికవాడల్లో దవాఖానలు, చెరువుల అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఫార్మాసిటీ ఏర్పాటు వల్ల కాలుష్య సమస్య తలెత్తకుండా అత్యుత్తమ సాంకేతిక పద్ధతులను ఉపయోగించుకోనున్నట్టు తెలిపారు. శనివారం కాలుష్య నియంత్రణ మండలి కేంద్ర కార్యాలయంలో మంత్రి కేటీఆర్ బల్క్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (బీడీఎంఏ)ప్రతినిధులతో సమావేశమయ్యారు. హైదరాబాద్ భారత ఔషధ నగరిగా పేరొందిందని, ఫార్మాసిటీ ఏర్పాటుతో ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ఫార్మా అభివృద్ధితోపాటు కాలుష్య సమస్యను పూర్తిగా అరికట్టేలా అత్యుత్తమ సాంకేతిక పద్ధతులను ఉపయోగించుకోనున్నట్టు తెలిపారు. కాలుష్యకారక పరిశ్రమలను అవుటర్‌రింగ్ అవతలికి తరలిస్తున్నట్టు, క్లస్టర్లవారీగా అన్నిరకాల పరిశ్రమల అభివృద్ధికి ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఫార్మా పరిశ్రమలకు ఎల్లప్పుడూ చేయూతనందిస్తున్నదన్నారు. ఫార్మాకంపెనీలు నిర్దేశిత కాలుష్య నియంత్రణ ప్రమాణాలను పాటించాలని, లేకుంటే కఠినచర్యలు తీసుకునేందుకు వెనుకాడమని హెచ్చరించారు. పటాన్‌చెరువు, బొల్లారం వంటి పారిశ్రామికకేంద్రాల్లో దవాఖానల ఆధునీకరణ, స్థాయిపెంపు వంటివాటిల్లో పాలుపంచుకునేందుకు పలు పరిశ్రమల యాజమాన్యాలు ముందుకొచ్చాయి. సమావేశంలో ఫార్మా కంపెనీల ప్రతినిధులు తమ పరిశ్రమల విస్తరణ ప్రణాళికలతోపాటు, తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రికి వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని కాలుష్యాన్ని పూర్తిగా తగ్గించడంతో ప్రభుత్వానికి సహకరిస్తామని బీడీఎంఏ ప్రతినిధులు స్పష్టంచేశారు. పరిశ్రమల అభివృద్ధికి కావాల్సిన పలు చర్యలను ప్రభుత్వానికి సూచించారు. జీడిమెట్ల ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను అప్‌గ్రేడ్ చేయాలని మంత్రిని కోరారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, పీసీబీ సభ్య కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో డయాలసిస్ సేవలు

సర్కారు దవాఖానలపై పెరుగుతున్న నమ్మకం

రోగుల సంఖ్యకు అనుగుణంగా అదనపు యూనిట్లు

కొత్తగా మరో మూడు డయాలసిస్ కేంద్రాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రైవేటు దవాఖానల బాదుడు నుంచి నిరుపేదలకు విముక్తి కల్పించేందుకు సర్కారు దవాఖానల్లో రాష్ట్ర ప్రభుత్వం డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటుచేసింది. ఈ కేంద్రాల్లో వేల సంఖ్యలో కిడ్నీ వ్యాధిగ్రస్థులు సేవలు పొందుతున్నారు. రాష్ట్రంలోని సర్కారు దవాఖానల్లో ప్రతిరోజు 3వేల మందికి సింగిల్ యూజ్డ్ డయాలిసిస్ సేవలను అందిస్తున్నారు. ఇక్కడ కల్పిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన సేవలపై నమ్మకంతో కిడ్నీ వ్యాధి బాధితులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ప్రభుత్వ దవాఖానల్లోని ఒక్కో డయాలసిస్ కేంద్రంలో ప్రస్తుతం అయిదు యూనిట్లు ఉండగా.. పెరుగుతున్న రోగుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని అదనంగా యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. కొత్తగా హైదరాబాద్‌లోని బార్కస్, గజ్వేల్, నారాయణ్‌ఖేడ్ దవాఖానల్లో కేంద్రాల ఏర్పాటుకు సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపారు. కొత్తగా అనుమతించిన మూడు కేంద్రాలను కలుపుకొని రాష్ట్రంలో 39 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు వైద్యారోగ్యశాఖ కృషిచేస్తున్నది. ఇందులో 22 దవాఖానల్లో ఇదివరకే కేంద్రాలను ఏర్పాటుచేశారు. మిగిలినవాటిలో ఈ నెల 22న నాగర్‌కర్నూల్ దవాఖానలో మంత్రి లక్ష్మారెడ్డి డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. మార్చి 2న నిజామాబాద్, బోధన్‌లో ప్రారంభించనున్నారు. ప్రస్తుతం సిరిసిల్ల, సిద్దిపేట, తాండూర్, వికారాబాద్, ఉట్నూరు, నిర్మల్, ఆదిలాబాద్, మలక్‌పేట, వనస్థలిపురం, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, కామారెడ్డి, బాన్సువాడ, మంచిర్యాల, మెదక్, సంగారెడ్డి, వరంగల్ కాకతీయ వైద్యకళాశాల, గాంధీ వైద్యకళాశాల, ఉస్మానియా వైద్య కళాశాల, మహబూబ్‌నగర్ వైద్య కళాశాల పరిధిలో డయాలిసిస్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

తహసీల్దార్ల అధికారాలపై పునరాలోచించండి

ప్రభుత్వానికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగుల విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తహసీల్దార్లకు కూడా రిజిస్ట్రేషన్ అధికారాలనివ్వాలన్న నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని.. స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ ఉద్యోగులు కోరారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన వివిధ ఉద్యోగసంఘాల నాయకులు, ప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లోని స్టాంపులు, రిజిస్ట్రేషన్ కేంద్రకార్యాలయంలో సమావేశమయ్యారు. తహసీల్దార్లకు రిజిస్ట్రేషన్ బాధ్యతలను అప్పగించడం వల్ల తలెత్తే సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలని ఉద్యోగసంఘాల నాయకులు స్థితప్రజ్ఞ, గోన విష్ణువర్ధన్ రావు,ఎస్ సహదేవ్, ముజీబ్, సహదేవ్, సిరాజ్ అహ్మద్, రవిభూపాల్ కోరారు. అనంతరం మొజంజాహి మార్కెట్ నుంచి నాంపల్లిలోని సీసీఎల్‌ఎ కార్యాల యం వరకు ర్యాలీ నిర్వహించి.. సీసీఎల్‌ఏ డైరెక్టర్, రిజిస్ట్రేషన్‌శాఖ అదనపు కమిషనర్ వాకాటి కరుణను కలిసి సమస్యను వివరించారు.

నూతన జిల్లాల్లో సొసైటీల ఏర్పాటు

- గొర్రెల పెంపకందారులు, మత్స్యకారుల సొసైటీలకు ఎన్నికలపై త్వరలో నిర్ణయం
- మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి సీఎంకు ప్రతిపాదనలు
- పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో గొర్రెలపెంపకం దారులు, మత్స్యకారుల సొసైటీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ అధికారులకు సూచించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల గొర్రెల పెంపకం దారుల సొసైటీల పదవీకాలం ముగిసిందని, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల సొసైటీల పదవీకాలం వచ్చే ఏడాది ముగియనున్నదన్నారు. పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, గొర్రెల, మేకల అభివృద్ధి సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ వీ లక్ష్మారెడ్డిలతో శనివారం సచివాలయంలోని తన చాంబర్‌లో మంత్రి సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం 8025 గొర్రెల పెంపకందారుల సొసైటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. 3820 మత్స్య సహకార సొసైటీలు ఉన్నట్టు చెప్పారు. వీటిలో 946 సొసైటీలకు ఎన్నికలు జరుగాల్సి ఉన్నదని, 153 సొసైటీలు పర్సన్ ఇంచార్జి ఆధ్వర్యంలో పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ సొసైటీలకు కో-ఆపరేటివ్ చట్టం ప్రకారం ఎన్నికల నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. త్వరలో క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశం ఏర్పాటు చేసి సొసైటీలకు ఎన్నికలు నిర్వహించే విషయమై చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు మంత్రి తెలిపారు. అనంతరం సొసైటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వ అనుమతుల కోసం ముఖ్యమంత్రికి ప్రతిపాదనలను పంపించనున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ వివరించారు.



సచివాలయంలో పశుసంవర్ధక, మత్స్యకారశాఖలపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు



సరూర్‌నగర్ స్టేడియంలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి, మమత తదితరులు

సరూర్‌నగర్‌లో సకలఉద్యోగుల మహాసభ

25న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మైదానంలో ఈ నెల 25న సకలఉద్యోగుల మహాసభను నిర్వహించనున్నామని తెలంగాణ ఉద్యోగసంఘాల జేఏసీ నాయకులు తెలిపారు. ఇందులోభాగంగా సరూర్‌నగర్ మైదానాన్ని జేఏసీ నేతలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే, టీజీఓ వ్యవస్థాపక అధ్యక్షుడు వీ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సభకు హాజరుకానున్న లక్షలాది ఉద్యోగులకు కావాల్సిన సదుపాయాలను కల్పిస్తామన్నారు. సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేయాలనే డిమాండ్‌తో నిర్వహిస్తున్న ఈ మహాసభను ఉద్యోగులందరూ జయప్రదం చేయాలని ఉద్యోగసంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ మమత పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కరించాలని సీఎస్‌కు వినతి..

ఉద్యోగుల విభజన సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కే జోషికి వినతిపత్రాన్ని అందజేశారు.

మల్కాపూర్ పార్కుకు త్వరలో శంకుస్థాపన



శనివారం బషీర్‌బాగ్‌లోని పరిశ్రమ భవన్‌లో టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లుకు 20 కోట్ల చెక్కును అందిస్తున్న టీఐఎఫ్ నాయకులు

- సీఎం కేసీఆర్ భూమిపూజ చేస్తారని టీఎస్‌ఐఐసీ చైర్మన్ వెల్లడి
- పార్కుకోసం రూ.20.11కోట్లను అందించిన టీఐఎఫ్ చైర్మన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: యాదాద్రి జిల్లా దండుమల్కాపూర్‌లో 377 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామికవాడకు త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేస్తారని టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు తెలిపారు. ఈ పార్కుకు కావాల్సిన భూముల సేకరణ, ఇతర మౌలిక వసతుల కల్పన కోసం టీఐఎఫ్ చైర్మన్ నిధులు సమకూర్చుతున్నది. ఇందుకోసం ఇప్పటికే రెండువిడుతలుగా నిధులిచ్చిన టీఐఎఫ్ మూడోవిడుత కింద రూ.20.11కోట్లు అందజేసింది. టీఐఎఫ్ చైర్మన్ సుధీర్‌రెడ్డి శనివారం టీఎస్‌ఐఐసీ కార్యాలయంలో టీఎస్‌ఐఐసీ చైర్మన్ బాలమల్లుకు చెక్కును అందజేశారు. ఈ విధంగా టీఎస్‌ఐఐసీకి మూడోవిడుతల్లో రూ.55.11 కోట్లను చెల్లించారు. ఈ సందర్భంగా బాలమల్లు మాట్లాడుతూ దండుమల్కాపూర్ పార్కును ప్రతిష్ఠాత్మకంగా, అంతర్జాతీయస్థాయి మౌలిక సదుపాయాలతో ఏర్పాటుచేస్తామని అన్నారు. పార్కుకోసం మొత్తం 377ఎకరాలు సేకరించామని, మరో 80 ఎకరాల సేకరణకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆలోచనల మేరకు పారిశ్రామికవాడల కార్మికుల కోసం వాటికి సమీపంలోనే రెసిడెన్షియల్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. 200 ఎకరాల్లో 30వేల మంది నివాసం ఉండేలా మోడల్ టౌన్‌షిప్‌ను నిర్మిస్తామని చెప్పారు. భారీ మోడల్ టౌన్‌షిప్‌ను నిర్మాణానికి వెంటనే ప్రణాళికలు రూపొందించాలని టీఎస్‌ఐఐసీ అధికారులను ఆదేశించారు. కార్మిక కుటుంబాల కోసం 25ఎకరాల్లో పాఠశాల, అంగన్‌వాడి, ప్రాథమికఆరోగ్యకేంద్రాలు, క్రీడాస్థలం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. విజయవాడ హైవే నుంచి పార్కు వరకు రూ.18 కోట్లతో రోడ్లు, రూ.5 కోట్లతో విద్యుత్‌సౌకర్యం, రూ.5 కోట్లతో నీటి వసతులను కల్పిస్తామని తెలిపారు. ఈ పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. సమావేశంలో మెదక్ నిమ్జ్ సీఈవో మధుసూదన్, జీఎంలు విఠల్, మహేశ్, ఫైనాన్స్ జీఎం దీపక్, తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్వీ రఘు, సంయుక్త కార్యదర్శి గోపాల్ రావు, హరినాథ్, కోశాధికారి సుధాకర్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు పెండింగ్ కేసుల పరిష్కారం

చర్యలు చేపట్టిన రాష్ట్ర సమాచార హక్కు కమిషన్

కార్యాలయంలో తెలుగు అమలు.. డిజిటలీకరణ దిశగా అడుగులు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: పేరుకుపోయిన పెండింగ్ కేసులన్నింటినీ నెలాఖరునాటికి పరిష్కరించడానికి రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ ప్రయత్నిస్తున్నది. గత ఏడాది సెప్టెంబర్ 13న తెలంగాణ సమాచార హక్కు కమిషన్ ఏర్పడింది. ప్రధాన కమిషనర్‌గా అసెంబ్లీ మాజీ కార్యదర్శి రాజా సదారాం, కమిషనర్‌గా సీనియర్ జర్నలిస్టు బుద్ధామురళి బాధ్యతలు స్వీకరించారు. అదే నెల 23 నుంచి కేసుల విచారణ చేపట్టారు. వీరు బాధ్యతలు స్వీకరించేనాటికి 7 వేల కేసులు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయి. పక్కా ప్రణాళిక ప్రకారం ఈ ఏడాది మార్చి పూర్తయ్యేసరికి పెండింగ్ కేసులన్నీ పరిష్కరించాలన్న లక్ష్యంతో కమిషనర్లు పనిచేస్తున్నారు. ఇప్పటివరకు 3 వేల కేసులకు పైగా పరిష్కరించినట్టు తెలిసింది. సమాచార హక్కు చట్టాన్ని తెలుగులో ముద్రించారు. తెలుగు భాషలో తీర్పులు ఇవ్వడంతోపాటు ఆదేశాలు, ఫైళ్లు, నోటీస్‌లన్నీ తెలుగులోనే ఉండేలా చూస్తున్నారు. ఐదునెలల్లో సమాచార హక్కు కమిషనర్ కార్యాలయం పూర్తిగా డిజిటలీకరణ కానున్నది. ఆ తర్వాత అధికారులు, సిబ్బంది కాగితాలు లేకుండా పనిచేయనున్నారు. ఇప్పటికే పాత రికార్డులన్నీ డిజిటలీకరణ చేస్తున్నారు. కమిషన్‌కు వస్తున్న దరఖాస్తులు, కేసుల ఫైళ్లను స్కానింగ్‌చేసి కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. సమాచార హక్కు కమిషన్ వెబ్‌సైట్‌ను కూడా రూపొందిస్తున్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో వెబ్‌సైట్ అందుబాటులో ఉండనున్నది.

నిర్మాణరంగానికి సాంకేతిక సొబగులు

- హైదరాబాద్ నిర్మాణాల్లో పెరిగిన ఐటీ వినియోగం
- ప్రణాళికల నుంచి పూర్తయ్యేదాకా సాంకేతికత వైపు పరుగులు
- అటు ప్రజలకు.. ఇటు డెవలపర్లకు ఉపయోగం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నిర్మాణ రంగం సాంకేతిక సొబగులను అద్దుకుంటున్నది. నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని సరికొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టింది. పెరుగుతున్న కార్మికుల కొరత, పెరుగుతున్న నిర్మాణ సామాగ్రి ధరలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణలను ఎంత వీలైతే అంత త్వరగా పూర్తిచేయడానికి ప్రయత్నిస్తున్నది. ఆరంభంలో కొంత నిర్మాణ వ్యయం పెరిగినా త్వరగా పూర్తిచేయాలనే లక్ష్యాన్ని ఏర్పరచుకుంటున్నది. ఒక ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయడం వల్ల తగ్గే నిర్మాణ వ్యయం ప్రయోజనాలను పలు నిర్మాణ సంస్థలు కొనుగోలుదారులకు అందజేస్తున్నాయి. గేటెడ్ కమ్యూనిటీ ఆధునిక పరిజ్ఞానంతో నాలుగేండ్లలోపే పూర్తవుతున్నది. నిర్మాణ సామగ్రి ఎంపిక, స్ట్రక్చరల్ డిజైన్ల ఏర్పాటు, ఆర్కిటెక్చర్ ప్రణాళికలు, పునాదులు, శ్లాబుల పనులు, రంగుల ఎంపిక, ఇండ్ల అమ్మకాలు.. ఇలా ప్రతి అంశంలో ఆధునిక ఆవిష్కరణలు చోటుచేసుకుంటున్నాయి. 'ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం నగర నిర్మాణాల్లో పెరిగింది. దీనివల్ల నిర్మాణాలు త్వరగా పూర్తవుతాయి. నాలుగు నెలల క్రితం హైదరాబాద్‌లో స్టీలు ధర టన్నుకు రూ.36 వేలు ఉంటే తాజాగా, రూ.57 వేలకు చేరుకున్నది. డెవలపర్లు నిర్ణీత గడువు కంటే ముందు నిర్మాణాన్ని పూర్తిచేస్తే.. పెరిగిన భారాన్ని గణనీయంగా తప్పించుకునేవార'అని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎస్ రాంరెడ్డి తెలిపారు.

నిర్మాణాల్లో సాంకేతికత..

హైదరాబాద్‌లో పెరిగిన నాణ్యమైన మానవవనరుల కొరతను దృష్టిలో పెట్టుకుని నిర్మాణసంస్థలు సరికొత్త విధానాన్ని అవలంభిస్తున్నాయి. సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులను ఎంపికచేసుకుని వారికి ప్రత్యేక శిక్షణను అందజేస్తున్నాయి. స్ట్రక్చరల్ డిజైనర్లు సైతం తమ ప్రాజెక్టు డిజైన్లో సాంకేతికపరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. ప్రాజెక్టులో గ్యాస్, మంచినీటి సౌకర్యం, విద్యుత్ వినియోగం వంటి విషయాల్లో ఎలక్ట్రానిక్ పరికరాలను వాడుతున్నారు. వాటి వినియోగం తగ్గుతున్నది' అని క్రెడాయ్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అభిప్రాయపడ్డారు.



శనివారం హైటెక్స్‌లో క్రెడాయ్ ప్రాపర్టీ షోలో ఇండ్ల నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకుంటున్న ప్రజలు

17 కోట్ల చదరపు అడుగుల్లో నిర్మాణాలు

- 7 కోట్ల చ.అ. విస్తీర్ణంలో ఆరు ప్రాజెక్టులు
- భాగ్యనగరం చుట్టూ 500 నిర్మాణాలు
- సింహభాగం పశ్చిమ హైదరాబాద్‌లోనే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో ప్రస్తుతం పదిహేడు కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో ఒక్క హైదరాబాద్ పశ్చిమం వైపునే దాదాపు 13 కోట్ల చదరపు అడుగుల్లో నిర్మాణాలు చేపడుతున్నారు. ఆకాశహర్మ్యాలు, బహుళ అంతస్తుల భవనాలు, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు వంటివి నిర్మిస్తున్న వారిలో పది దిగ్గజ సంస్థలున్నాయి. మై హోమ్ సంస్థ వివిధ ప్రాంతాల్లో పలు ప్రాజెక్టులను చేపడుతున్నది. ఒక ప్రాంతంలో ఈ సంస్థ కట్టే విస్తీర్ణం దాదాపు కోటి చదరపు అడుగులు. అపర్ణా గ్రూప్, ఎన్‌సీసీ అర్బన్, రాజపుష్ప ప్రాపర్టీస్, ఇన్‌కార్, ఎస్ ఎంఆర్ హోల్డింగ్స్ వంటి సంస్థలు కలిసి ఏడు కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నాయి. మొత్తానికి, ప్రస్తుతం హైదరాబాద్‌లో కనీసం ఐదు వందల ప్రాజెక్టులు వివిధ ప్రాంతాల్లో నిర్మాణ దశలో ఉన్నాయని క్రెడాయ్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఊహించినట్టుగానే తమ ప్రాపర్టీ షోకు మంచి స్పందన లభిస్తున్నదన్నారు. ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ నిర్మాణరంగంలో సరికొత్త స్ఫూర్తిని నింపారని, ఎంతో ఓపికగా స్టాళ్లను తిరిగి పలు ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారని చెప్పారు.

ప్రాపర్టీషోకు పాతిక వేలమంది..

క్రెడాయ్ హైదరాబాద్ అట్టహాసంగా ప్రారంభించిన సిక్త్ ఎడిషన్ ప్రాపర్టీషోకు సందర్శకుల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నది. రెండురోజుల్లో సుమారు 25 వేల మంది సందర్శకులు విచ్చేశారని అంచనా. గత ప్రాపర్టీషోల కంటే ఈసారి ఎంతో భిన్నమైన వాతావరణం కనిపించిందని స్టాళ్ల నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను, ప్యానెల్ డిస్కషన్‌లో నగరాభివృద్ధికి సంబంధించిన విశేషాలను హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు తెలియజేశారు. క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీషో ఆదివారం ముగియనుంది. చివరి రోజు జరిగే ప్యానెల్ డిస్కషన్‌లో డీజీపీ మహేందర్‌రెడ్డి పాల్గొంటారని, ముగింపు వేడుకలకు ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి హాజరవుతారని క్రెడాయ్ హైదరాబాద్ ప్రతినిధులు తెలియజేశారు.

నాగాపూర్ లిఫ్టు ఆధునీకరణకు
ప్రభుత్వం పచ్చజెండా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీరాంసాగర్ ఫోర్‌షోర్‌లో ఉన్న నాగాపూర్ లిఫ్టుస్కీం ఆధునీకరణకు అనుమతినిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండల పరిధిలో ఉన్న ఈ లిఫ్టుస్కీం కింద 1062 ఎకరాల ఆయకట్టు ఉంది. లిఫ్టుస్కీం సక్రమంగా పనిచేయకపోవడంతో ఆయకట్టుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రూ.67 లక్షలతో ఆధునీకరణ నిమిత్తం తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. వాటిని పరిశీలించిన సర్కారు రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక నిధుల నుంచి పనులు చేపట్టేందుకు అనుమతి ఇచ్చింది.

ఆడబిడ్డకు తెలంగాణ జాగృతి సాయం

- శిశువు గుండె చికిత్సకు రూ.2 లక్షల ఆర్థికసాయం అందించిన జాగృతి యువజన విభాగం కన్వీనర్ విజయ్
- దవాఖానలో చెక్కును ఇచ్చిన ఎంపీ పసునూరి దయాకర్


శనివారం కేర్ దవాఖానలో శిశువు తల్లిదండ్రులకు జాగృతి యువజన విభాగం కన్వీనర్ కొరబోయిన విజయ్ తరపున రూ.2 లక్షల చెక్కు అందజేస్తున్న ఎంపీ పసునూరి దయాకర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నెల రోజుల శిశువు గుండెకు తెలంగాణ జాగృతి ఊపిరిలూదింది. వరంగల్ అర్బన్ జిల్లా కడిపికొండ గ్రామానికి చెందిన శ్రీనివాస్, సంధ్య దంపతుల కలలపంటగా కూతురు పుట్టింది. అయితే నాలుగోరోజు నుంచి శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు మొదలయ్యాయి. దీంతో హైదరాబాద్ కేర్ దవాఖాన వైద్యులు పాపకు అర్జంట్‌గా గుండె ఆపరేషన్ చేయాలని చెప్పారు. కూలిపని చేసి బతుకులు వెళ్లదీసే ఆ దంపతులు ఈ విషయం తెలుసుకొని కుప్పకూలిపోయారు. నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత సారథ్యంలోని తెలంగాణ జాగృతిని సంప్రదిస్తే ఆర్థికసాయం చేస్తారని గ్రామస్థులు వారికి చెప్పారు. తెలంగాణ జాగృతి యువజన విభాగం కన్వీనర్ కొరబోయిన విజయ్‌కు ఆ ఊరి యువకులు శిశువు ఆరోగ్య పరిస్థితి వివరించారు. స్పందించిన విజయ్.. తానే ఆ డబ్బును ఇస్తానని, అధైర్యపడొద్దని పాప తల్లితండ్రులకు ధైర్యం చెప్పారు. శనివారం ఆయన కేర్ దవాఖానలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ ద్వారా రూ.2లక్షల చెక్కును శ్రీనివాస్ దంపతులకు అందించారు. కేర్ దవాఖాన వైద్యులు శిశువుకు ఆపరేషన్ చేశారు. పాప ఆరోగ్యం నిలకడగా ఉన్నదని తెలిపారు. పాపను బతికించానన్న సంతృప్తితోపాటు ఆ దంపతుల సంతోషం తనకు ఎక్కువ ఆనందాన్నిచ్చిందని విజయ్ చెప్పారు.

నేడు ముగియనున్న టీఆర్టీ

- వచ్చేవారంలో ప్రాథమిక కీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్టీ పరీక్షల్లో భాగంగా శనివారం ఉదయం సెషన్‌లో నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్, బయోసైన్సెస్, మ్యాథమెటిక్స్ సబ్జెక్టులకు (హిందీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ, తమిళ మాధ్యమాలు) 82.9 శాతం హాజరు నమోదైనట్టు టీఎస్‌పీఎస్సీ వివరించింది. మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్సెస్ (ఆంగ్ల మాధ్యమం) పరీక్షకు 62 శాతం హాజరు నమోదైనట్టు పేర్కొన్నది. కాగా టీచర్ కొలువుల భర్తీ కోసం టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న టీఆర్టీ పరీక్షలు ఆదివారంతో ముగియనున్నాయి. ఆదివారం స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్, బయోసైన్స్, మ్యాథమెటిక్స్ (తెలుగు మీడియం), పీఈటీ (ఇంగ్లిష్ మీడియం) కొలువులకు పరీక్ష నిర్వహించనున్నారు. వచ్చేవారంలో 'ప్రాథమిక కీ' విడుదల చేయనున్నట్లు సమాచారం.

ఇంటిస్థలాలకు బదులుగా
3.75 లక్షల ప్యాకేజీ

- శ్రీపాద ముంపు గ్రామాలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పలుగ్రామాల్లో ముంపునకు గురై ఇండ్లు కోల్పోయిన కుటుంబాలకు ఇంటిస్థలాలకు బదులుగా వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.3.75 లక్షల ప్యాకేజీ చెల్లింపుపై ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా మంచిర్యాల జిల్లా న్యూహాజీపూర్ మండల పరిధిలోని కొండపల్లి, కర్నమామిడి, రాపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. దీంతో 174 కుటుంబాలవారు నిరాశ్రయులయ్యారు. నిజానికి వారికి పునర్నిర్మాణ కేంద్రాలు ఏర్పాటు చేసి పునరావాసం, ఆశ్రయాన్ని కల్పించాల్సి ఉంది. కానీ 'ఆర్ అండ్ ఆర్' సెంటర్‌లో భూమి అందుబాటులో లేకపోవడంతో వన్‌టైం సెటిల్‌మెంట్ కింద పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు నీటిపారుదలశాఖ ఇచ్చిన ప్రతిపాదనలు పరిశీలించిన ప్రభుత్వం.. కొండపల్లి గ్రామపరిధిలోని 126 కుటుంబాలు, రాపల్లి గ్రామానికి చెందిన 39 కుటుంబాలు, కర్నమామిడికి చెందిన తొమ్మిది కుటుంబాలకు ఇంటిస్థలం, ఇతర మౌలిక వసతుల కల్పనకు అయ్యే వ్యయాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.3.75 లక్షల ప్యాకేజీని చెల్లించేందుకు అనుమతి ఇచ్చింది.


శనివారం పౌరసరఫరాలభవన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించిన కేంద్ర అధికారి రవికాంత్

రాష్ట్ర పౌరసరఫరాలశాఖ
దేశానికే ఆదర్శం

ప్రజాపంపిణీ వ్యవస్థలో అద్భుత ప్రగతి.. పారదర్శకతకు, జవాబుదారీతనానికి పెద్దపీట

కేంద్ర ఆహార, ప్రజా పంపిణీశాఖ కార్యదర్శి రవికాంత్ ప్రశంసలు

రాష్ట్రంపై భారం పడకుండా చూడండి.. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొత్త రాష్ట్రమైనప్పటికీ తెలంగాణ ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానంతో అక్రమాలకు అడ్డుకట్టవేస్తూ.. ప్రజా పంపిణీ వ్యవస్థలో అద్భుత ప్రగతిని సాధించిందని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీశాఖ కార్యదర్శి రవికాంత్ ప్రశంసించారు. పారదర్శకతకు, జవాబుదారీతనానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ.. ప్రజా పంపిణీ వ్యవస్థలో వినూత్నమైన సంస్కరణలతో తెలంగాణ పౌరసరఫరాలశాఖ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. అధునాతన సాంకేతికతను వినియోగిస్తూ.. ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఓపీఎంఎస్), కమాండ్ కంట్రోల్ సెంటర్, గోదాముల్లో సీసీ కెమెరాలు, టీ-రేషన్ యాప్ ఏర్పాటుచేసి ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నదన్నారు. రెండురోజుల రాష్ట్ర పర్యటనకొచ్చిన రవికాంత్.. ఎఫ్‌సీఐ దక్షిణ ప్రాంత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్డీ నజీమ్, ఎఫ్‌సీఐ తెలంగాణ మేనేజర్ జీఎస్ రాజశేఖర్‌తో కలిసి శనివారంనాడు తెలంగాణ పౌరసరఫరాలశాఖ భవన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును పరిశీలించారు. రేషన్ సరుకులు తరలించే వాహనాల కదలికలను, రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాల సంస్థ గోదాముల్లో జరిగే వ్యవహారాలను సీసీ కెమెరాల ద్వారా వీక్షించారు. ఆ తర్వాత ఆయన కమిషనర్ సీవీ ఆనంద్‌తోపాటు ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ సంస్కరణలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ముషీరాబాద్‌లోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో సీసీ కెమెరాల పనితీరు, రేషన్ బియ్యం నాణ్యతను పరిశీలించారు. పంజాగుట్టలోని రేషన్‌షాపులో ఈపాస్ విధానం అమలుతీరును పరిశీలించి, అక్కడి లబ్ధిదారులతో ముచ్చటించారు.

భారం పడకుండా చూడండి: కమిషనర్ సీవీ ఆనంద్

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు బాధ్యతను పూర్తిగా రాష్ట్రాలకు అప్పగించడంతో అదనంగా ఆర్థికభారం పడుతున్నదని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్.. కేంద్ర కార్యదర్శి రవికాంత్ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రాలపై భారం పడకుండా చూడాలని, ధాన్యం కొనుగోళ్లబకాయిలను త్వరితగతిన విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లుకు ధాన్యం రవాణాచేసేందుకు ఎఫ్‌సీఐ చెల్లించే చార్జీలు ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్న లేబర్‌చార్జీలు తక్కువగా ఉన్నాయని, కేంద్రం క్వింటాల్‌కు రూ.5 ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.30 చెల్లిస్తున్నదని తెలిపారు. ఎఫ్‌సీఐ బకాయిలను త్వరగా విడుదల చేయాలని, 2017-18 యాసంగి సీజన్‌కు తాత్కాలికంగా 15లక్షల టన్నుల కస్టం మిల్లింగ్‌రైస్‌ను నిల్వచేసేందుకు గోదాముల్లో స్థలం కేటాయించాలని, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన రూ.4,047 కోట్లను తక్షణ విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కందుల కొనుగోలుకు వెయ్యి కోట్లు

- రూ.1,315 కోట్లతో 24 లక్షల క్వింటాళ్ల కందుల కొనుగోలు
- ఎన్ని లేఖలు రాసినా సరిగా స్పందించని కేంద్రం
- త్వరలో 9 ప్రభుత్వ కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు
- మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు


శనివారం సచివాలయంలో కందుల కొనుగోళ్లపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కందుల కొనుగోళ్లపై కేంద్రం వివక్ష చూపించిందని, ఎన్నిసార్లు లేఖలు రాసినా సరిగా స్పందించలేదని మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.1,315 కోట్ల విలువైన 24,13,267 క్వింటాళ్ల కందులను సేకరించామని, ఇందులో రూ.1000 కోట్లు తెలంగాణ ప్రభుత్వమే భరించిందని చెప్పారు. కందుల కొనుగోళ్లపై మంత్రి హరీశ్‌రావు శనివారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. తెలంగాణ రైతుకు మద్దతు ధర కల్పించడంలో, కందులను సేకరించడంలో కేంద్రప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించిందని అన్నారు. ఈసారి 2.51 లక్షల హెక్టార్లలో రైతులు కందిపంట వేశారని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 24 లక్షల క్వింటాళ్లకు పైగా కందులు కొనుగోలు చేశామని, ఇంకా దాదాపు 1.50 లక్షల టన్నుల పంట మార్కెట్ వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అయితే కేంద్రం 7.5లక్షల టన్నుల కందుల కొనుగోలుకు మాత్రమే అంగీకరించిందని, అందులోనూ పలు షరతులు విధించిందని హరీశ్‌రావు అసంతృప్తి వ్యక్తంచేశారు. కంది రైతుల బకాయిల చెల్లింపులకుగాను ప్రభుత్వం రూ.600 కోట్ల బ్యాంక్ గ్యారంటీ ఇచ్చిందని, వీలైనంత త్వరగా రైతులకు బకాయిలు చెల్లించాలని మార్క్‌ఫెడ్, హాకా సంస్థలను మంత్రి కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వరంగంలోని 330 గోదాములలో 185 గోదాములు మాత్రమే వినియోగంలో ఉన్నాయని, మిగతా 145 గోదాములన్నింటినీ ఖరీఫ్‌లోగా పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని హరీశ్‌రావు ఆదేశించారు. గోదాములు మంజూరు అయినప్పటికీ భూసేకరణ పూర్తికాని ప్రాంతాల్లో, ప్రత్యామ్నాయస్థలాన్ని ఎంపిక చేయాలన్నారు. ఇందుకు గాను ఆయా జిల్లాల మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ప్రైవేటు గోదాములలో 4 లక్షల టన్నుల సరుకులు ఉండటంపై మంత్రి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోదాములకే ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. గోదాముల్లేని 164 మండలాల్లో 5 ఎకరాల అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్లకు లేఖలు రాయాలని ఆదేశించారు. ఆయా ప్రదేశాల్లో గోదాముల వసతి డిమాండ్‌ను సరిగ్గా అంచనా వేయాలని, దీనికి సంబంధించి 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు.

6న ఫుడ్ ప్రాసెసింగ్ సబ్‌కమిటీ భేటీ

వానకాలం సీజన్‌లో ఎరువులు, విత్తనాలను నిల్వ చేసుకోవడానికి వీలుగా గోదాముల నిర్మాణం పూర్తి చేయాలని హరీశ్‌రావు అన్నారు. కొత్తగా మార్కెటింగ్‌శాఖ పరంగా 9 కోల్డ్‌స్టోరేజీల ఏర్పాటును సీఎం కేసీఆర్ ఆమోదించిన నేపథ్యంలో వాటి ఏర్పాటుపై డిమాండ్‌కు అనుగుణంగా మార్కెటింగ్ విశ్లేషణ జరుపాలని సూచించారు. ఫుడ్‌ప్రాసెసింగ్‌పై క్యాబినెట్ సబ్‌కమిటీ ఈ నెల 6న సమావేశం అవుతున్నందున నాబార్డు, మార్కెటింగ్, హార్టికల్చర్ సంస్థలు ఉమ్మడిగా ఈ అధ్యయనం చేయాలని కోరారు. ఏ ప్రాంతంలో ఎక్కువగా ఏ పంట పండిస్తున్నారు, దిగుబడి ఎంత వస్తున్నది, ఆ ప్రాంతాల్లో ఉన్న సాగునీటి వసతి, మార్కెటింగ్ సదుపాయాలపై ఒక నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, జాయింట్ డైరెక్టర్లు లక్ష్మణుడు, మార్కెటింగ్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, జేడీ రవికుమార్, వరంగల్ ఇంచార్జి జేడీ శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ , హాకా, నాబార్డు, వేర్ హౌజింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'సోమశిల'ను అభివృద్ధి చేయాలి

- మంత్రి జూపల్లి కృష్ణారావు


శనివారం హైదరాబాద్‌లో పర్యాటక అభివృద్ధిపై సమీక్షిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు. చిత్రంలో పర్యాటక కార్పొరేషన్ చైర్మన్ పేర్వారం రాములు, కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పర్యాటకరంగాభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమశిల, జెట్‌ప్రోలు, సింగోటంలలో పర్యాటక అభివృద్ధికి గల అవకాశాలపై దృష్టిసారించాలని చెప్పారు. పాత మహబూబ్‌నగర్ జిల్లాలో స్వదేశీ దర్శనంలో భాగంగా చేపట్టిన పర్యావరణ, పర్యాటక ప్రాజెక్ట్ పనుల పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. శనివారం రాజధాని హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో గల టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన టూరిజం శాఖపై ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోమశిలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని, పర్యాటకులకు కావాల్సిన సదుపాయాలను సోమశిల, జెట్‌ప్రోలులో టూరిజంశాఖ ద్వారా బోటింగ్, హరితహోటల్ నిర్వహణపై పర్యాటకులలో వెల్లడవుతున్న అసంతృప్తి తొలిగిపోయేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బోటింగ్ విషయంలో పర్యాటకులకు సదుపాయాలు పెంచాలని కోరారు. ఆగస్టు నాటికి సోమశిలలో 10 కాటేజీలను సిద్ధం చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సోమశిలకు బస్సులో, అక్కడి నుంచి శ్రీశైలం వరకు బోటింగ్ చేసేవిధంగా ప్రణాళికలను అభివృద్ధి చేయాలని పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేర్వారం రాములు సూచించారు. పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితర అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

గద్వాలలో విద్యాభివృద్ధికి సహకరించండి

- డిప్యూటీ సీఎం కడియంను కోరిన బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయగౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జోగుళాంబ గద్వాల జిల్లాలో విద్యారంగ ప్రగతిపై దృష్టినిలుపాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు ఆంజనేయ గౌడ్ శనివారం కలిశారు. గద్వాల జిల్లాలో ఎస్సీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా నడిగడ్డకు విద్యాపరంగా ప్రోత్సాహం అందించాలని ఆయన కోరారు. గట్టు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సులు మంజూరు చేయాలని, లెక్చరర్ పోస్టులు కూడా కేటాయించాలని ప్రతిపాదించారు. గట్టు మండలం ఆసియా ఖండంలోనే అక్షరాస్యతలో వెనుకబడిన మండలమని.. ఇక్కడ 99 శాతం దళిత, బడుగు వర్గాల వారు ఉన్నారని విద్యాపరంగా వారికి చేయూత అందించాలని కోరారు.


శనివారం వైరల్ జ్వరంతో అస్వస్థతకు గురై హైదరాబాద్ కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సాహితీవేత్త, పండితుడు కపిలవాయి లింగమూర్తిని పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ తదితరులు
- హైదరాబాద్, నమస్తే తెలంగాణ

మాజీ ఎంపీ బంగారు సుశీల కన్నుమూత

- సంతాపం తెలిపిన బీజేపీ నేతలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీజేపీ సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపీ బంగారు సుశీల (70) శనివారం కన్నుమూశారు. కొంతకాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్న ఆమె హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో దవాఖానలో తుదిశ్వాస విడిచారు. జూబ్లీహిల్స్‌లోని రోడ్‌నంబర్ 10లోని నివాసానికి ఆమె భౌతికకాయాన్ని తరలించారు. ఆదివారం సుశీల అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. సికింద్రాబాద్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేసిన సుశీల 2004లో రాజస్థాన్‌లోని జాలోర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బూటాసింగ్‌పై ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. బీజేపీ మాజీ జాతీయ అధ్యక్షుడు, దివంగత బంగారు లక్ష్మణ్ సతీమణి బంగారు సుశీల. ఆమె మృతి పట్ల ఎంపీ బండారు దత్తాత్రేయ తదితరులు సంతాపం తెలిపారు.

మోటరు వాహన చట్ట సవరణ సరికాదు

- బిల్లు వెనుకకు తీసుకోవాలని ఎల్లుండి ఆర్టీసీ కార్మికుల ధర్నా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మోటరు వాహన చట్ట సవరణ బిల్లు-2017ను ఉపసంహరించుకోవాలని, ఆర్టీఏ సర్వీసు చార్జీలు పెంచుతూ ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దుచేయాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ నెల 6న అన్ని ఆర్టీసీ డిపోలు, యూనిట్ల వద్ద భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించి తమ డిమాండ్లపై వినతిపత్రాలు అందజేయాలని ఆర్టీసీ కార్మికసంఘాలు నిర్ణయించాయి. తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) ప్రధాన కార్యదర్శి అశ్వత్థామరెడ్డి, టీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి, టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జీ అబ్రహం, సంయుక్తంగా ఈ ఆందోళనకు పిలుపునిచ్చారు.

20 నాటికి చివరి ఆవాసానికి శుద్ధిచేసిన నీళ్లు

- అధికారులకు స్పష్టంచేసిన ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ


శనివారం జిల్లా అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ సురేందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ఆవాసాలకు ముందుగా భగీరథ నీరు సరఫరా చేయాలనే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదేశాలకు అనుగుణంగా పనులు జరుగాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ బీ సురేందర్‌రెడ్డి అన్నారు. ఇందుకు తగినట్టుగా మైక్రో లెవల్‌లో యాక్షన్ ప్లాన్ తయారుచేయాలని అధికారులకు సూచించారు. శనివారం ఎర్రమంజిల్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ ప్రధాన కార్యాలయంలో 30 జిల్లాల ఎస్ఈ, ఈఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మిగిలిన చిన్న పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ నెల 20 నాటికి చివరి ఆవాసానికి శుద్ధిచేసిన తాగునీటిని అందించేలా పనులుచేయాలని కోరారు. ఇంట్రా పనులు వేగంగా జరిగేందుకు బిల్లుల చెల్లింపులో వెసులుబాటు కల్పించామని చెప్పారు. కరీంనగర్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అతనికి చార్జి మెమో ఇవ్వాలని చీఫ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. ఇంట్రావిలేజ్ పనులు పూర్తిచేసిన ఇంజినీర్లను కోరుకున్నచోటికి బదిలీచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు జ్ఞానేశ్వర్, చీఫ్ ఇంజినీర్లు కృపాకర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, విజయ్‌ప్రకాశ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వడదెబ్బ నిరోధానికి చర్యలు

- కార్యాచరణ ప్రణాళికపై సమీక్షలో అధికారులకు సీఎస్ ఆదేశం
- ఏప్రిల్ నుంచి జూన్ వరకు వడగాలుల తీవ్రత అధికం


శనివారం సచివాలయంలో వేసవి ప్రణాళికపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ ఎస్కే జోషి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వేసవిలో వడగాలుల తీవ్రత దృష్ట్యా కార్యాచరణ ప్రణాళికను (హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్) అమలుచేయాలని వివిధ శాఖల అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు వడగాలుల తీవ్రత అధికంగా ఉండనుండటంతో సచివాలయంలో శనివారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో కార్యాచరణ ప్రణాళికపై ఆయన సమీక్షించారు. ఈ ఏడాది వడగాలుల తీవ్రత అధికంగా ఉండనున్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా సమన్వయంతో పనిచేయాలని సీఎస్ ఆదేశించారు. వడగాలుల తీవ్రతపై కలర్ కోడింగ్‌తో ఎప్పటికప్పుడు ప్రజలకు సూచనలిస్తూ అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాల్లో అవసరమైనస్థాయిలో ఓఆర్ఎస్, ఫ్లూయిడ్స్, ఐస్‌ప్యాక్‌లను సిద్ధంగాపెట్టుకోవాలని సూచించారు. వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా హెల్త్ అడ్వైజరీస్ విడుదల చేయాలన్నారు. సమాచారశాఖ ద్వారా వడగాడ్పుల తీవ్రతపై ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. వడగాలుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై కలెక్టర్లకు మార్గదర్శకాలు జారీచేశామని సీఎస్ చెప్పారు. పశువులు, గొర్రెలకు తాగునీరు, పశుగ్రాసం కొరతలేకుండా చూడాలని సూచించారు. పశువులు, గొర్రెల కోసం షెడ్ల నిర్మాణపనులను వేగవంతం చేయాలన్నారు. రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు, మెట్రోస్టేషన్లు, బస్‌స్టాప్‌లలో మంచినీరు, ఎమర్జెన్సీ మెడికల్ టీంలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉపాధి, భవననిర్మాణ పరిశ్రమల్లోని కార్మికులు వడగాడ్పుల సమయంలో పనులుచేయకుండా కార్మికశాఖ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యధిక ఉష్ణోగ్రత వివరాలను కలెక్టర్లు, అధికారులు, మీడియాకు సందేశాల రూపంలో వాతావరణశాఖ పంపించాలని సూచించారు. కార్యాచరణ ప్రణాళిక వివరాలను ఎప్పటికప్పుడు ఐటీశాఖ వెబ్‌సైట్‌లో నమోదుచేసి అప్రమత్తం చేయాలన్నారు. జీహెచ్ఎంసీ, అర్బన్ లోకల్‌బాడీలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్, రవాణా, రోడ్లు భవనాలశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, కార్మికశాఖ ముఖ్యకార్యదర్శి శశాంక్ గోయల్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ముఖ్యకార్యదర్శి ఆర్‌వీ చంద్రవదన్, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి శివశంకర్, మెట్రో వాటర్‌వర్క్స్ ఎండీ దానకిశోర్, పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, అదనపు పీసీసీఎఫ్ రఘువీర్, ఐటీ డైరెక్టర్ కే దిలీప్‌తో పాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- మాల్‌ప్రాక్టీస్ చేస్తూ పట్టుబడ్డ 10 మంది విద్యార్థులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఇంటర్ బోర్డు కార్యదర్శి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ (పేపర్-1) పరీక్షలో మాల్‌ప్రాక్టీస్ చేస్తూ 10 మంది విద్యార్థులు పట్టుబడినట్లు తెలిపారు. నిర్మల్‌లో-1, భద్రాద్రి కొత్తగూడెం-3, మెదక్-1, సూర్యాపేట-1, మహబూబ్‌నగర్-4 విద్యార్థులు పట్టుబడగా కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 4.93 లక్షల మంది విద్యార్థులు మొదటి ఏడాది పరీక్షలు రాస్తుండగా, శనివారం జరిగిన పరీక్షకు 20,516 (4.15 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వివరించారు.

రాష్ట్ర అటవీశాఖలోకి ఏపీ ఉద్యోగులా?

- టీఎన్జీవో ఫోరం నిరసన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర అటవీశాఖలోకి ఏపీకి కేటాయించిన ఉద్యోగులను తీసుకురావడానికి జరుగుతున్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ అటవీశాఖ టీఎన్జీవో నాయకులు శనివారం పేర్కొన్నారు. కేంద్ర మార్గదర్శకాలప్రకారం ఏపీకి వెళ్లిన అటవీశాఖ ఉద్యోగులను డిప్యూటేషన్‌పై తెలంగాణకు తీసుకురావడానికి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటివ్ అంగీకరించడంపై అటవీశాఖ టీఎన్జీవో ఫోరం అధ్యక్షుడు ఎన్ ఆదినారాయణరెడ్డి, ప్రధానకార్యదర్శి సయ్యద్ శంషోద్దీన్ నిరసన తెలిపారు. టీఎన్జీవో సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి మామిండ్ల రాజేందర్ సారథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని కలిసి వినతిపత్రాన్ని అందజేస్తామని తెలిపారు.

నాడీ వ్యాధుల నిర్మూలనకు ప్రత్యేక విభాగం

- తెలంగాణ నాడీ వైజ్ఞానిక వార్షిక సదస్సులో వైద్య నిపుణులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పుట్టుకతో వచ్చే నాడీ సంబంధ వ్యాధులను (న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్స్) అరికట్టేందుకు ప్రత్యేక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని వైద్య నిపుణులు సూచించారు. ఇందుకోసం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నాడీ సంబంధ వ్యాధులు, చికిత్సల్లో నూతన విధానాలు అనే అంశంపై శనివారం బేగంపేటలోని ఓ హోటల్లో తెలంగాణ నాడీ వైజ్ఞానిక వార్షిక సదస్సును నిర్వహించారు. బోధమయానంద స్వామి సదస్సును ప్రారంభించగా, నిజాం వైద్యవిజ్ఞాన సంస్థ మాజీ డీన్ కేఎస్ రత్నాకర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సదస్సు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు బీపీ సాహూ, కార్యదర్శి విజయసారథి, తెలంగాణ న్యూరోసైన్స్ సొసైటీ అధ్యక్షుడు ప్రకాశ్‌రావు, కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

పురుషోత్తంరెడ్డిపై క్రిమినల్ కేసు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో హెచ్ఎండీఏ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి, అతడి బామ్మర్ది శ్రీనివాస్‌రెడ్డిలపై ఏసీబీ అధికారులు తాజాగా క్రిమినల్ కేసును నమోదుచేశారు. ఒక ఫ్లాట్ కొనుగోలు విషయంలో తమను బెదిరించి మార్కెట్ ధర కంటే తక్కువకు తీసుకున్నారని బంజారాహిల్స్‌లోని ప్రిస్టేజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏసీబీ డీజీ పూర్ణచంద్రరావు శనివారం తెలిపారు.

తెలంగాణ ప్రభుత్వము రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టరు, రంగారెడ్డి జిల్లా

నెం.ఫ2/77/2017 తేది:24-02-2018
గెజిట్ ఆర్.ఆర్.నెం.26 ఫారం-సి తేది:27-02-2018
(సెక్షన్ 11 క్రింద 10ఎ నిబంధనలు ఇచ్చినప్పుడు)

ప్రాథమిక ప్రకటన

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, రంగారెడ్డి వారు ప్రజల ప్రయోజనార్థం హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ రోడ్డు నిర్మాణం చేయుట కొరకు సుమారు ఎకరము 41.19 గుంటల విస్తీర్ణం గల భూమి కందుకూరు (ఎకరము 19.16'/, గుంటలు), కొత్తూరు (ఎకరము 5.27 గుంటలు), మొహమ్మద్ నగర్ (ఎకరము 1.38'/గుంటలు) మరియు మీర్‌ఖాన్‌పేట్ (ఎకరము 14.17 గుంటలు) గ్రామములు, కందుకూరు మండలము, రంగారెడ్డి జిల్లా నందు అవసరమైనదని భావించుచున్నారు.

కావున పైన సదరు ప్రాజెక్టు/రోడ్డు నిర్మాణం నిమిత్తం రంగారెడ్డి జిల్లా, కందుకూరు మండలములో ఎకరము 41.19 గుంటల విస్తీర్ణం గల భూమి కొద్దిగా ఎక్కువ లేదా తక్కువ భాగం భూమిని భూసేకరణ నిమిత్తం నోటిఫై చేయడం జరిగింది. నోటిఫై చేయబడిన భూమి వివరాలు క్రింద ప్రకటించడమైనది.

షెడ్యూలు
జిల్లా: రంగారెడ్డి, మండలం: కందుకూరు

క్రమ సంఖ్య	సర్వే నెంబర్	భూమి స్వభావం: వైటిల్	రకం	సేకరించవలసిన విస్తీర్ణం	ఆసక్తి గల వ్యక్తుల పేర్లు, చిరునామా	సరిహద్దులు సర్వే నెంబర్ ప్రకారం: ఉ	ద	తూ	ప	చెట్లు: రకం	సంఖ్య	నిర్మాణాలు: రకం	విస్తీర్ణం	వ్యాఖ్యలు
1	2	3	4	5	6	7				8	9	10	11	12
మొహమ్మద్ నగర్ గ్రామము														
1	49	పట్టా	మెట్ట	0.02'/	పాముల కొమురమ్మ భర్త బీరయ్య	51	47	48	50	-	-	-	-	-
2	49	పట్టా	మెట్ట	0.02'/	పాముల లక్ష్మమ్మ భర్త అంజయ్య	51	47	48	50	-	-	-	-	-
3	49/ఆ	పట్టా	మెట్ట	1.33	పల్లా రామకృష్ణారెడ్డి	51	47	48	50	-	-	-	-	-
4	47	పట్టా	మెట్ట	0.00'/	మెసర్స్ శ్రీవెల్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్	47	47	28	47	-	-	-	-	-
	మొత్తం			1.38'/										
కొత్తూరు గ్రామము														
1	32	పట్టా	మెట్ట	2.29	రెడ్డిరెడ్డి రవీంద్రరెడ్డి తండ్రి కృష్ణారెడ్డి	32	రోడ్	35	62	-	-	-	-	-
2	35	పట్టా	బావి పట్టా	1.32	రెడ్డిరెడ్డి రవీంద్ర రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి	35	రోడ్	35	32	-	-	-	-	-
3	62	పట్టా	మెట్ట	0.20	కర్నాటి నర్సింహులు తండ్రి ఉమయ్య	62	రోడ్	62	64	-	-	-	-	-
4	64	పట్టా	మెట్ట	0.01	కర్నాటి బాలు తండ్రి రాములు	64	రోడ్	64	64	-	-	[illegible]	1	-
5	64	పట్టా	మెట్ట	0.08	మెసర్స్ శ్రీ కృష్ణ ఇండస్ట్రీస్ రిప్రజెంటెడ్ బై ఉమరాణి భర్త నరేష్ రాథి	64	రోడ్	64	64	-	-	-	[illegible]	-
6	64	పట్టా	మెట్ట	0.08	మెసర్స్ శ్రీ కృష్ణ ఇండస్ట్రీస్ రిప్రజెంటెడ్ బై కళావతి భర్త గోపాల్‌దాస్ బంగ్	64	రోడ్	64	64	-	-	[illegible]	-	-
7	64/ఆ/2	పట్టా	మెట్ట	0.02'/	గడ్డి మంజుల భర్త దామోదర్‌రెడ్డి	64	రోడ్	64	64	-	-	-	-	-
8	64/ఆ/3	పట్టా	మెట్ట	0.02'/	గడ్డి సాయి కిరణ్‌రెడ్డి తండ్రి దామోదర్‌రెడ్డి	64	రోడ్	64	64	-	-	-	-	-
9	64/ఇ/1	పట్టా	మెట్ట	0.02	కర్నాటి నర్సింహులు తండ్రి ఉమయ్య	64	రోడ్	64	64	-	-	-	-	-
10	64/ఈ/1	పట్టా	మెట్ట	0.02	మెసర్స్ విజయ ఇండస్ట్రీస్ రిప్రజెంటెడ్ బై వై.రవికుమార్ తండ్రి వెంకటేశ్వరరావు	64	రోడ్	64	64	-	-	-	-	-
	మొత్తం			5.27										
మీర్‌ఖాన్‌పేట్ గ్రామము														
1	114	పట్టా	మెట్ట	0.01	జాకి చిన్న మల్లయ్య తండ్రి రామయ్య	112	112	112	112	-	-	-	-	-
2	118	పట్టా	మెట్ట	1.24	జాల్లేటి కృష్ణయ్య తండ్రి చెన్నయ్య	112	112	112	112	-	-	-	-	-
3	119	పట్టా	మెట్ట	0.32	జాల్లేటి దొంబమ్మ భర్త కృష్ణయ్య	118	120	112	112	[illegible]	1.15	[illegible]	7ద.గ.	-
4	112/65	గవర్న మెంట్	మెట్ట	0.19	ఖారీజ్‌ఖాతా	112	112	112	112	-	-	[illegible]	-	-
5	112/3	గవర్న మెంట్	మెట్ట	0.14	చిత్ర రాములమ్మ భర్త పెద్దయ్య	112	112	112	112	-	-	-	-	-
6	112/6/4	గవర్న మెంట్	మెట్ట	0.17	బోడ దశరథ తండ్రి సోమయ్య బోడ మమత భర్త ఉత్తరయ్య	112	112	112	112	-	-	-	-	-
7	112/6	గవర్న మెంట్ అసైన్డ్	మెట్ట	0.18	దప్పు సాయిలు తండ్రి ఎల్లయ్య	112	112	112	112	-	-	-	-	-
8	112	గవర్న మెంట్	మెట్ట	0.18	నక్కలకంటి నర్సింహ తండ్రి అచ్చయ్య	112	112	112	112	-	-	-	-	-
9	112	గవర్న మెంట్ అసైన్డ్	మెట్ట	0.18	నందిగామ పాపయ్య తండ్రి నర్సయ్య	112	112	112	112	-	-	-	-	-
10	112	గవర్న మెంట్ అసైన్డ్	మెట్ట	0.21	జాకి సత్తమ్మ భర్త లేట్ పెద్ద మల్లయ్య	112	112	112	112	-	-	-	-	-
11	112	గవర్న మెంట్ అసైన్డ్	మెట్ట	0.15	పల్లు కిష్టమ్మ భర్త కిష్టయ్య	112	112	112	112	-	-	-	-	-
12	112	గవర్న మెంట్	మెట్ట	6.36	టీఎస్ఐఐసీ	112	112	112	112	-	-	-	-	-
13	112	గవర్న మెంట్	మెట్ట	0.06	జాల్లేటి కృష్ణయ్య తండ్రి చెన్నయ్య	112	112	112	112	-	-	-	-	-
14	112	గవర్న మెంట్	మెట్ట	0.16	ముద్యాల మాసయ్య తండ్రి రామయ్య	112	112	112	112	-	-	-	-	-
15	112	గవర్న మెంట్	మెట్ట	0.16	నందిగామ బోడయ్య నందిగామ కృష్ణయ్య నందిగామ యాదయ్య తండ్రి తిరుపతయ్య మరియు నందిగామ లింగమ్మ భర్త లేట్ జంగయ్య	112	112	112	112	-	-	-	-	-
16	112	గవర్న మెంట్	మెట్ట	0.21	నందిగామ శ్రీహరి తండ్రి జంగయ్య	112	112	112	112	-	-	-	-	-
17	112	గవర్న మెంట్	మెట్ట	0.05	నందిగామ నర్సింహ తండ్రి పాపయ్య	112	112	112	112	-	-	-	-	-
	మొత్తం			14.17										
కందుకూరు గ్రామము														
1	62/అ	పట్టా	మెట్ట	0.07	సురసాని వెంకటనర్సింహా రెడ్డి తండ్రి ఎల్లారెడ్డి	63	1000	70	62	-	-	-	-	-
2	63/అ	పట్టా	మెట్ట	0.02		68	31 32	78	61 62	-	-	-	-	-
3	62/అ	పట్టా	మెట్ట	0.23	సురసాని నరోత్తమరెడ్డి తండ్రి నర్సింహారెడ్డి	63	1000	70	62	-	-	-	-	-
4	63/అ	పట్టా	మెట్ట	1.08		68	31 32	78	61 62	-	-	రోడ్ పేల్	1	-
5	62/అ	పట్టా	మెట్ట	0.16	సురసాని కమలాబాయి భర్త లేట్ రామచంద్రారెడ్డి	63	1000	70	62	-	-	-	-	-
6	63/అ	పట్టా	మెట్ట	0.28		67	31 32	78	61 62	-	-	-	-	-
7	62/అ	పట్టా	మెట్ట	0.23	సురసాని శ్రీనివాస్‌రెడ్డి తండ్రి కిర్యారెడ్డి	63	1000	70	62	-	-	-	-	-
8	180/అ	[illegible]	మెట్ట	0.03'/	కొమ్మనగల్ల యాదయ్య తండ్రి చిన్న బాలయ్య	180	180	179	181	-	-	-	-	-
9	180/అ	[illegible]	మెట్ట	0.01'/	కొమ్మనగల్ల అంజయ్య తండ్రి రాములు	180	180	179	181	-	-	-	-	-
10	180/అ	[illegible]	మెట్ట	0.02	కొమ్మనగల్ల రమేష్ తండ్రి రాములు	180	180	179	181	-	-	-	-	-
11	180/అ	[illegible]	మెట్ట	0.02'/	కొమ్మనగల్ల అంజయ్య తండ్రి జంగయ్య	180	180	179	181	-	-	-	-	-
12	180/అ	[illegible]	మెట్ట	0.02'/	కొమ్మనగల్ల ముత్తయ్య తండ్రి జంగయ్య	180	180	179	181	-	-	-	-	-
13	180/అ	[illegible]	మెట్ట	0.05	కొమ్మనగల్ల రామచంద్రయ్య తండ్రి ముత్తయ్య	180	180	179	181	-	-	-	-	-
14	180/అ	[illegible]	మెట్ట	0.02	కొమ్మనగల్ల బుచ్చయ్య తండ్రి ఎల్లయ్య	180	23	179	181	-	-	-	-	-
15	265	పట్టా	మెట్ట	0.05	ఎస్.వినోద భర్త యాదగిరిరెడ్డి	265	245	265	రోడ్	[illegible]	1	-	-	-
16	288	పట్టా	మెట్ట	0.18	కొలన్ శ్రీపాల్ రెడ్డి తండ్రి లేట్ రాంరెడ్డి	307	288	288	రోడ్	[illegible]	1.1[illegible]	[illegible]	[illegible]	-
17	288	పట్టా	మెట్ట	0.38	కె.అప్పారావు తండ్రి వెంకట సుబ్బారావు (పట్టేదార్) మాదాల సుధాకర్ తండ్రి భాస్కర్‌రావు (పర్చేజర్)	288	289	288	రోడ్	-	-	-	[illegible]	-
18	289	పట్టా	మెట్ట		సురసాని చంద్రారెడ్డి & ర్యావక రాములమ్మ (పట్టేదార్) వీవత కుటుంబరావు తండ్రి బ్రహ్మయ్య (పర్చేజర్)(393చ.గ. మరియు 433 చ.గ.)	14&రోడ్	రోడ్&1	వెంచర్‌రోడ్ &రోడ్	2&13	-	-	-	-	-
19	289	పట్టా	మెట్ట		సురసాని చంద్రారెడ్డి & ర్యావక రాములమ్మ (పట్టేదార్) సురతెల్లి హనుమంతరావు తండ్రి చెన్నయ్య మరియు నక్కలపు ప్రసాదరావు తండ్రి కోటయ్య (పర్చేజర్)(284 చ.గ.)	288	290	286	301	-	-	-	-	-
20	289	పట్టా	మెట్ట		సురసాని చంద్రారెడ్డి & ర్యావక రాములమ్మ (పట్టేదార్) బండారు జయ భర్త విజయకుమార్ (పర్చేజర్) (206 చ.గ.)	288	290	286	301	-	-	-	-	-
21	289	పట్టా	మెట్ట		సురసాని చంద్రారెడ్డి & ర్యావక రాములమ్మ (పట్టేదార్) దవ్వాకుల మరియరాజు తండ్రి శాంతయ్య మరియు సంధ్య రోజ్‌మేరి భర్త విజయ్‌కుమార్ (పర్చేజర్) (116 చ.గ.)	288	290	286	301	-	-	-	-	-
22	289	పట్టా	మెట్ట	1.04	సురసాని చంద్రారెడ్డి & ర్యావక రాములమ్మ (పట్టేదార్) జి.సుగుణ భర్త సీతారామ నాయుడు (పర్చేజర్)(240 చ.గ., 291చ.గ.&291 చ.గ.)	288	290	286	301	-	-	-	-	-
23	289	పట్టా	మెట్ట		సురసాని చంద్రారెడ్డి & ర్యావక రాములమ్మ (పట్టేదార్) క్రిష్ణాజాబు వెంచర్‌రోడ్ (0.061/2 గుంటలు)	288	290	286	301	-	-	-	-	-
24	289	పట్టా	మెట్ట		సురసాని చంద్రారెడ్డి & ర్యావక రాములమ్మ (పట్టేదార్) యాటెడ్డి శివరాము క్రిష్ణారెడ్డి తండ్రి వై.పిచ్చిరెడ్డి (పర్చేజర్) 483 చ.గ., 367 చ.గ., 366 చ.గ. మరియు 440 చ.గ.	288	290	286	301	-	-	-	-	-
25	289	పట్టా	మెట్ట		సురసాని చంద్రారెడ్డి & ర్యావక రాములమ్మ (పట్టేదార్) కొప్పుల సుధాకర్ రెడ్డి తండ్రి లేట్ నారాయణరెడ్డి (పర్చేజర్)(183 చ.గ.)	288	290	286	301	-	-	-	-	-
26	289	పట్టా	మెట్ట		సురసాని చంద్రారెడ్డి & ర్యావక రాములమ్మ (పట్టేదార్) రెడ్డి ప్రదీప్ తండ్రి రామకోటేశ్వరరావు (పర్చేజర్)(182 చ.గ.)	288	290	286	301	-	-	-	-	-
27	289	పట్టా	మెట్ట		సురసాని చంద్రారెడ్డి & ర్యావక రాములమ్మ (పట్టేదార్) వెంచర్‌రోడ్ (0.021/4 గుంటలు)	288	290	286	301	-	-	-	-	-
28	289	పట్టా	మెట్ట	0.04	ర్యావక రాములమ్మ భర్త వెంకటరెడ్డి (పట్టేదార్) మెసర్స్ జీకేఎస్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రిప్రజెంటెడ్ బై వరప్రసాద్ (పర్చేజర్)	288	290	286	301	-	-	-	-	-
29	291	పట్టా	మెట్ట	0.20	నిమ్మ పుల్లారెడ్డి తండ్రి జంగారెడ్డి	291	291	291	రోడ్	-	-	[illegible]	40చ.గ.	-
30	292	పట్టా	మెట్ట	0.01	బాకారం పెద్ద దేవమ్మ (పట్టేదార్) గోరాను అనసూయ భర్త శ్రీరాములు (పర్చేజర్)	292	294	292	293	-	-	-	-	-
31	291	పట్టా	మెట్ట	0.03'/	రమావత్ శ్రీదేవి భర్త రాగాద్	291	292	291	297	-	-	-	-	-
32	292	పట్టా	మెట్ట	0.04		292	292	292	293	-	-	-	-	-
33	291	పట్టా	మెట్ట	0.03'/	రమావత్ లక్ష్మీ తండ్రి రామచందర్	291	291	291	297	-	-	-	-	-
34	292	పట్టా	మెట్ట	0.04		291	292	292	293	-	-	-	-	-
35	291	పట్టా	మెట్ట	0.10	రమావత్ సంధ్యానాయక్ తండ్రి టీక్యా	291	292	292	292	-	-	-	-	-
36		పట్టా	మెట్ట	0.01'/	ఎస్.యాదగిరిరెడ్డి తండ్రి అనంతరెడ్డి	291	297	291	రోడ్	-	-	-	-	-
37	297	పట్టా	మెట్ట	0.020'/	ఎస్.మాధవరెడ్డి తండ్రి చంద్రారెడ్డి	297	297	రోడ్	297	-	-	[illegible]	-	-
38		పట్టా	మెట్ట	0.02	ఎస్.వెన్నారెడ్డి తండ్రి నారాయణరెడ్డి	297	297	291	రోడ్	-	-	-	-	-
39	297	పట్టా	మెట్ట	0.10	ఎస్.మాధవరెడ్డి తండ్రి అనంతరెడ్డి ఎస్.యాదగిరిరెడ్డి తండ్రి చంద్రారెడ్డి (పట్టేదార్స్) సిలికాన్ వెంచర్ (పర్చేజర్)	301	293	290 291	296 298	-	-	[illegible]	-	-
40	301	పట్టా	మెట్ట	0.04	జి.దర్శన్ తండ్రి మల్లయ్య (పట్టేదార్) మెసర్స్ జీకేఎస్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రిప్రజెంటెడ్ బై వరప్రసాద్ (పర్చేజర్)	288	290	286	301	-	-	-	-	-
41	302	పట్టా	మెట్ట	0.05	రమావత్‌దేవ్‌సింగ్ తండ్రి లచ్చానాయక్	[illegible]	వెంచర్	రోడ్	302	-	-	-	-	-
42	302	పట్టా	మెట్ట	0.04'/	సురసాని మోహన్‌రెడ్డి (పట్టేదార్) ఇంద్రప్రస్థ వెంచర్ బై అప్పల్ రోడ్ (పర్చేజర్)	303	301	288	300	-	-	-	-	-
43					వి.వెంకట్యా తండ్రి వాల్యా యాక్చువల్ అలాట్ మెంట్ 121 చ.గ. అక్యుపైడ్ ఎక్స్‌టెంట్ 134 చ.గ.	బజరంగ్	దేమింగ్	రోడ్	వి.రాజా	-	-	[illegible]	-	-
44					కె.బజరంగ్ తండ్రి వాల్యా యాక్చువల్ అలాట్ మెంట్ 121 చ.గ. అక్యుపైడ్ ఎక్స్‌టెంట్ 126చ.గ.	ధర్మ	వెంకట్యా	రోడ్	శివలాల్	-	-	[illegible]	[illegible]	-
45					వంకడోత్ ధర్మ తండ్రి దేవ్లా యాక్చువల్ అలాట్ మెంట్ 121చ.గ. అక్యుపైడ్ ఎక్స్‌టెంట్ 121చ.గ.అక్యుపైడ్ ఎక్స్‌టెంట్ 107చ.గ.	బాల్యానాయక్	బజరంగ్	రోడ్	ధర్మ	-	-	[illegible]	[illegible]	-
46					ఆర్.బాల్యానాయక్ తండ్రి కన్య యాక్చువల్ అలాట్ మెంట్ 121చ.గ. అక్యుపైడ్ ఎక్స్‌టెంట్ 107 చ.గ.	హాంసాలి	ధర్మ	రోడ్	బాలాజీ&బద్యా	-	-	[illegible]	-	-
47					ఆర్.హాంసాలి భర్త సంధ్యనాయక్ యాక్చువల్ అలాట్ మెంట్ 121 చ.గ. అక్యుపైడ్ ఎక్స్‌టెంట్ 107 చ.గ.	బద్యానాయక్	బాల్యానాయక్	రోడ్	సంజ్యా	-	-	[illegible]	-	-
48					ఆర్.బద్యానాయక్ తండ్రి రామ్‌సింగ్ యాక్చువల్ అలాట్ మెంట్ 121 చ.గ. అక్యుపైడ్ ఎక్స్‌టెంట్ 299చ.గ.	జగ్య	హాంసాలి	రోడ్	బద్యా	-	-	[illegible]	-	-
49	302/అ	పట్టా అసైన్డ్ ల్యాండ్/[illegible]	మెట్ట	0.19	ఎస్.జగ్యా తండ్రి పుల్యా యాక్చువల్ అలాట్ మెంట్ 121చ.గ. అక్యుపైడ్ ఎక్స్‌టెంట్ 107చ.గ.	కేశ్యానాయక్	బద్యా	రోడ్	జగ్య	-	-	[illegible]	-	-
50					ఆర్.కేశ్యానాయక్ తండ్రి విఠ్య యాక్చువల్ అలాట్ మెంట్ 121చ.గ. అక్యుపైడ్ ఎక్స్‌టెంట్ 183చ.గ.	[illegible]	[illegible]	రోడ్	[illegible]	-	-	[illegible]	-	-
51					వి.రాజా తండ్రి వాల్యా యాక్చువల్ అలాట్ మెంట్ 121చ.గ.	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-	-	-	-
52					కె.శివలాల్ తండ్రి వాల్యా యాక్చువల్ అలాట్ మెంట్ 121చ.గ.	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-	-	-	-
53					[illegible] యాక్చువల్ అలాట్ మెంట్ 121 చ.గ.	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-	-	-	-
54					[illegible] యాక్చువల్ అలాట్ మెంట్121 చ.గ.	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-	[illegible]	-	-
55					ఆర్.సంజ్యానాయక్ యాక్చువల్ అలాట్ మెంట్121 చ.గ.	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-	[illegible]	-	-
56					ఆర్.బద్యానాయక్ యాక్చువల్ అలాట్ మెంట్121 చ.గ.	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-	[illegible]	-	-
57					ఎస్.జగ్యా తండ్రి పుల్యా యాక్చువల్ అలాట్ మెంట్121 చ.గ.	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-	[illegible]	-	-
58					ఆర్.కేశ్యానాయక్ తండ్రి విఠ్య యాక్చువల్ అలాట్ మెంట్121 చ.గ.	[illegible]	[illegible]	[illegible]	[illegible]	-	-	[illegible]	-	-
59	302/అ	[illegible]	మెట్ట	0.03	ప్రైమరీ స్కూల్ & అంగన్‌వాడి బిల్డ్	303	301	288 289	300	-	-	-	-	-
60	303/అ1	[illegible]	మెట్ట	0.12	రమావత్ బాలకిషన్ నాయక్ తండ్రి [illegible]	306	302	302 288	304	-	-	-	-	-
61	303/అ2	[illegible]	మెట్ట	0.24	[illegible]	306	302	288 307	304	-	-	-	-	-
62	306/అ	[illegible]	మెట్ట	1.08	[illegible]	306	303	రోడ్	306	-	-	-	-	-
63		[illegible]	మెట్ట	0.08	[illegible]	311	306	307	309	-	-	-	-	-
64	308	[illegible]	మెట్ట	0.08	[illegible]	311	306	307	309	-	-	-	-	-
65		[illegible]	మెట్ట	0.08	[illegible]	311	306	307	309	-	-	-	-	-
66		[illegible]	మెట్ట	0.08	[illegible]	311	306	307	309	-	-	-	-	-
67	311/అ	[illegible]	మెట్ట	0.15	[illegible]	312	308	[illegible]	310	-	-	-	-	-
68	998/అ	పట్టా	మెట్ట	2.00	[illegible]	1000	1001	997	999	-	-	-	-	-
69	998	పట్టా	మెట్ట	1.19	[illegible]	1000	1001	997	999	-	-	-	-	-
70	999	పట్టా	మెట్ట	1.11	[illegible]	70	1000	998	1000	-	-	-	-	-
71	999	పట్టా	మెట్ట	1.11	[illegible]	70	1000	998	1000	-	-	-	-	-
72	999	పట్టా	మెట్ట	0.07	[illegible]	70	1000	998	1000	-	-	-	-	-
73	999	పట్టా	మెట్ట	0.07	[illegible]	70	1000	998	1000	-	-	-	-	-
	మొత్తం			19.16'/										

భూసేకరణలో పారదర్శకం న్యాయబద్ధమైన నష్టపరిహారం రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంట్ చట్టం 2013కేంద్రప్రభుత్వ చట్టం 30/2013లోని సెక్షన్ 11(1) క్రింద మరియు సవరించిన న్యాయ బద్ధమైన నష్టపరిహారం మరియు భూసేకరణలో పారదర్శకత, రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంటు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం.21/2017) ప్రకారం ఆసక్తి గల వ్యక్తులందరికీ తెలియ చేయడమైనది.

సేకరణ భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, కందుకూరు డివిజన్ కార్యాలయములో అందుబాటులో ఉండును. ఆసక్తి గల వ్యక్తులెవరైనను ప్రభుత్వ పని దినములలో మరియు పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ ప్రభుత్వము/కలెక్టర్, రంగారెడ్డి జిల్లాగారు చట్టంలోని సెక్షన్ 12 ప్రకారము కల్పించిన మరియు పేర్కొన్నట్లుగా వారి పనిని నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతర పనులు అనగా భూమి సర్వే, భూమి పరిశీలన కొరకు, భూమి పొరలను త్రవ్వుటకు మరియు సంబంధిత పనులు చేయడానికి కావలసిన అన్ని చర్యలు నిర్వహించుటకు భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, కందుకూరు డివిజన్, రంగారెడ్డి జిల్లా గారిని నియమించినారు.

చట్టం యొక్క సెక్షన్ 11(4) క్రింద కలెక్టరు గారి ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి సదరు స్థలములో ఏ వ్యక్తి కూడా భూమి యొక్క ఏమైన లావాదేవీలు అనగా అమ్మకం/కొనుగోలు/లేదా ఏమైన బాకట్టు రుణభారాలను చేయరాదు.

భూసేకరణకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, కందుకూరు డివిజన్, రంగారెడ్డి జిల్లా ముందు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద పేర్కొన్నట్లుగా ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి 60(అరవై రోజులు) లోపు ఆసక్తి గల వ్యక్తులు దాఖలు చేసుకోవచ్చును.

తహసీల్దార్ కందుకూరు మండలం	భూసేకరణ అధికారి/ రెవెన్యూ డివిజనల్ అధికారి కందుకూరు డివిజన్ రంగారెడ్డి జిల్లా	జాయింట్ కలెక్టర్ రంగారెడ్డి జిల్లా	జిల్లా కలెక్టర్ రంగారెడ్డి

మారిన తరం.. 'సర్కార్'ను మార్చింది

ఈశాన్య ఎర్రకోటపై కాషాయ జెండా

సీఎం మంచోడే కానీ మార్పును కోరుకున్న త్రిపుర ప్రజలు

ప్రభుత్వ బలహీనతలు, ప్రజల్లో అసంతృప్తిని సొమ్ము చేసుకున్న బీజేపీ

అగర్తల, మార్చి 3:

సుదీర్ఘకాలం పశ్చిమ బెంగాల్‌ను పాలించి దానిని పోగొట్టుకున్న కమ్యూనిస్టులు తాజాగా మరో కంచుకోటలో పరాజయం పాలయ్యారు. గత 25 ఏండ్లుగా తమకు ఎదురేలేదని భావించిన ఎర్రసోదరుల అడ్డాలో కాషాయ నేతలు పాగా వేశారు. ఈశాన్య భారతంలోని త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార సీపీఎం అనూహ్యంగా ఓటమి పాలైంది. 2013 ఎన్నికల్లో కనీసం ఖాతా కూడా తెరువని బీజేపీ ఈసారి ఏకంగా అధికారానికి ఎగబాకింది. పశ్చిమ బెంగాల్లో ఇప్పటికే కోలుకోని రీతిలో దెబ్బతిన్న కమ్యూనిస్టులు కనీసం త్రిపురనైనా నిలబెట్టుకుందామని ఆశించారు. అందుకోసం వారు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్‌పై భారీ ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆ రాష్ట్ర ఓటర్లు వారి ఆశలను అడియాశలు చేశారు. 1998లో మాణిక్ సర్కార్ రాష్ట్ర పగ్గాలు చేపట్టినప్పుడు బెంగాలీలు, గిరిజనుల మధ్య త్రిపుర చీలిపోయి ఉంది. బంగ్లాదేశ్ స్థావరంగా ఉన్న తీవ్రవాదులు ఆకస్మికంగా రాష్ట్రంపై దాడిచేసి హింసకు పాల్పడేవారు. సర్కార్ దూకుడు నిర్ణయాలతో తీవ్రవాదులను బలహీనపరచగలిగారు. తన బెంగాలీ గుర్తింపుతో రాష్ట్రంలోని మెజారిటీ వర్గంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోగలిగారు. అలాగే గిరిజన ప్రాంతాలలో సైతం సీపీఎం క్రియాశీలంగా వ్యవహరించింది. దీంతో ప్రతిసారి గిరిజన ప్రాంతాల్లోని మొత్తం 20 సీట్లను సీపీఎం కైవసం చేసుకొనేది. ఈ విధంగా 25 ఏండ్లపాటు వరుసగా ఐదుసార్లు సీపీఎం అధికారానికి వచ్చింది.

2013కు ముందే మొదలైన వ్యతిరేకత

మాణిక్ సర్కార్ సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ ప్రజల్లో అసంతృప్తి తీవ్రంగా నెలకొంది. అది 2013 ఎన్నికల్లోనే ప్రస్ఫుటమైంది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ 36 శాతం ఓట్లను తెచ్చుకోగలిగింది. ఇది సీపీఎం ప్రభుత్వం పట్ల వ్యతిరేకతను స్పష్టం చేసింది. అయితే కాంగ్రెస్ ప్రతిపక్ష పాత్రను నిర్వహించడంలో విఫలం కావడంతో ఆ ఖాళీని బీజేపీ భర్తీ చేయగలిగింది. ప్రభుత్వోద్యోగుల్లో అత్యధికులు సీపీఎం కార్యకర్తలే అయినప్పటికీ వారికి ఇంకా నాలుగో వేతన కమిషన్ ప్రకారమే జీతాలు అందుతున్నాయి. దీంతో వారిలో కూడా ప్రభుత్వం పట్ల అసంతృప్తి నెలకొంది. వారికి ఏడో పే కమిషన్ ప్రకారం వేతనాలిస్తామని బీజేపీ వాగ్దానం చేసింది. ఇక యువత కొత్తదనం వైపు అర్రులుచాచింది. రాష్ట్రంలో ఆధునికత లోపించిందని, ఉద్యోగాలు రావడం లేదని, వచ్చిన వాటిని సీపీఎం కార్యకర్తలు తన్నుకుపోతున్నారని బీజేపీ ప్రచారం చేసింది. రాష్ట్రంలో పూర్తిస్థాయి అభివృద్ధి తమవల్లనే సాధ్యం అని బీజేపీ నమ్మించగలిగింది. రాష్ట్రంలో శాంతిని స్థాపించేందుకు మాణిక్ సర్కార్ పడిన శ్రమ కొత్త తరం ఓటర్లకు అంతగా తెలియదు. మాణిక్ సర్కార్ నిరాడంబర జీవితం, మచ్చలేని రాజకీయ చరిత్ర ప్రజల్లో నిజాయితీగల నేతగా నిలబెట్టాయి. కానీ అతని హాయంలోనే చిట్‌ఫండ్ కుంభకోణం చోటుచేసుకోవడంతో బీజేపీ దానిని ప్రచారాస్త్రంగా మార్చుకొంది. అలాగే సర్కార్‌ను బెంగాలీ పక్షపాతి అని ఆరోపించి గిరిజనులను ఆయనకు దూరం చేయగలిగింది. అగర్తలలోని కాలేజీలు, మార్కెట్లు, రాజధాని శివారు ప్రాంతాలు, బెంగాలీ పట్టణాలు, గిరిజన గ్రామలు అందరూ సీఎం మంచివాడన్న ఒకే పల్లవిని వినిపించాయి. కానీ తాము మార్పును కోరుతున్నామని ఎన్నికల ద్వారా తమ మనస్సులోని మాటను బయటపెట్టాయి.



మాణిక్ సర్కార్

బెంగాల్.. కేరళ కాదంటే బంగ్లాకెళ్లొచ్చు!

మాణిక్‌పై హిమంత్ బిశ్వశర్మ ఎద్దేవా

అగర్తల: త్రిపుర సీఎం మాణిక్ సర్కార్ తల దాచుకునేందుకు పొరుగున ఉన్న పశ్చిమ బెంగాల్‌కు గానీ, దక్షిణాదిన గల కేరళకు గానీ, సరిహద్దు ఆవల బంగ్లాదేశ్‌కు గానీ వెళ్లవచ్చునని బీజేపీ నేత హిమంత్ బిశ్వశర్మ ఎద్దేవా చేశారు. త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో బిశ్వశర్మ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'మాణిక్ సర్కార్ ముందు మూడే ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఆయన బెంగాల్‌కు గానీ, కేరళకు గానీ, పొరుగున ఉన్న బంగ్లాదేశ్‌కు గానీ వెళ్లొచ్చు' అని శనివారం అగర్తలలో జరిగిన విజయోత్సవ సభలో చెప్పారు.

వినూత్న పేర్లు వీరికే సొంతం

ఇటలీ, అర్జెంటీనా, స్వీడన్ అనే పేర్లున్నాయ్ ▪ కుర్చీ, టేబుల్, పేపర్ అనేవి కూడా వినబడుతాయ్

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఇద్దరు నెహ్రూలు ▪ మేఘాలయలోని ఓ గ్రామంలో ప్రజలకు వింత పేర్లు



మేఘాలయలోని తురా నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఎన్‌పీపీ అభ్యర్థిని అగతాసంగ్మా

ఉమ్మ్న్యా (మేఘాలయ), మార్చి3: మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఇటలీ, అర్జెంటీనా, స్వీడన్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అక్కాచెల్లెలు అయిన గుడ్‌నెస్, యూనిటీలు ఇప్పుడు స్కూల్‌కెళ్లారు... అదేంటి మీ నోటికొచ్చిన పేర్లు చెబుతున్నారు. అవేమన్నా మనుషుల పేర్లా..? అని ఆశ్చర్యపోతున్నారా?. అంతలా నోరు తెరుచుని మైగాడ్ అనకండి. ఎందుకంటే మైగాడ్ అనేది ఎవరికో ఒకరికి పేరుగా తల్లిదండ్రులు పెట్టివుంటారు. మీరు చదివిన పేర్లన్నీ మనుషులవే. మన దేశంలోని మేఘాలయ రాష్ట్రంలోనివే అంటే మరింత ఆశ్చర్యపోతారు. మేఘాలయ రాష్ట్రంలోని బంగ్లాదేశ్ సరిహద్దులోని కుగ్రామంఉమ్మ్న్యా త్మార్ ఎలకా. 850 మంది పురుష ఓటర్లు, 916మంది స్త్రీ ఓటర్లు ఉన్నారు. అయితే ఓటర్ లిస్టులోని పేర్లు చదివితే మాత్రం పగలబడి నవ్వడం ఖాయం. ఈ గ్రామంలోని సగం జనాభాకు వింత పేర్లు ఉన్నాయి. అర్థం తెలియనప్పటికీ పలకడానికి బాగుందని ఇంగ్లిష్ పేర్లు పెట్టుకుంటున్నారు. ఇంటర్ ప్లస్ పూర్తిచేసుకున్న ఓ యువతికి ఆమె తల్లి 'ఐ హావ్ బీన్ డెలివర్డ్ ' అని నామకరణం చేశారు. ఇక్కడే ఉన్న ముగ్గురు అక్కాచెల్లెల్ల పేర్లు తమాషాగా రిక్వెస్ట్, లవ్లీనెస్, హ్యాపీనెస్ అని వాళ్ల తల్లి షుకీ నామకరణం చేశారు. అంతే కాదు, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు నెహ్రూలు కూడా పోటీ చేశారు. అలాగే ఫ్రాంక్ ఐన్‌స్టీన్, కెన్నెడీలు కూడా బరిలో నిలిచారంటే ఒకింత ఆశ్చర్యమేస్తుంది కదూ.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో కలిసి పనిచేస్తాం

- భారత్, వియత్నాం ప్రకటన
- ప్రధాని మోదీతో వియత్నాం అధ్యక్షుడు ఖ్వాంగ్ విస్తృత చర్చలు

న్యూఢిల్లీ, మార్చి 3: ప్రాంతీయ భద్రత కోసం ఇండో - పసిఫిక్ ప్రాంతంలో కలిసి పని చేయాలని భారత్, వియత్నాం నిర్ణయించాయి. ఈ ప్రాంతంలో చైనా మిలిటరీ విస్తరణను అడ్డుకోనున్నట్లు సంకేతాలివ్వాలని తీర్మానించాయి. శనివారం ప్రధాని నరేంద్రమోదీ, వియత్నాం అధ్యక్షుడు త్రాన్ డై ఖ్వాంగ్ వివిధ అంశాలపై విస్తృత స్థాయి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అణు ఇంధనం, వాణిజ్యం, వ్యవసాయ రంగాల్లో పరస్పర సహకారం కోసం మూడు ఒప్పందాలపై ఇరు దేశాల అధికారులు సంతకాలు చేశారు. చమురు, సహజ వాయువు అన్వేషణలో సంబంధాలు బలోపేతం చేసుకోవడంతోపాటు సముద్ర తీర ప్రాంతంలో ద్వైపాక్షిక సహకారం పెంపొందించుకోవాలని కూడా నిర్ణయించారు. వియత్నాం అధ్యక్షుడు ఖ్వాంగ్‌తో కలిసి ప్రధాని మోదీ మీడియాతో మాట్లాడుతూ ఇరు దేశాల సార్వభౌమత్వం, అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ఇండో - పసిఫిక్ ప్రాంతంలో ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించాలని కూడా నిర్ణయించినట్లు తెలిపారు. వియత్నాం అధ్యక్షుడు ఖ్వాంగ్ మాట్లాడుతూ ఆసియాన్ దేశాలతో భారత్ అమలు చేస్తున్న బహుముఖ అనుసంధాన విధానానికి మద్దతునిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో తప్పనిసరిగా స్వేచ్ఛగా నౌకాయానం, విమానయానానికి వెసులుబాటు కల్పించాల్సి ఉన్నదన్నారు. తీర ప్రాంత భద్రత, సైబర్ భద్రత కోసం కలిసి పని చేయాలని ఇరు దేశాలు అంగీకారానికి వచ్చినట్లు తెలిపారు. అంతకుముందు వియత్నాం అధ్యక్షుడు ఖ్వాంగ్.. విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్‌తో సమావేశమయ్యారు. ఖ్వాంగ్ గౌరవార్థం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆయనకు విందునిచ్చారు.



వియత్నాం అధ్యక్షుడు త్రాన్ డై ఖ్వాంగ్‌తో ప్రధాని మోదీ

రాఫెల్, బోఫోర్స్ మధ్య పోలికే లేదు

రక్షణ మంత్రి నిర్మల సీతారామన్

న్యూఢిల్లీ, మార్చి 3: రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు, బోఫోర్స్ కుంభకోణానికి పోలికే లేదని రక్షణ శాఖ మంత్రి నిర్మల సీతారామన్ అన్నారు. 36 రాఫెల్ జెట్ విమానాల కొనుగోళ్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలను కొట్టివేశారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో అసలు కుంభకోణమే లేదని ఆమె శనివారం మీడియాతో అన్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ బడ్జెట్ మలి విడుత సమావేశాల్లో రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు అంశాన్ని కాంగ్రెస్ పార్టీ లేవనెత్తితే స్వాగతిస్తామని చెప్పారు. జమ్ముకశ్మీర్‌లో సరిహద్దు ఆవలి నుంచి చొరబాట్లతోపాటు కాల్పులకు పాల్పడుతున్న పాక్‌కు దీటుగా భారత్ బలగాలు ప్రతిస్పందిస్తున్నాయని ఆమె తెలిపారు. మాల్దీవులలో పరిస్థితులను గమనిస్తున్నామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో సాయుధ దళాల (ప్రత్యేకాధికారాలు) చట్టం అమలుపై పునరాలోచించే ఆలోచనే లేదన్నారు. ఇదిలా ఉంటే గత యూపీఏ ప్రభుత్వ హయాంలో చౌక ధరకే రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఒప్పందం కుదిరితే మోదీ ప్రభుత్వం రూ.58 వేల కోట్ల ఖర్చుతో 36 విమానాలు మాత్రమే కొన్నదని కాంగ్రెస్ వాదించనున్నది. కానీ యూపీఏ ప్రభుత్వ హయాంలో 126 యుద్ధ విమానాల కొనుగోలుకు తుది ఒప్పందం రూపుదిద్దుకోలేదని అధికార వర్గాలు తెలిపాయి.

శాశ్వత అధ్యక్షుడిగా జీ జిన్‌పింగ్!

నిర్ణయం తీసుకోనున్న చైనా.. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం

బీజింగ్, మార్చి 3: చైనా పార్లమెంట్ సమావేశాలు లాంఛనంగా శనివారం ప్రారంభమయ్యాయి. జీ జిన్‌పింగ్‌ను శాశ్వత అధ్యక్షుడిగా నియమించేందుకు వీలుగా 'ఒక వ్యక్తి రెండు విడుతలకు మించి అధ్యక్షుడిగా కొనసాగరాదు' అన్న నిబంధనను తొలగిస్తూ ఈ పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ సవరణ చేయనున్నారు. చైనా ప్రజల రాజకీయ సంప్రదింపుల సభ (సీపీపీసీసీ), జాతీయ ప్రజా కాంగ్రెస్ (ఎన్పీసీ)లకు చెందిన సుమారు 5000 మంది ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తోపాటు ప్రధాని లీ కియాంగ్, చైనా కమ్యూనిస్టు పార్టీ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశాల ప్రారంభాన్ని దేశమంతటా ప్రత్యక్ష ప్రసారం చేశారు. జీ జిన్‌పింగ్‌ను జీవితకాలం అధ్యక్షుడిగా చేయనున్న చైనా ప్రతిపాదనపై దేశీయంగానూ, విదేశాల్లో ఆందోళన వ్యక్తమైంది. ఒక వ్యక్తి దేశాధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా రెండుసార్లకు మించి పని చేయరాదన్న నిబంధనను తొలిగించాలని ఇటీవల జరిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ తీర్మానించింది.

పుస్తక పఠనంలో గడ్చిరోలి గిన్నిస్ రికార్డు

గడ్చిరోలి, మార్చి 3: పుస్తక పఠనంలో మహారాష్ట్రలోని గడ్చిరోలి గిన్నిస్ రికార్డు సృష్టించింది. శనివారం గడ్చిరోలిలో దాదాపు 7,000 మంది ప్రజలు పుస్తక పఠనం చేసి రికార్డు సృష్టించారు. గతంలో ఈ రికార్డు టర్కీ పేరిట ఉంది. ఈ కార్యక్రమాన్ని గడ్చిరోలి పోలీసులు నిర్వహించారు. గడ్చిరోలి ఎస్పీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ 'గడ్చిరోలిపై నక్సల్స్ ప్రాంతం అని ముద్ర ఉన్నది. ఈ పేరును రూపమాపడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహించాం. గిన్నిస్ రికార్డు సృష్టించినందుకు సంతోషంగా ఉంది' అని తెలిపారు.

కర్ణాటకలో బీజేపీ 'జన సురక్ష యాత్ర'

- ప్రారంభించిన కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్
- 6న మంగళూరు సభలో ప్రసంగించనున్న యూపీ సీఎం యోగి

బెంగళూరు, మార్చి 3: కర్ణాటకలో అధికారం దక్కించుకోవాలని భావిస్తున్న భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో 'జన సురక్ష యాత్ర' చేపట్టింది. రాష్ట్రంలోని కోస్తా, మల్నాడ్ లాంటి సున్నిత ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేక విధానాలు లక్ష్యంగా విమర్శలు గుప్పిస్తామని ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. అంకోలా సభలో శనివారం కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ఈ యాత్రను ప్రారంభించారు. మార్చి 6న మంగళూరులో చేపట్టే భారీ సభలో ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రసంగించే అవకాశం ఉన్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ నాలుగున్నరేండ్ల పాలనలో 23 మంది బీజేపీ కార్యకర్తలు మరణించారని, ఇది ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హిందూ వ్యతిరేక విధానాలకు నిదర్శమని యాత్ర ప్రారంభం సందర్భంగా బీజేపీ ట్వీట్ చేసింది.

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం 4 మార్చి 2018
WWW. NTNEWS.COM

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



శ్రీదేవి ఆప్యాయత మిస్సవుతున్నా..

బంధాల్ని.. అనుబంధాల్ని.. ఆప్యాయతల్ని.. అభిమానాన్ని విడిచి వెళ్లిపోయింది అతిలోక సుందరి శ్రీదేవి!
ఇప్పుడు శ్రీదేవి.. శ్రీదేవి.. అని ఎంత పిలిచినా తిరిగి రాదు!
ఆమె స్మృతులను.. ఆమెతో ఉన్న పరిచయాలను గుర్తుచేసుకోవడం..
నెమరేసుకోవడం తప్పితే వేరే ఏమీ చేయలేం!
శ్రీదేవి సినీ ప్రయాణంలో ఎంతోమంది పరిచయం అయినా.. క్లోజెస్ట్ మాత్రం కొందరే ఉన్నారు!
అలాంటివారిలో ఒకరు పింకీరెడ్డి.
ఆశ్చర్యమేమిటంటే.. అందరూ శ్రీదేవిని ఇష్టపడితే.. శ్రీదేవేమో పింకీరెడ్డిని ఇష్టపడేది!
అంత మనసుకు నచ్చిన వ్యక్తి కాబట్టే శ్రీదేవి ఆఖరి ఫోన్‌కాల్ కూడా పింకీరెడ్డితోనే మాట్లాడింది!
సుదూర స్నేహం.. సుమధుర జ్ఞాపకాలు.. శ్రీదేవి నిష్క్రమణ గురించి పింకిరెడ్డితో మాట్లాడి తెలుసుకుందాం!



- **మీ ఇద్దరికీ పరిచయం ఎలా ఏర్పడింది?**
- ■ నేను సుబ్బిరామిరెడ్డి కూతుర్ని. శ్రీదేవి గారు షూటింగ్‌కి వచ్చేటప్పుడు కలిసేవారు. మేం అప్పట్లో నాగేశ్వరరావు గారి ఇంటి ఎదురుగా ఉండేవాళ్లం. అక్కడికి ఆవిడ వచ్చేవారు. నాతో మాట్లాడేవారు. అది అంత గుర్తు లేదు కానీ నేను 13 యేండ్ల వయసున్నప్పుడు పరిచయం బాగా పెరిగింది. అప్పుడు శ్రీదేవి గారి చెల్లెలు శ్రీలత, నేను మంచి ఫ్రెండ్స్.

- **ఆమె చనిపోయిందన్న విషయం ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రాణ స్నేహితురాలిగా మీరు?**
- ■ నేను ఇప్పటికీ నమ్మలేకపోతున్నా. తట్టుకోవడం చాలా కష్టంగా ఉంది. తను ముంబైలో ఉంది, ఎప్పటికైనా.. ఏదో ఒక రోజు నాకు ఫోన్ చేస్తుందనుకుంటున్నా. ఇదంతా ఒక కల అయితే బాగుండనిపిస్తున్నది.

- **ఆమె మరణం వెనుక ఏదో మిస్టరీ ఉందన్న వార్తల్లో నిజమెంత అనుకుంటున్నారు?**
- ■ అసలు ఇలా ఎందుకు అందరూ ఆలోచిస్తున్నారో నాకర్థం కావడం లేదు. అలా ఆరోపణలు చేసేవాళ్లు వాళ్ల కుటుంబం గురించి ఒక్కసారైనా ఆలోచించారా? అసలే బాధల్లో ఉన్నారు, వాళ్లను మరింత బాధపెడుతున్నట్లు అనిపిస్తుంది. ఏమైనా ఉంటే డాక్టర్లు చెబుతారు కదా!

- **వర్మ గారు ఆమె మానసిక వ్యథ అనుభవించారని ట్వీట్లలో పేర్కొన్నారు. అందులో నిజమెంత?**
- ■ ఇది పూర్తి అబద్ధం. దీంట్లో ఏమాత్రం నిజం లేదు. ఆయనకేదో మానసిక సమస్య ఉందనిపిస్తున్నది. అసలు చనిపోయిన వ్యక్తి గురించి అలా ఎలా మాట్లాడుతారో నాకర్థం కావడం లేదు. శ్రీదేవి చాలా హ్యాపీ పర్సన్. భర్త, పిల్లలతో చాలా సంతోషంగా ఉండేది. చిన్న చిన్న సమస్యలు అందరి ఇంట్లోనూ ఉంటాయి. అంతేకానీ నాకు తెలిసి మానసిక వ్యథ చెందేలా సమస్యలు ఆమెకేమీ లేవు. మంచి జీవితం తనది.

- **మీతో చివరి సారిగా ఫోన్‌లో సంభాషించినప్పుడు ఏం మాట్లాడారు?**
- ■ దుబాయ్‌కి వెళ్లే ఒకరోజు ముందు నాతో మాట్లాడింది. అక్కడ నాన్నగారిది అవార్డు ఫంక్షన్ ఉంది. దానికి రమ్మని పిలిచాను. 'ఇప్పుడు పెళ్లికి వెళుతున్నాను. పైగా జ్వరంగా ఉంది, గొంతు నొప్పి కూడా ఉందని చెప్పింది. యాంటీ బయాటిక్స్ వాడుతున్నా' అన్నది. 'పెళ్లి నుంచి వచ్చిన తర్వాత ఒకరోజు చూసుకొని హైదరాబాద్ వస్తా. నా మనవడిని చూడడానికి తప్పకుండా వస్తా' అని చెప్పింది. ఇంతలోనే తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయింది.

- **అందరూ అనుకున్నట్లు శ్రీదేవి అందం గురించి చాలా తాపత్రయపడేవారా?**
- ■ అందం గురించి తాపత్రాయపడని అమ్మాయి ఎవరైనా ఉంటారా? తను దానికి అతీతం కాదు అని నేననుకుంటాను. మామూలు అమ్మాయే అద్దం ముందు గంటసేపు గడుపుతారు. మగవాళ్లకు కూడా ఈ మధ్య బ్యూటీపార్లరు వెలిశాయి. అందరూ అందంగా కనిపించాలనే కోరుకుంటారు. అందులో శ్రీదేవి కూడా ఉంది. అంతేకానీ దాని గురించే ఆలోచించే వ్యక్తి మాత్రం కాదు.

- **చివరిసారిగా ఎప్పుడు కలిశారు? అప్పుడు ఏం మాట్లాడుకున్నారు?**
- ■ హైదరాబాద్‌కి వచ్చింది మూడు నెలల క్రితం. మా పాప శ్రీమంతం అప్పుడు. ఆ తర్వాత ఒకసారి ముంబైకి ఏదో పని ఉండి వెళ్లాను. అప్పుడు లంచ్‌కి కలుసుకున్నాం. మేం ఎప్పుడు కలిసినా ఫ్యామిలీ గురించే మాట్లాడుకుంటాం. తనకి ఇంటీరియర్ అంటే చాలా ఇష్టం. తను ఇంటిని అద్దంలా పెట్టుకుంటుంది.

- **ఆమె మరణం తర్వాత మీడియా తీరు మీకెలా అనిపించింది?**
- ■ మీడియాకి మంచి స్టోరీస్ కంటే చెడ్డ స్టోరీలు చేయడం ఈమధ్య కాలంలో అలవాటైపోయింది. జనాలు కూడా వాటినే చూడడానికి ఇష్టపడుతున్నారు. అలా అని చనిపోయిన వ్యక్తి గురించి తప్పుడు కథనాలు సృష్టించడం సబబు కాదనిపించింది. నాకే ఇలా అనిపిస్తే.. వాళ్ల కుటుంబ పరిస్థితి ఎలా ఉండి ఉంటుందో ఆలోచించండి.

- **బోనీకపూర్ గారి మీద ఆరోపణలు వస్తున్నాయి కదా! అసలు వారి దాంపత్యం ఎలా ఉండేది?**
- ■ ఇద్దరూ ఒకరిని విడిచి ఒకరు ఉండరు. ఎక్కడికి వెళ్లినా జంటగా వెళ్లాల్సిందే! అంత అన్యోన్య దాంపత్యం అని చెప్పుకోవచ్చు. ఆయన మీద ఆరోపణలు చేయడం కరెక్ట్ కాదు. ఆయనతో కూడా ఫోన్ చేసి మాట్లాడా. చాలా బాధపడ్డారు.

- **పిల్లల పట్ల ఆమె చాలా కేరింగ్ ఉండేవారట. దాని గురించి మీ దగ్గరేమైనా సలహాలు తీసుకునేవారా?**
- ■ చాలా ప్రొటెక్టివ్‌గా ఉండేది. సౌత్ ఇండియన్స్‌కి పిల్లల పట్ల శ్రద్ధ ఎక్కువ. తను కూడా దీనికి అతీతురాలు కాదు. ఇక సలహాలు అంటారా? దాంతో తనకు అవసరం లేదు. పిల్లల కెరీర్ ఎలా ఉండాలి, ఎప్పుడు ఏం చేయాలన్న దాని మీద శ్రీదేవికి చాలా స్పష్టత ఉండేది.

- **కూతురి సినిమా గురించి ఏమైనా చర్చించేవారా?**
- ■ కచ్చితంగా. కాకపోతే సినిమా చూడలేకపోయింది. కానీ ఈమధ్యే రషెస్ చూసిందట. చాలా సంబురపడ్డది.

- **శ్రీదేవి అనగానే గుర్తొచ్చే మరిచిపోలేని సంఘటనలు?**
- ■ నవ్వుతూ.. వచ్చి గట్టిగా కౌగిలించుకునేది. దాంట్లోనే ఆమె ఆప్యాయత కనిపించేది. ఇప్పుడు ఆ ఆప్యాయతను మిస్ అవుతున్నా.

• శ్రీదేవి గారితో మీకున్న అనుబంధం?
■ మా గురించి చెప్పాలంటే.. మేం మంచి ఫ్యామిలీ ఫ్రెండ్స్. తనకి పెళ్లయ్యాక మా మధ్య స్నేహం మరింత బలపడిందని చెప్పొచ్చు. పదిహేనేళ్లలో మేం చాలాసార్లు కలుసుకున్నాం. తను నాకు స్పెషల్. ఒక సిస్టర్‌లా భావిస్తాను. ప్రతీ విషయాన్ని పంచుకునేవాళ్లం. నేను ఎలా చెప్పేదాన్నో, తాను కూడా అలా నా దగ్గర అలాగే మాట్లాడేది. మా మధ్యలో మంచి అనుబంధం ఉందనే చెప్పొచ్చు. మా వల్ల మా ఇద్దరి భర్తలు కూడా మంచి ఫ్రెండ్సయ్యారు. ఏవైనా పార్టీలు ఉంటే మాకు కచ్చితంగా పిలుపు వచ్చేది.

• ఆవిడ సన్నిహితులతో చాలా బాగా ఉండేవారని తెలిసింది. మీతో ఎలా ఉండేవారు?
■ తను అందరితో తొందరగా కలిసిపోయే రకం కాదు. కానీ ఒకసారి వాళ్లతో స్నేహం చేస్తే మాత్రం ప్రాణంగా ఉండేది. మా మధ్య రిలేషన్ కూడా అలాగే ఉండేది. తాను లేకుండా ఇంట్లో ఏ ఫంక్షన్ జరుగనంతా క్లోజ్ అయిపోయింది.

• మీ ఇద్దరికీ నచ్చే కామన్ పాయింట్ ఏమైనా ఉందా?
■ ఇంతకుముందు చెప్పా కదా.. ఫ్యామిలీ, పిల్లలు అంటే ఇష్టం.

సౌమ్య నాగపురి

సోలార్ ఇడ్లీలు!

ఏంటీ హెడ్డింగ్ చూసి ఖంగు తిన్నారా? ఇంతకీ ఈ సోలార్ ఇడ్లీలు తినొచ్చా? లేదా? అని ఆలోచిస్తున్నారా? శుభ్రంగా తినొచ్చు. కేరళ లో ఓ ఎన్జీవో వినూత్న ఐడియానే ఈ సోలార్ ఇడ్లీలు.



ఇప్పుడు ఇండియాలోని రాష్ట్రాలన్నీ సోలార్ విద్యుత్‌ని ఎలా వినియోగించుకోవాలా అని వినూత్నంగా ఆలోచిస్తున్నాయి. ఆ ఆలోచనల్లోంచి పుట్టిందే ఈ ఐడియా. కేరళకు చెందిన ఏజెన్సీ ఫర్ నాన్ కన్వెన్షనల్ ఎనర్జీ అండ్ రూరల్ టెక్నాలజీ (ఏఎన్ఈఆర్‌టీ) వారి ఆలోచనల ఆవిష్కరణయే ఈ సోలార్ ఇడ్లీలు. ఇంతకీ ఈ ఇడ్లీలు ఎలా తయారుచేశారో తెలుసా..! ఇడ్లీలు ఉడకడానికి కావ్సలిన వేడి, విద్యుత్‌ను సోలార్ ప్లేట్ల నుంచి తీసుకున్నారు. అక్కడి నుంచి వచ్చే శక్తితో వీరు ప్రత్యేకంగా తయారుచేసిన పరికరాల ద్వారా ఇడ్లీలు తయారుచేశారు. కేవలం ఇడ్లీపాత్ర మాత్రమే కాదు.. ఎన్నో సోలార్ పరికరాలను తయారుచేసి సౌరశక్తిని ఎలా ఉపయోగించుకోవాలో అందరికీ నేర్పిస్తున్నారు. గత వారం తిరువనంతపురంలో 'అక్షయ్ ఉర్జ ఉత్సవ్' పేరుతో ఒక సదస్సు నిర్వహించారు. ఆ సదస్సులో వీరు సృష్టించిన సోలార్ పరికరాలు, ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ ఏజెన్సీలు, వివిధ మతాలవారు ప్రార్థనలు చేసుకునే ప్రదేశాలు, విద్యాసంస్థలు, వైద్యశాలలు, ప్రైవేటు కంపెనీలు ఇలా అన్నీ ప్రదేశాల్లో సోలార్ పరికరాలు, సోలార్ విద్యుత్ వాడడం వల్ల ఎంత మేలు జరుగుతుందో చెప్తున్నారు. ఇప్పటికే తిరుపతి, మౌంట్ అబు, షిరిడీ లాంటి ఆధ్యాత్మిక ప్రదేశాల్లో మెగా స్కేల్ సోలార్ స్టీమ్ కుకింగ్ సిస్టమ్ అమర్చి ఎంతోమంది పర్యాటకుల ఆకలి తీరుస్తున్నారు. ఈ టెక్నాలజీ దేశవ్యాప్తంగా అమలైతే కొన్ని కోట్ల మంది ప్రజలకు మేలు జరుగుతుంది. కాకపోతే వీరు చిన్న చిన్న ఉపయోగాల కోసం తయారుచేసిన కొన్ని సోలార్ పరికరాలు సంబంధిత శాఖ అనుమతి పొందాల్సి ఉంది.

షుగర్‌కు చెక్!

ఎండాకాలంలో ఉల్లిపాయ ఎక్కువగా తింటే చలువ చేస్తుందని పెద్దలు చెప్పడం మనం వినే ఉంటాం. ఉల్లిచేసే మేలు తల్లి కూడా చేయదంటారు అందుకే. వేసవి కాలం వచ్చేసింది. ఈ సీజన్‌లో ఉల్లి ఎక్కువగా తింటే వచ్చే లాభాలేంటి? ఉల్లిపాయ ఎలాంటి రోగాలకు చెక్ పెడుతుంది?

- షుగర్ వ్యాధిని కంట్రోల్ చేయడంలో ఉల్లి పాత్ర ఘననీయమైనది.
- రోజుకు యాభై గ్రాముల పచ్చి ఉల్లిపాయ తింటే ఆరోగ్యానికి అనేక రకాల లాభాలున్నాయి.
- షుగర్ వ్యాధితో బాధపడేవారు నిత్యం ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకుంటూ ఉంటారు. ఆ ఇంజెక్షన్‌కి బదులు రోజుకు యాభై గ్రామలు పచ్చి ఉల్లిపాయ తింటే మంచి ఫలితం ఉంటుంది. యాభై గ్రాములు పచ్చి ఉల్లిపాయ 20 యూనిట్ల ఇన్సులిన్‌తో సమానం.
- ఉల్లికాడలను తరచుగా తింటుంటే రక్తపోటు లాంటి వ్యాధులు తగ్గుముఖం పడుతాయి.
- ఉల్లికాడల్లో ఉండే కెమోఫెరాల్ అనే ఫ్లేవనాయిడ్ రక్తనాళాలపై పడే ఒత్తిడిని తగ్గిస్తుంది.
- తెల్ల ఉల్లిపాయలను నీళ్లలో మరిగించి ఆ నీళ్లు తాగితే మూత్రంలో మంట తగ్గుతుంది.



తిరిగి ఇచ్చేద్దాం!

'సమాజం నుంచి ఎంతో తీసుకుంటున్నాం. తిరిగి సమాజానికి ఎంతో కొంత ఇచ్చేద్దాం' అన్న కాన్సెప్ట్‌తో తెలుగులో శ్రీమంతుడు సినిమా వచ్చింది. ప్రజల ఆదరణ కూడా పొందింది. అయితే 2010లోనే ఆ కాన్సెప్ట్‌తో ఓ ఫౌండేషన్ ఏర్పాటు చేసి సమాజం పట్ల అందరికీ అవగాహన కల్పిస్తున్నది మీరా.



మీరా హాంకాంగ్‌లో ఉండేది. సమాజంలో ఉన్నోళ్లుంటారు.. లేనోళ్లుంటారు. అన్నీ ఉన్నవారు ఏమీ లేని వారికి ఏదో ఒక రకంగా సాయం చేస్తే కనీసం వారి అవసరాలు అయినా తీరుతాయనేది మీరా ఆలోచన. 2009వ సంవత్సరంలో హాంకాంగ్‌లో బిజినెస్ స్కూల్ చదువుతుండేది. ఆ సమయంలో జాన్ మోరాన్ అనే ఫ్రెండ్‌ను కలిసి తన ఆలోచన గురించి చెప్పింది. 'సమాజం నుంచి ఎంతో తీసుకుంటున్నాం. తిరిగి సమాజానికి ఏమీ ఇవ్వలేమా? ఎంతో కొంత ఇవ్వాలనేది నా ఉద్దేశం' అని వివరించింది. కొన్ని స్వచ్ఛంద సంస్థలను.. సోషల్ యాక్టివిస్ట్‌ను కలిసి సమాజసేవ అంశం పట్ల అధ్యయనం చేసింది. 2010లో గివింగ్ బ్యాక్ ఫౌండేషన్ ఏర్పాటు చేసింది. పర్యావరణం నుంచి స్వచ్ఛమైన వాయువుల్ని.. సువాసల్ని తీసుకుంటాం. కానీ అదే పర్యావరణం పాడయ్యేలా చేస్తాం. అలా కాకుండా పర్యావరణం మనకు ఇస్తున్నట్టుగా మనమూ పరిమళాల్ని ఇవ్వలేమా? మన ప్రతీ పని చేయడానికి పేదలు అవసరమవుతారు. అలాంటి పేదల కోసం ఏదైనా చేయలేమా? అని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నది. న్యూయార్క్ కేంద్రంగా నడుస్తున్న ఈ ఫౌండేషన్ ఇండియాలో కూడా తన సేవలను అందిస్తున్నది. ముంబై కేంద్రంగా ఇండియాలో గివింగ్ బ్యాక్ ఫౌండేషన్ సేవలను అందిస్తున్నది మీరా!

నమస్తే తెలంగాణ
సింగిడి
[హైదరాబాద్]
ఆదివారం 4 మార్చి 2018

చాక్లెట్ డ్రెస్ అందాలు!



ఫ్యాషన్ రంగానికి క్రియేటివిటీయే మూలం. అప్‌డేట్‌గా ఉంటూ కొత్త కొత్త ఫ్యాషన్ డిజైన్స్‌ను తీసుకొస్తుంటారు డిజైనర్లు. వాటిని అందరికీ తెలిసేలా ఫ్యాషన్ షోస్‌లో ప్రదర్శిస్తుంటారు. ఒకవేళ షో హిట్టయితే ఆ ఫ్యాషన్ ట్రెండ్‌గా మారుతుంది.

స్వప్న సుందరి అంటారు కదా.. అలాంటి క్రియేటివిటీ తాజాగా బెల్జియమ్‌లో చేశారు. 15 దేశాలకు చెందిన 130 మంది మహిళా ఫ్యాషన్ డిజైనర్లు పాల్గొన్న ఈ ఫ్యాషన్ షోలో ఎవరి టాలెంట్‌కు వారు అందాలద్ది ప్రదర్శించారు. అయితే ఇక్కడకు వచ్చిన అందర్నీ ఫిదా చేసి శభాష్ అనిపించుకున్నది మాత్రం చాక్లెట్ డిజైన్డ్ డ్రెస్. మూడ్రోజుల పాటు జరిగిన ఈ షోలో ఒక డిజైనర్ సాలాన్ డు చాకోలెట్‌తో అలరించింది. చాక్లెట్ క్రీమ్‌తో డిజైన్ చేసిన గౌన్‌ను ఆమె ధరించింది. దానిపై ఫ్యాషన్ కోటింగ్ వేశారు. ర్యాంప్‌పై ఆమె నడుచుకుంటూ వస్తుంటే.. చూసేవాళ్లు స్వప్న సుందరి అంటే ఇలాగే ఉంటుందేమో అని ప్రశంసించారు. మొత్తానికి రొటీన్‌కు భిన్నంగా చాక్లెట్ డ్రెస్‌తో అందాలు ఆరబోయడంతో ఒక కొత్త ట్రెండ్ సెట్ చేసిందని ఫ్యాషన్ ప్రియులు పేర్కొన్నారు!

నాకిష్టమైన పాటలు..



నెక్ట్స్ ఏంటి	: నేను లోకల్
మిరా మిరా మీసం	: కాటమరాయుడు
సాహోరే బాహుబలి	: బాహుబలి
హంసరో	: చెలియా
బాక్స్ బద్దలైపోయి	: డీజే
అడిగా అడిగా	: నిన్ను కోరి
వచ్చిండే	: ఫిదా
జోగేంద్ర జోగేంద్ర	: నేనే రాజు నేనే మంత్రి
మధురమే	: అర్జున్‌రెడ్డి
రావణా	: జై లవ కుశ
చెలియా చెలియా	: ఇడియట్

తోటకూరి నర్సింహులు, సైదాపురం, యాదాద్రి భువనగిరి

మీకు నచ్చిన పాటలు కూడా పంపొచ్చు. ప్రచురిస్తాం.
ఈమెయిల్ : zindagi.nt@gmail.com
మా అడ్రస్ : నమస్తే తెలంగాణ ప్రధాన కార్యాలయం,
8-2-603/1/7,8,9 కృష్ణాపురం, రోడ్‌నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034



వెరీ గుడ్డు కళ!









శిలను శిల్పంగా చెక్కడం చూశాం.. భారీ ఆకృతులను సూక్ష్మంగా మలచడం చూశాం.. చెక్కలపై కళాకృతులను దిద్దడం చూశాం.. కానీ గుడ్డులో గుండెకు హత్తుకునే ఆకృతులు చూశామా? చాలా తక్కువమందే చూసి ఉంటారు. ఈ కళ కూడా చాలా అరుదు! దాన్నే ఎగ్ కార్వింగ్ అంటారు. సూక్ష్మకళ కు సరికొత్త హంగులద్దుతూ ప్రపంచ రికార్డులు సృష్టిస్తున్న ఎగ్‌కార్వింగ్ కళ గురించి తెలుసుకుందాం!

ఎగ్‌కార్వింగ్‌లో ఎదుగుతూ కళాజీవనంలో ఒదిగిన సూక్ష్మకళాకారుడు కొండపర్తి కృష్ణమాచారి. ఒక కళ వ్యక్తిని ఎక్కడికి తీసుకెళ్తుంది? ఎలాంటి అద్భుతాలు సృష్టింపజేస్తుంది? ఎలా ఎదిగేట్లు చేస్తుందో కృష్ణమాచారిని చూస్తే తెలుస్తుంది.

పది వరకే చదువు: కృష్ణమాచారి ఎగ్‌కార్వింగ్‌ను ఒత్తిడిని అధిగమించేందుకే ఎంచుకున్నాడు. ప్రవృత్తిగా దీనిని మార్చుకున్నాడు. దేవుని బొమ్మలతో ప్రారంభమైన అతని కరవాలం ఎగ్ కార్వింగ్‌తో దేశవ్యాప్తంగా కీర్తిప్రతిష్టలు పొందాడు. తన కళను పదిమందికి నేర్పడంతో పాటు ప్రదర్శనలిస్తూ సూక్ష్మ కళారంగాన్ని ప్రోత్సహిస్తున్నాడు. ఉంగరాల కృష్ణగా పేరు పొందిన కొండపర్తి కృష్ణమూర్తి మిర్యాలగూడ పట్టణానికి చెందినవాడు. కొండిపర్తి అనంతాచారి వరలక్ష్మి దంపతులకు జన్మించిన నాల్గవ సంతానం కృష్ణమూర్తి చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో అమ్మ రెక్కల కష్టంతోనే చదువుకున్నారు. అమ్మ కిరాణం షాపు నడుపుతూ కుటుంబాన్ని నడుపుతుండటంతో బతుకు బండి కష్టం కావడం వల్ల కృష్ణమూర్తి చదువు పది వరకే సాగింది. సొల్లేటి నర్సింహాచారి వద్ద స్వర్ణకార వృత్తిని నేర్చుకున్నాడు. ఉంగరాలు తయారు చేయడంలోపేరు రావడంతో ఉంగరాల కృష్ణగా ఇంటి పేరు మారింది.

ఒత్తిడిని అధిగమించేందుకు: చిన్నతనం నుండే కళలపై ఆసక్తి ఉన్న కృష్ణమూర్తికి చిన్నచిన్న బొమ్మలు వేయడంతో తన పని ఒత్తిడిని తగ్గించుకునే వాడు. ఈ క్రమంలోనే తన ఆలోచనలకు మరింత పదును పెట్టి పెన్సిల్ లిడ్‌పై బొమ్మలు చెక్కడం ఆ తర్వాత సబ్బులపై కార్వింగ్ (చెక్కడం) వంటివి చేయడం ప్రారంభించాడు. ఆ తర్వాత చెక్క బీడింగ్‌నే సూక్ష్మ కళారూపాలుగా మలుస్తూ గాజు వస్తువులపై బొమ్మలు వేయడం ప్రారంభించాడు. పేపర్ కటింగ్ బొమ్మలు, ఆకులపై దేవుని ప్రతిమలు చేస్తూ ప్రశంసలు అందుకున్నాడు.

350 గుడ్లపై సూక్ష్మ కళ : 2017లో గుడ్ల పెంకులపై సూక్ష్మ కళారూపాలను చెక్కడం ప్రారంభించిన కృష్ణ ప్రస్తుతం 350 గుడ్లపై పలు అద్భుతాలను ఆవిష్కరించాడు. ఇందులో తెలంగాణ ప్రభుత్వ పథకాలు, పలు జాతీయ నాయకుల ప్రతిమలు, సమాజానికి ఉపయోగపడే ఎన్నో సందేశాత్మక దృశ్యాలతో పాటు ఆడపిల్ల పుట్టుక నుంచి వృద్ధాప్యం వరకు జరిగే వివిధ దశల సూక్ష్మ బొమ్మలను అద్భుతంగా ఆవిష్కరించాడు. మహాత్మగాంధీ నుంచి మొదలుకుని అబ్దుల్‌కలామ్ వరకు ముఖ్యమైన జాతీయ నాయకులుతో పాటు ఒక్కొక్క గుడ్డుపెంకపై ఒక్కొక్క కళా చరిత్రను అర్థమయ్యేలా వివరించాడు. సమ్మక్క, సారక్క జాతర సారాంశం, సంక్రాంతితో పాటు ప్రపంచ, దేశ, తెలంగాణ రాష్ట్ర చిత్ర పటాలను వాటిపై వేశాడు.

ఆకులపై అద్భుతాలు: జీవవైవిధ్యం ఉట్టిపడేలా పలు సందేశాత్మక ఎగ్‌కార్వింగ్‌లో తనదైన ముద్ర వేసుకున్న కృష్ణ పేపర్, ఆకులపై జీవం ఉట్టిపడేలా సూక్ష్మ బొమ్మలు వేస్తూ అబ్బురపరుస్తున్నాడు. ఆకులపై లక్ష్మీదేవి ప్రతిమ చూడటానికి ముచ్చట వేయడంతో పాటు ఆ చిత్రం వెనుకపడే నీడలో గణేషుని ప్రతిమ కనపడటం ఔరా అనిపిస్తుంది. అదేవిధంగా పేపర్‌పై అతి సూక్ష్మ శివాజి, గాంధీజీ, అంబేద్కర్ వంటి చిత్రాలు బూతద్దంలో చూస్తే గాని గుర్తుపట్టలేం. ఇప్పటి వరకు పేపర్ పై 15, 10 ఆకులపై దేవుని ప్రతిమలు సృష్టించాడు.

పలుచని ఫినిషింగ్ : పెన్సిల్, చాక్‌పీస్‌లపై అశోకచక్రం, లాకెట్, దేవుని బొమ్మలతో పాటు రకరకాల డిజైన్లను వేసి శబాష్ అనిపించుకున్నాడు. సూక్ష్మ బొమ్మలు వేసేటప్పుడు ఎంతో జాగ్రత్త వహించే కృష్ణ అత్యంత పలుచని ఫినిషింగ్ ఇస్తూ ప్రతి చిత్రాన్ని తనకు తానే సాటి అన్న రీతిలో తీర్చిదిద్దడం అతనికే చెల్లింది. ఉడ్‌పై అతను తీర్చిదిద్దిన గొలుసు చూపరుల మనసు ఇట్టే లాగేస్తుంది. అదేవిధంగా సబ్బులు, కొవ్వొత్తులు వంటి వాటిపై సైతం అతడు వేసిన బొమ్మలు చూస్తే కళ్ళను తిప్పుకోలేం. ఇప్పటి వరకు పెన్సిల్‌పై 20, చాక్‌పీస్‌లపై 40, సబ్బులపై 10, గాజు వస్తువులపై 12 సూక్ష్మ బొమ్మలను చెక్కాడు.

ఆస్ట్రిచ్ గుడ్లపై అద్భుతాలు: ఇప్పటి వరకు ఎగ్ కార్వింగ్‌పై ప్రతిభను చాటిన కృష్ణమాచారి తాజాగా ఆస్ట్రిచ్ పక్షి గుడ్ల పెంకుల మీద అద్భుతాలు సృష్టించేందుకు శ్రీకారం చుట్టాడు. ఒక ఆస్ట్రిచ్ పక్షి గుడ్డు ధర రూ.1600 అయినప్పటికీ ఖర్చుకి వెనుకాడకుండా తన కళాత్మక హృదయాన్ని చాటుకుంటూ పది గుడ్లను హైదరాబాద్ నుంచి కొనుగోలు చేశాడు. వాటిపై తెలంగాణకు సంబంధించిన పలు సామాజిక దృశ్యాలతో పాటు ప్రభుత్వ పథకాలను ఆవిష్కరించి సీఎం కేసీఆర్‌ను కలిసి తన సూక్ష్మ కళను తెలిపేందుకు ప్రయత్నిస్తున్నాడు మన కృష్ణమాచారి.



అదే నా లక్ష్యం:
గిన్నీస్ బుక్‌లో స్థానం సంపాదించడమే నా ప్రధాన లక్ష్యం. ప్రతి పిల్లవాడికి కళల పట్ల అవగాహనను పెంపొందించి వారిలో సృజనాత్మకతను కల్గించాలి. అందు కోసం నేను పలు పాఠశాలలో తన ప్రదర్శనలను ఏర్పాటు చేసి విద్యార్థులకు కళాభిరుచిని అందిస్తున్న. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక కళ ఉంటుంది. దానిని వెలికితీసి మెరుగులు దిద్దుకుంటే అద్భుతాలు సృష్టించడం కష్టం కాదు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే పాఠశాలలో ప్రదర్శనలను ఏర్పాటు చేస్తాను.
కొండేటి కృష్ణమాచారి

ఇండియా బుక్ఆఫ్ రికార్డు
కళ తనతోనే కాకుండా పదిమందికి పంచాలనే ఆలోచన ఉన్న కృష్ణమాచారిని దేశం దాటి వియత్నాం ఇండియా బుక్ఆఫ్ రికార్డు గుర్తించి 2018లో కృష్ణమాచారిని సత్కరించింది. అదేవిధంగా ఆసిస్ట్ వరల్డ్ రికార్డ్ రీసెర్చ్ ఫౌండేషన్ పాండిచ్చేరి వారు 2018లో అవార్డుని అందించారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, మిర్యాలగూడెం ఎమ్మెల్యే భాస్కర్‌రావుతో పాటు డిఎస్పీ శ్రీనివాస్ కృష్ణమాచారి ప్రతిభను అభినందించారు

చెన్నూరి రవికుమార్
మిర్యాలగూడ టౌన్, నమస్తే తెలంగాణ

క్లాసిక్ మూవీ

ఏకాంత జీవితం

ఈ సినిమా చూస్తుంటే మనసు చల్లబడుతుంది. మనతో మనం ఉండడం అంటే ఏమిటో.. దానివల్ల ఒనగూరేదేమిటో తెలుస్తుంది. ఆకాశంలో నునుపు, గాలిలో మృధుత్వం, నీళ్లలోని చల్లదనం ఇవన్నీ మళ్లీ ఎరుకలోకొస్తాయి. మన జీవితాల్లో కరువైన ప్రశాంతత మన కళ్లముందుంటుంది. ఉర్స్‌జులా ఆంటోనియక్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకు పలు అవార్డు వచ్చాయి.



ఏకాంతం కావాలి. నీకు, నాకూ అందరికీ. ఏదో ఒకరోజు. ఈ ప్రపంచాన్ని.. జనాన్ని వాళ్ల పోకడనీ చూసి విసిగెత్తినప్పుడో, ప్రియమైన వాళ్లని కోల్పోయి ప్రపంచం మీద విముఖత ఏర్పడ్డప్పుడో, ఒకానొక దశలో జీవితం ఇదికాదు అని అనిపించిన వాళ్లో.. లేదా ముందు నుంచీ తమతో తాము ఉండడం ఇష్టమున్న వాళ్లో.. వాళ్లకి ఏకాంతం కావాలి.. ఏకాంతవాసాన్ని కోరుకుంటారు వాళ్లు. ప్రపంచానికి అతీతంగా ప్రకృతి ఒడిలో తమతో తాము ఉండాలనుకుంటారు. తమలోని ఆనందాన్ని భావాలనీ, భావోద్వేగాలనీ అన్వేషించాలనుకుంటారు. తమకీ ప్రకృతికీ ఒక అనుబంధాన్ని ఏర్పర్చుకుంటారు. ప్రకృతి రహస్యాలని వింటారు. పరికిస్తారు. ఆనందిస్తారు. వాళ్లు శాంతంగా ఉంటారు. కాలువగట్టున కూర్చొని ఉదయిస్తున్న సూర్యుణ్ని నిద్రలేస్తున్న ప్రకృతినీ ఆస్వాదిస్తారు. నీటి వలయాల్లో విశ్వ రహస్యాలని శోధిస్తారు. ఎగిరే పక్షి స్వేచ్ఛ తమదిగా చేసుకుంటారు. విచ్చుకున్న పువ్వులోని నవ్వు వాళ్ల మొహంలో కనిపిస్తుంది. కిటికీలోంచి పాకే మెత్తని కాంతి వాళ్లకి సుప్రభాత గీతమవుతుంది. మిట్ట మధ్యాహ్నపు ఎండలో చెట్టునీడన వాళ్లకి దేవరాగాలు వినిపిస్తాయి. నడిరేయి నక్షత్రాలతో ముచ్చటిస్తారు. వాళ్లకి ఎదుటివ్యక్తులు తమ జీవితాల్లోకి చొరబడడం ఇష్టముండదు. అనవసరపు హైప్, పొగడ్తలు అక్కర్లేదు. వాళ్లు వ్యక్తులతో నిదానంగా కలుస్తారు. ఒకరిద్దరు నచ్చిన వ్యక్తులతో మాత్రం స్నేహం చేయగలుగుతారు. నిలకడగా, నింపాదిగా జీవితం అందించే ఆనందాలనీ, బాధలనీ అందుకుంటారు.

ఒకమ్మాయి కిటికీ పక్కన ఉంటుంది. ఇళ్లంతా ఖాళీ. తన వస్తువులన్నీ రోడ్డుమీద పడేసింది. వాటిని జనాలు ఏరుకుంటూ ఉన్నారు. వేలికి ఉన్న ఉంగరం తీసి పక్కనపెట్టింది. కాసేపు ఆ ఖాళీ ఇంటిలో కూర్చుని ఉంది. ఒక చిన్న గుడారం, కొన్ని బట్టలతో బయల్దేరింది. ఎవరిదో కారులో చోటడిగి ఏదో ఊర్లో దిగింది. తనకే తెలియని చోటికి ప్రయాణిస్తున్నది మనుషులకు దూరంగా. పగలంతా ప్రయాణం. సాయంత్రం ఎక్కడో సుమద్రపు ఒడ్డున రాళ్లతో గుడారం వేసుకొని నిద్ర. సముద్ర ఘోష భయానకంగా ఉన్నది. ఆమె చెవుల్లో చేరి భీతి కలిగిస్తున్నది. ఆ భాషను అర్థం చేసుకొనే ప్రయత్నం చేసింది. చిన్న చిన్న జలపాతాల్లో మంచినీరు పట్టుకోవడం.. మైదానాల్లో .. గుట్టల్లో ఒంటరిగా రోడ్ల మీద నడక. ఎవరినీ నమ్మని స్వభావం ఆమెది. ఒక రకమైన కసి, కోపం, నిర్లక్ష్య ధోరణి ఆమెది.

పొద్దున్న లేస్తూనే పొట్ట చేతబట్టుకొని ఉరుకులు, పరుగులు.. అదే పనిగా పనిచేస్తూ నెలజీతానికి జీవితాన్ని తాకట్టు పెడుతూ.. బ్యాంక్ బ్యాలెన్సులూ.. తెచ్చిపెట్టుకొన్న నవ్వులు.. బలవంతపు బంధాలూ.. పిప్పిలోంచి ఆనందం పిండుకుందామనే ఆశలు కొందరివైతే, సకల సౌకర్యాలతో ఆకలి విలువ తెలియక.. వీలైనంత ఆహారాన్ని పొట్టలోకి కుక్కుతూ, జీవితంలో ఆనందం కోసం కుతిగా ఎగబడుతూ.. డబ్బే లోకంగా నకిలీ ఆనందాన్ని కొనుక్కుంటూ.. ప్రకృతి ప్రపంచాన్ని తమ కాళ్ల కింద శాసించాలనుకునే వ్యాపారవేత్తలూ.. ధనవంతులూ మరికొందరు. కానీ సరిగ్గా వీళ్లకి వ్యతిరేకంగా కొంతమందికి ఏకాంతం కావాలి.

మొత్తానికి ఒక చోటుకి చేరుకున్నది. గుడారం వేసుకొని చలికి వణుకుతూ కూర్చున్నది. ఎదురుగా మట్టి దిబ్బలు. దాని పైకెక్కి చూస్తే ఆ ప్రదేశం అద్భుతంగా తోచింది. నీళ్లలోకి పొడుచుకొచ్చిన భూభాగం.. అందులో ఒక ఇల్లు ఆమెను ఆకర్షించాయి. చాలా ప్రశాంతంగా.. సముద్రగాలులతో ఉందా ప్రదేశం. చుట్టూ సముద్రపు నీళ్లూ మైదానాలు.. గడ్డి గుట్టలు.. సముద్రం.. రాళ్లూ. మెల్లిగా ఆ ఇంటికి చేరుకున్నది. ఎవరూ లేరా ఇంట్లో ఆ సమయంలో. ఇళ్లంతా కలియ తిరిగింది. అన్నీ పొందికగా అమర్చి ఉన్నాయి ఇంట్లో. సంగీతం విన్నది. మంచం మీదా పడుకున్నది. దొర్లింది. ఒకసారి ఇళ్లు అనబడే స్వర్గాన్ని ఆస్వాదించింది. తిరిగి తన గుడారం చేరుకున్నది.

మరునాడు గుడారం విప్పుకొని ఆ ఇంటి ముందు కూర్చున్నది వేచి చూస్తూ.. ఆ ఇంట్లోనుంచి ఒక నడి వయస్కుడు బయటికొచ్చాడు. ఆమెని చూసాడు. పలుకరించాడు. బదులివ్వకుండా అతణ్ని తేరిపారా చూసింది. నీ పేరేంటి? అని అడిగాడు. నీపని చూసుకోవయ్యా అని నిర్లక్ష్యపు సమాధానం ఆమెది. తోటలో పనిచేస్తే తిండి పెడుతాను అన్నాడాయన. తిండికోసం పనిచేయడం మొదలు పెట్టింది. తినడానికి లోపలికి రమ్మంటే వెళ్లదు. మనిషిని నమ్మదు. తిన్నాక బయలుదేరింది. రోజూ పనిచేస్తే రోజూ తిండి పెడుతానన్నాడు. 'సరే కానీ నీవెవరు? ఎక్కణ్నుంచొచ్చావ్? అని అడుగొద్దుమరి' అని అన్నదామె. సరే అన్నాడతను. అలా పొద్దునంతా పని.. తిన్నాక గుడారం చేరుకోవడం. అలా అతనేంటో తెలిసిన కొద్దీ.. ఇంట్లోకి వెళ్లడం.. కలిసి తినడం.. పొడి మాటలూనూ. ఓ గది చూపించి అందులో ఉండొచ్చన్నాడతను. అప్పటికే అతని మీద నమ్మకం కుదిరిందామెకు. గదిలో చేరింది. ఇద్దరూ కలిసి పని చేయడం.. వండుకొని తినడం.. సంగీతం వినడం.. పుస్తకాలు చదువడం.. ప్రకృతి, అతని స్నేహంతో ఆమె సంతోషంగా ప్రశాంతంగా ఉన్నది. తాను కోరుకున్న ఏకాంతవాసం దొరికింది. అతనెవరలో తెలుసుకొనే ప్రయత్నం చేసిందామె. ఆమె ఎవరో తెలుసుకొనే ప్రయత్నం చేశాడతడు. ఒకరికొకరు ఏమీ కారు. ఏకాంతపు బతుకులు వాళ్లవి. ఇద్దరు మనుషులు, ఎవరికివారే కానీ ఒకరికొకరు.. బంధం లేదు.. సంబంధం అసలే లేదు. దానికి పేరు లేదు. కేవలం అనుభూతి తప్ప!!

చక్రధర్‌రావు బైరంపల్లి, సెల్: 9848519435

సుడోకు

డైలీ సుడోకు 144 సమాధానం

1	4	7	6	2	5	9	8	3
9	5	8	1	7	3	4	6	2
2	6	3	8	9	4	5	7	1
6	9	5	2	4	8	3	1	7
7	1	4	9	3	6	2	5	8
3	8	2	5	1	7	6	4	9
5	3	1	7	6	9	8	2	4
4	2	6	3	8	1	7	9	5
8	7	9	4	5	2	1	3	6

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -145

7	5	4	6	3	9	1	8	2
6	3	8	4	2	1	5	7	9
1	2	9	5	8	7	4	6	3
5	7	3	9	4	8	6	2	1
8	6	2	1	7	5	9	3	4
9	4	1	3	6	2	7	5	8
2	9	6	7	1	3	8	4	5
3	1	7	8	5	4	2	9	6
4	8	5	2	9	6	3	1	7

ట్వీట్



ఈ డ్రెస్‌లో అచ్చం బొమ్మలా ఉన్నాను.

పూజా హెగ్దే
@ hegdepooja



పూజా హెగ్దేను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
1,039,017

కామన్‌మ్యాన్ వాయిస్

బరితెగించిన మనుషులు ఎప్పుడు బాగుపడినట్టు పురాణాల్లో చెప్పలేదు. ఏ గోడల మీద రాయలేదు.
–Karthik Madiwala

కష్టం నీ ఆయుధం అయితే నీ విజయానికి నువ్వే కారణం అవ్వాలి. అలా అవ్వలేదంటే నీ కష్టానికి ఫలితం ఉండదు.
–Gunti Rajashekar

అధికారులు ఆఫీసులకు ఎంత లేటైనా రావొచ్చు. విద్యార్థులు మాత్రం పరీక్ష రాయడానికి నిమిషం లేటైనా నో ఎంట్రీ! ఏంటీ నిబంధన?
–Gottiparthi Upender Goud

వైరల్ వీడియో



కాలుడు.. కరికాలుడు. ఈ కరికాలుడి పూర్తి రౌడీయిజాన్ని ఎప్పుడూ చూడలేదు కదూ. ఇప్పుడు చూపిస్తాడంట. అప్పటి వరకు ఈ టీజర్ చూడండి.

Kaala (Telugu) – Official Teaser | Rajinikanth | Pa Ranjith | Dhanush | Santhosh Narayanan
Total views : 2,137,761+
Published on Mar 1, 2018



అంతర్జాతీయ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు జూ పార్క్‌ను సందర్శించారు. వారికి జూ అధికారులు వన్యప్రాణి సంరక్షణపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పులి మాస్కులు ధరించి సందడి చేశారు. వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడాలని నినాదాలు చేశారు.

షీటీమ్స్ అన్నిరాష్ట్రాలకు ఆదర్శం

- మహిళల భద్రతకు సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యం
- షీటీమ్స్ ఎక్స్‌పో ప్రారంభోత్సవంలో హోంమంత్రి నాయిని
- నేడు 2కే, 5కే, 10కే రన్: డీజీపీ మహేందర్‌రెడ్డి



పీపుల్స్‌ప్లాజాలో ఎక్స్‌పోను ప్రారంభించి స్టాళ్లను పరిశీలిస్తున్న హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి. చిత్రంలో డీజీపీ మహేందర్‌రెడ్డి, సినీనటి రాశీఖన్నా తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళలను వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు, వారు స్వేచ్ఛగా తిరిగేలా భరోసా ఇచ్చేందుకు పోలీస్‌శాఖ ఏర్పాటుచేసిన షీటీమ్స్ అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నదని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. మహిళల భద్రతకు సీఎం కే చంద్రశేఖర్‌రావు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, ఆయన ఆలోచనలతోనే షీటీమ్స్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. హైదరాబాద్ షీటీమ్స్ ఆధ్వర్యంలో శనివారం నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటుచేసిన ఉమెన్ అండ్ చైల్డ్ ఎక్స్‌పోను హోంమంత్రి ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో 200 షీటీమ్స్ పనిచేస్తున్నాయని తెలిపారు. నిరంతర పెట్రోలింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, టెక్నాలజీ వినియోగంతో తెలంగాణ పోలీస్‌శాఖ నేరాలను సమర్థవంతంగా అదుపుచేస్తున్నదని చెప్పారు. తెలంగాణ పోలీస్‌శాఖ పనితీరును ప్రధాని నరేంద్రమోదీ కూడా ప్రశంసించారని, మన గ్రేహౌండ్స్‌ను కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారని గుర్తుచేశారు. డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల భద్రత కోసం ఏర్పాటుచేసిన షీటీమ్స్‌పై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు అంతర్జాతీయమహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 6 గంటలకు పీపుల్స్‌ప్లాజా నుంచి 2కే, 5కే, 10కే రన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. షీటీమ్స్ విజయవంతంగా పనిచేయడంలో కీలకపాత్ర పోషిస్తున్న అడిషనల్ సీపీ హైదరాబాద్ క్రైమ్స్ స్వాతి లక్రాను డీజీపీ అభినందించారు. సినీనటి రాశీ ఖన్నా మాట్లాడుతూ తెలంగాణ పోలీసులు పూర్తి భరోసా ఇస్తున్నందున మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి వేధింపులపై ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీలు అంజనీకుమార్, గోవింద్‌సింగ్, రవిగుప్తా, హైదరాబాద్ సీపీ శ్రీనివాసరావు, సైబరాబాద్ సీపీ సందీప్‌శాండిల్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరికరాల ఉత్పత్తి పెంచాలి

పారిశ్రామికవేత్తలకు మంత్రి కేటీఆర్ పిలుపు

- మెదక్ జిల్లా ముప్పిరెడ్డిపల్లిలో డయాబెటోమిక్స్ ప్రారంభం
- ఉమ్మి ద్వారా షుగర్ లెవల్స్ నిర్ధారించే పరికరాల ఉత్పత్తి
- 15 రోజుల షుగర్ చరిత్రను కనుగొనే అవకాశం
- వైద్యరంగంలో విప్లవాత్మకమార్పులు తెస్తున్న సీఎం కేసీఆర్



డయాబెటోమిక్స్ పరిశ్రమలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్



పరిశ్రమ ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్



మెదక్ జిల్లా ముప్పిరెడ్డిపల్లిలో డయాబెటోమిక్స్ మెడికల్ పరిశ్రమను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, సంస్థ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, ఫౌండర్ అండ్ సీఈవో శ్రీనివాస నాగళ్ల తదితరులు

మెదక్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

వైద్యరంగంలో వాడే పరికరాలను తెలంగాణలో ఉత్పత్తి చేసేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకురావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన అతి తక్కువ ఖర్చుతో, ఉమ్మి ద్వారా.. షుగర్ లెవల్స్‌ను నిర్ధారించే పరికరాల తయారీ పరిశ్రమ (డయాబెటోమిక్స్)ను మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామికవాడలో ఆ సంస్థ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ పరిశ్రమను మూడెకరాల స్థలంలో నెలకొల్పారు. ఈ యూనిట్‌కు ఉమ్మి ద్వారా షుగర్ లెవల్‌ను నిర్ధారించే స్ట్రిప్‌లను ఏడాదికి కోటికి పైగా తయారుచేసే సామర్థ్యం ఉంటుంది. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. వైద్యరంగంలో వాడే పరికరాల్లో 70శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకొంటున్నట్టు చెప్పారు. వాటిని ఉత్పత్తి చేసే పరిశ్రమలను తెలంగాణలోనే స్థాపిస్తే.. ఇక్కడి పేదలకు తక్కువ ఖర్చుతోనే వైద్యం అందించవచ్చునని పేర్కొన్నారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్య, వైద్యం అందించేందుకు సీఎం కేసీఆర్ మునుపెన్నడూలేని రీతిలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నారని మంత్రి కేటీఆర్ చెప్పారు. తెలంగాణలో వైద్య పరికరాల ఉత్పత్తులను పెంచాలన్న ఉద్దేశంతో సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో 250 ఎకరాల్లో మెడికల్ డివైజెస్ పార్కును నెలకొల్పామని, 13 సంస్థలు ఇప్పటికే ముందుకొచ్చాయని తెలిపారు. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ముప్పిరెడ్డిపల్లిలో ప్రారంభిస్తున్న డయాబెటోమిక్స్ పరిశ్రమ అత్యాధునిక టెక్నాలజీతో కేవలం ఉమ్మిద్వారా షుగర్ లెవల్స్ తెలుసుకొనే పరికరాన్ని తయారుచేస్తుందని వివరించారు. దీనిద్వారా రక్తం ఇవ్వాల్సిన పనిలేకుండానే ఉమ్మిద్వారానే గడిచిన 15 రోజుల్లో వ్యక్తి శరీరంలోని షుగర్ లెవల్స్‌లో వచ్చిన మార్పులను గుర్తించవచ్చునని తెలిపారు. ఇది అద్భుత పరిజ్ఞానమన్నారు. ఈ పరికరం డాలర్ (సుమారు రూ.67) కంటే తక్కువ ధరకే లభిస్తుందని వెల్లడించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వైద్యరంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులతో ప్రజలకు ప్రభుత్వ దవాఖానలపై విశ్వాసం పెరుగుతున్నదన్నారు. గత ప్రభుత్వాలు ఎన్నికల మీద దృష్టిపెట్టి, రాజకీయాల కోసం కొన్ని పనులు చేసేవని.. కానీ నేడు సీఎం కేసీఆర్ పేద ప్రజలకు వైద్యం, విద్య అందించాలన్న దృఢ సంకల్పంతో ఆయా రంగాలను బలోపేతం చేస్తున్నారని వివరించారు. కేసీఆర్ కిట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ప్రభుత్వ దవాఖానల్లో నార్మల్ డెలివరీలు పెరిగాయని, మాతాశిశు మరణాలు తగ్గాయని వివరించారు. పేదలకు గాంధీ, నిమ్స్ దవాఖానల్లో ఉచితంగా కిడ్నీ, లివర్ ప్లాంటేషన్, గుండె శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వైద్యశాఖపై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, ఆ శాఖ మంత్రి లక్ష్మారెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నారన్నారు. త్వరలో గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా కంటి అద్దాలు అందించనున్నట్టు తెలిపారు. మూడు రకాల క్యాన్సర్ పరీక్షలను టాటా ట్రస్టు సహకారంతో నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వైద్యరంగంపై ప్రత్యేక చొరవ చూపుతున్నారని, డయాబెటోమిక్స్ పరిశ్రమను మంత్రి కేటీఆర్ ప్రారంభించడం సంతోషంగా ఉన్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్ నగేశ్, డయాబెటోమిక్స్ మెడికల్ లిమిటెడ్ చైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, ఫౌండర్ అండ్ సీఈవో శ్రీనివాస నాగళ్ల, కో ఫౌండర్ పాతూరి విష్ణుప్రియారావు, డైరెక్టర్‌లు బొబ్బ వెంకటాద్రి, సదాశివరావు, సీఈవో సుమీత్‌రాయ్, టీఎస్ఐఐసీ కార్యదర్శి నర్సింహారెడ్డి, డాక్టర్లు శ్రీనిధి, బిందు తదితరులు పాల్గొన్నారు.

రక్తం తీయకుండా.. ఉమ్మితోనే

అతి తక్కువ ఖర్చుతో షుగర్ పరీక్షను సులభంగా చేసుకొనే పరికరాలను డయాబెటోమిక్స్ మెడికల్ లిమిటెడ్‌లో తయారుచేశాం. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ముప్పిరెడ్డిపల్లిలో పరిశ్రమను ఏర్పాటుచేశాం. దీనిద్వారా మధుమేహంతో బాధపడుతున్న వారికి రక్తం సేకరించకుండానే కేవలం ఉమ్మిద్వారా షుగర్ పరీక్ష చేయవచ్చు. అదికూడా రక్త పరీక్ష కంటే మూడోవంతు తక్కువ ఖర్చుతో చేయొచ్చు. దీనికి ప్రభుత్వ సహాయం ఉండాలి.

– వరప్రసాద్‌రెడ్డి, డయాబెటోమిక్స్ చైర్మన్

తక్కువ ఖర్చుతో షుగర్ పరీక్ష

అందుబాటు ధరలో మధుమేహ పర్యవేక్షణ పరీక్షలను అందించడంలో మాకు ఇది సహాయపడుతుంది. అంతేకాకుండా సంబంధిత సమస్యలను తక్కువ ఖర్చుతో తగ్గించడం కూడా సాధ్యమవుతుంది. అంతర్జాతీయ సదుపాయాన్ని ఇక్కడ ఏర్పాటుచేయడంలో మాకు సహకరించిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. భారతదేశంలో మధుమేహంతో ఇబ్బందిపడుతున్న ఆరున్నరకోట్లకు పైగా ప్రజల అవసరాలను తీర్చడానికి డయాబెటోమిక్స్ కంపెనీ కట్టుబడి ఉంటుంది.

– శ్రీనివాస నాగళ్ల, ఫౌండర్ అండ్ సీఈవో




ప్లాస్టిక్ వ్యాపారుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ బొంతు రామ్మోహన్

10 తర్వాత ప్లాస్టిక్‌పై నిషేధం పక్కా

- 50 మైక్రాన్లకన్నా తక్కువ మందంగల ప్లాస్టిక్‌ను జీహెచ్ఎంసీకి అప్పగించండి
- ఉల్లంఘిస్తే దుకాణాలు, పరిశ్రమలు సీజ్
- నగర మేయర్ బొంతు రామ్మోహన్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఈ నెల 10వ తేదీ తర్వాత 50 మైక్రాన్లకన్నా తక్కువ మందంగల ప్లాస్టిక్‌ను ఉపయోగించరాదని మేయర్ బొంతు రామ్మోహన్ నగరవాసులకు విజ్ఞప్తిచేశారు. అలాగే తయారీదారులు, విక్రయదారులు 50 మైక్రాన్లకన్నా తక్కువ మందంగల ప్లాస్టిక్‌కు సంబంధించి వ్యాపార కార్యకలాపాలను నిలిపివేయాలని హెచ్చరించారు. లేనిపక్షంలో దుకాణాలు, పరిశ్రమలను సీజ్ చేయడంతోపాటు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. తయారీదారులు ఈనెల 18వ తేదీలోగా తమ పేర్లను స్థానిక డిప్యూటీ కమిషనర్లు, సహాయ వైద్యాధికారుల వద్ద తప్పనిసరిగా నమోదుచేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ తయారీదారులు, విక్రయదారులతో శనివారం జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి అధ్యక్షతన కేంద్ర కార్యాలయంలో ఓ ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 50 మైక్రాన్లకన్నా తక్కువ మందంగల ప్లాస్టిక్‌పై ఉన్న నిషేధాన్ని పకడ్బందీగా అమలుచేస్తామని స్పష్టంచేశారు. తయారీదారులు, విక్రయదారులకు ఇప్పటికే చాలా గడువు ఇచ్చామని, ఇకమీదట చర్యలు తప్పవన్నారు. ఇప్పటివరకూ తమవద్దగల 50 మైక్రాన్లకన్నా తక్కువ మందం ప్లాస్టిక్‌ను ఈనెల 10వ తేదీలోగా జీహెచ్ఎంసీకి అప్పగించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. నగరంలో సుమారు 800 వరకు ప్లాస్టిక్ తయారీ యూనిట్లు ఉన్నప్పటికీ ఇప్పటివరకు కేవలం పదిశాతం మాత్రమే జీహెచ్ఎంసీలో పేర్లు నమోదుచేసుకున్నట్టు చెప్పారు. 30 మంది పర్యావరణ ఇంజినీర్లతోపాటు 300 మంది ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందిని రంగంలోకి దింపుతున్నామని, వీరు ప్రత్యేకంగా దాడులు నిర్వహించి చట్టాన్ని ఉల్లంఘించేవారి భరతం పడుతారన్నారు. కమిషనర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ దుకాణదారులు, తయారీదారులు తమ వ్యాపార యూనిట్లముందు తడి, పొడి చెత్తను వేసేందుకు రెండు చెత్తబుట్టలను ఏర్పాటుచేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటున్న మొదటి కార్పొరేషన్ జీహెచ్ఎంసీ అని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల మృతి



వైష్ణవి, లోకేశ్(ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం కవాడిపల్లికి చెందిన బుర్ర లోకేశ్(20) విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో బీ ఫార్మసీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. వనస్థలిపురానికి చెందిన పిల్లి వైష్ణవి(20) ఇదే కళాశాలలో సీఎస్ఈ తృతీయ సంవత్సరం చదువుతున్నది. కళాశాలలో జరుగుతున్న విజ్ఞాన్ తరంగ్ ఫెస్టుకు అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి బైక్‌పై వెళ్తున్న లోకేశ్‌ను వైష్ణవి మధ్యలో లిఫ్టు అడిగింది. ఇద్దరూ దేశ్‌ముఖిలోని కళాశాలకు వెళ్తుండగా కవాడిపల్లి వద్ద లారీని ఓవటేక్ చేసే క్రమంలో మరో వాహనం ఎదురుగా రావడంతో వీరు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. ఇద్దరి తలలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో ఎంతో అట్టహాసంగా ప్రారంభమైన విజ్ఞాన్ ఫెస్టును ఇద్దరు విద్యార్థుల మృతితో నిలిపివేశారు.

అపారెల్ పార్కుకు పూర్వవైభవం

- గుండ్లపోచంపల్లిలో పూర్తిస్థాయి మౌలిక వసతులు
- శిక్షణా కేంద్రం ఏర్పాటుతో ప్రత్యేక గుర్తింపు
- టెక్స్‌టైల్ కార్యకలాపాలకు దూరంగా ఉన్న యూనిట్ల లీజు రద్దు
- స్థానికుల ఉపాధికి పెద్దపీట: సమీక్షలో మంత్రి కేటీఆర్



అపారెల్ పార్కు సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీఎస్ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి, చేనేత, వస్త్రపరిశ్రమ డైరెక్టర్ శైలజారామయ్యర్

మేడ్చల్ రూరల్: అపారెల్ పార్కుకు పూర్వవైభవం తీసుకువస్తామని, మౌలిక వసతులు, శిక్షణా కేంద్రం ఏర్పాటుతో ప్రత్యేక గుర్తింపునకు కృషి చేస్తామని పురపాలక, ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. మేడ్చల్ మండలం గుండ్లపోచంపల్లి పరిధిలో ఉన్న అపారెల్ పార్కులోని యూనిట్ల పనితీరు, ఉపాధి కల్పన, విస్తరణకు ఉన్న అవకాశాలపై శనివారం టీఎస్ఐఐసీ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ శివారులో ఉన్న అపారెల్ పార్కు అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. కానీ కొంత టెక్స్‌టైల్‌కు విరుద్ధమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. గోదాంల నిర్వహణ, వివిధ రకాల కార్యకలాపాలతో పార్కు ఏర్పాటు లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దాదాపు 20 వేల మందికి ప్రత్యక్షంగా, మరెంతో మందికి పరోక్షంగా ఉపాధి కల్పించగలిగే పార్కులో కేవలం 3 వేల మంది మాత్రమే ఉపాధి పొందడం బాధాకరమన్నారు. పార్కులోని అన్ని యూనిట్లను తనిఖీ చేసి, ఒక్కో యూనిట్ ఎంత మందికి ఉపాధి కల్పిస్తుంది? ఈఎస్ఐ, పీఎఫ్ ఎంత మందికి అమలు చేస్తున్నారు? పెట్టుబడి తదితర విషయాలను వారంలో నివేదించాలన్నారు. ప్రతి యూనిట్‌కు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. టెక్స్‌టైల్‌కు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహించే యూనిట్ల లీజును రద్దు చేయాలని ఆదేశించారు. మరోసారి నిర్వహించే సమీక్షకు కార్మికశాఖ అధికారులను ఆహ్వానించాలని ఆదేశించారు. ఈ పార్కులో యూని ట్ల ఏర్పాటుకు ఎన్నో కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని, వాటికి పారదర్శకంగా ప్లాట్లను కేటాయించాలన్నారు.

మహిళలకు ఉపాధి కల్పించాలి

జూబ్లీహిల్స్ పేరు చెప్పగానే సినిమాలు, సిరిసిల్ల పేరు చెప్పగానే చేనేత పరిశ్రమ గుర్తుకు వచ్చినట్టు, గుండ్లపోచంపల్లి పేరు చెప్పగానే ఫ్యాషన్ సిటీగా గుర్తుకు వచ్చే స్థాయికి తీర్చిదిద్దాలని మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించారు. వస్త్రపరిశ్రమకు ఇంక్యుబేషన్‌గా మార్చాలనే యోచనలో ఉన్నట్టు తెలిపారు. వస్త్రపరిశ్రమ కార్యకలాపాలను విస్తృతం చేసి, మేడ్చల్, శామీర్‌పేట మండలాల యువతకు ఉపాధి కల్పించాలన్నారు. ఇందుకు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలన్నారు. అవసరమైతే రవాణా సౌకర్యం కూడా కల్పించాలన్నారు. ప్రధానంగా 90శాతం మహిళలకు ఉపాధి కల్పించాలన్నారు. ఒక్కొక్కరికీ రూ.10 వేలు తగ్గకుండా వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

త్వరలో సీఈవో నియామకం

టీఎస్ఐఐసీ పరిధిలో ఉన్న పాశమైలారం, గుండ్లపోచంపల్లి అపారెల్ పార్కులను పర్యవేక్షించేందుకు సీఈవోను ప్రత్యేకంగా నియమించనున్నట్టు మంత్రి కేటీఆర్ తెలిపారు. టీఎస్ఐఐసీ పార్కులో మౌలిక వసతుల కల్పనకు పరిమితం అవుతుందని, నిర్వహణ, కొత్త యూనిట్లను తీసుకురావడం వంటి చర్యలను టెక్స్‌టైల్‌శాఖ తీసుకుంటుందన్నారు. పార్కులో 10 ఎకరాల స్థలంలో చేనేత కళలు, వస్త్ర పరిశ్రమకు సంబంధించిన శిక్షణా కేంద్రాలను నెలకొల్పనున్నట్టు తెలిపారు. పార్కులో ఎల్ఈడీ లైట్లు, రోడ్లు, పచ్చదనం, క్యాంటీన్ తదితర సౌకర్యాలు కల్పించాలని టీఎస్ఐఐసీకి సూచించారు. సమీక్షలో ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్, ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, చేనేత, వస్త్రపరిశ్రమ డైరెక్టర్ శైలజారామయ్యర్, పరిశ్రమలశాఖ ఎండీ రవీందర్, టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ మాధవి, డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు టీఎస్ఐఐసీ కార్యాలయం పరిసరాల్లో ఇంకుడు గుంతను తవ్వకాన్ని మంత్రి ప్రారంభించారు. మొక్కలు నాటారు.

తెలుగు భాషను కాపాడుకోవాలి

- సాంస్కృతికశాఖ మంత్రి చందూలాల్
- టీయూలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం



పురస్కార గ్రహీతలతో మంత్రి చందూలాల్, కళాశాలల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్, వీసీ సత్యనారాయణ తదితరులు

తెలుగు యూనివర్సిటీ: తెలుగు భాషను, సంస్కృతిని కాపాడుకొని జాతి గొప్పతనాన్ని నిలుపుకోవాలని సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి అజ్మీరా చందూలాల్ పిలుపునిచ్చారు. తెలుగు భాషా సాహిత్యాలు, సంస్కృతి, కళలు తదితర అంశాల్లో విశిష్ట సేవలందించినవారికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం-2016గాను ప్రతిభా పురస్కారాలను శనివారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతుల పట్ల సీఎం కేసీఆర్‌కు పూర్తి అవగాహన ఉన్నదని, ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతం చేశారని పేర్కొన్నారు. తెలుగు సాహిత్యంలో కృషి చేసిన వారిని గుర్తించి పురస్కారాలు అందజేసి వెలికితీసే ప్రక్రియ గొప్పగా ఉన్నదన్నారు. తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కళాశాలల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి, రిజిస్ట్రార్ అలేఖ్య తదితరులు పాల్గొన్నారు. పురస్కార గ్రహీతలు.. వసంతరావుదేశ్‌పాండే (నవల), వేణు సంకోజు(కవిత్వం), నియోగి (విమర్శ), మాసురామ్ రవికాంత్(చిత్రలేఖనం), శివరామాచారి(శిల్పం), వనజా ఉదయ్(కూచిపూడి నృత్యం), కేఎస్ఆర్ బాలకృష్ణశాస్త్రి(సంగీతం), అయ్యదేవర పురుషోత్తమరావు(నాటకం), అంగళకుర్తిరామమూర్తి(జానపదం), జీఎం రామశర్మ(అవధానం), అయినంపూడి శ్రీలక్ష్మి(ఉత్తమ రచయిత్రి)కి పురస్కారంతోపాటు ఒక్కొక్కరికీ రూ.20,116 అందజేశారు.




కేసు వివరాలు వెల్లడిస్తున్న హైదరాబాద్ సీపీ శ్రీనివాసరావు

మల్టీలెవల్ మార్కెట్‌తో మోసం

- పెట్టిన పెట్టుబడికి వంద రోజుల్లో డబుల్ అంటూ బురిడీ
- 30 రోజుల్లో 400 మందినుంచి రూ.4.50 కోట్లు వసూలు
- ఇద్దరు నిందితుల అరెస్ట్.. రూ.2 కోట్ల సొత్తు సీజ్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రూ.పది వేలు పెట్టుబడి పెడితే వంద రోజుల్లో దానికి డబుల్ ఇస్తామంటూ చట్టవిరుద్ధంగా గొలుసు కట్టు విధానంలో డబ్బులు వసూలు చేస్తూ అమాయకులను మోసం చేస్తున్న ఇద్దరిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2 కోట్ల విలువైన డిపాజిట్లు, నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్టు హైదరాబాద్ సీపీ శ్రీనివాసరావు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సూర్యాపేట్ జిల్లా కోదాడకు చెందిన జే శ్యాంసుందర్ ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా మంగళగిరి 6వ బెటాలియన్‌లో చేరగా, 2003లో అతనిని ఉద్యోగం నుంచి తొలగించారు. తర్వాత కొన్నాళ్లు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి మల్టీలెవల్ మార్కెటింగ్‌తో ప్రజలను మోసం చేయడం ప్రారంభించాడు.

ఈ క్యాష్ ట్రేడ్ సెక్యూరిటీస్ పేరుతో..



శ్యాంసుందర్, వాసుదేవనాయుడు

రియల్ వ్యాపారం చేస్తున్న శ్యాంసుందర్‌కు సినిమాల్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వాసుదేవనాయుడు పరిచయమయ్యాడు. ఇద్దరూ కలిసి మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో మోసాలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు ఈ క్యాష్ ట్రేడ్ సెక్యూరిటీస్ పేరుతో ఓ సంస్థను ప్రారంభించి, నాంపల్లిలో కార్యాలయాన్ని తెరిచారు. ఈక్యాష్‌వన్.కామ్ పేరుతో వెబ్‌సైట్‌ను రూపొందించి దానిని అసోం నుంచి ఆపరేట్ చేయడం ప్రారంభించారు. హైదరాబాద్ లక్డీకపూల్‌లోని శ్రీకృష్ణలాడ్జిలో గదిని అద్దెకు తీసుకొని కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. రూ.10 వేలు చెల్లిస్తే రోజుకు రూ.200(వంద రోజులు), రూ. 30 వేలు చెల్లిస్తే రోజుకు 300(వంద రోజులు), రూ.70 వేలు చెల్లిస్తే రోజుకు రూ.1400(వంద రోజులు), రూ.1.5 లక్షలు చెల్లిస్తే రోజుకు రూ.3 వేల(వంద రోజులు)తోపాటు యాదాద్రి జిల్లా కొలనుపాకలో 100 గజాల స్థలం ఇచ్చేలా స్కీంలను తయారు చేశారు. స్కీంలో చేరిన వారు, వారి కింద మరో ఇద్దరిని, ఆ ఇద్దరు మరో నలుగురిని ఇలా సభ్యులను చేర్పించాలి. డబ్బు నేరుగా లేదా తమ వెబ్‌సైట్ నుంచి చెల్లించవచ్చని సూచనలు చేశారు. ఎద్దైనా సమాచారం ఉంటే దానిని వెబ్‌సైట్ నుంచి చేరవేస్తూ వచ్చారు. వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసే పోస్టింగ్‌లన్నీ అసోం నుంచే చేస్తున్నారు. సభ్యులుగా చేర్చినవారికి 5 శాతం కమీషన్ ఇచ్చేలా స్కీంను రూపొందించారు. ఇలా 400 మందిని చేర్చుకుని 30 రోజుల్లోనే రూ.4.50 కోట్లు వసూలు చేశారు. మూడు నెలల్లో రూ.50 కోట్లు లక్ష్యంగా ఈ ముఠా మల్టీలెవల్ మార్కెట్‌ను విస్తరించింది. వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు బృందానికి వచ్చిన విశ్వసనీయ సమాచారంతో శ్యాంసుందర్, వాసుదేవనాయుడును అదుపులోకి తీసుకున్నారు. నాలుగు బ్యాంకు ఖాతాలను నిలిపివేసి అందులో ఉన్న రూ.1.73 కోట్లను ఫ్రీజ్ చేయగా, రూ.6 లక్షలు, 30 గ్రాముల బంగారం, కంప్యూటర్లు, సంబంధిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం ఈ ముఠాను నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు అప్పగిస్తున్నట్టు సీపీ తెలిపారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధకిషన్‌రావు, అదనపు డీసీపీ చైతన్యకుమార్, ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
ఆదివారం 4 మార్చి 2018



'ఛల్ మోహన్‌రంగ' చిత్రంలో నితిన్

మాట కలిపె మంగళవారం...

నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. కృష్ణచైతన్య దర్శకుడు. మేఘా ఆకాష్ కథానాయిక. శ్రేష్ట్ మూవీస్, పవన్‌కల్యాణ్ క్రియేటీవ్ వర్క్స్ పతాకంపై ఎన్. సుధాకర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కథ అందిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. మలి గీతంగా 'వారం..' అంటూ సాగే పాటను శనివారం చిత్ర బృందం విడుదల చేసింది. 'ఘస్టులుక్కు సోమవారం...మాట కలిపె మంగళవారం...'అంటూ వారం లోని ఏడు రోజుల్లో జరిగిన సంఘటనల్ని గుర్తుచేస్తూ సాగే బ్రేకప్ సాంగ్‌గా సాగనున్న ఈ పాటను కేదార్‌నాథ్ రచించగా, తమన్ సంగీతం అందించారు. నాకాష్ అజీజ్ ఆలపించిన ఈ పాట యువ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నది. సంగీత సాహిత్యాల కలబోతగా చిత్రంలోని పాటలు వుంటాయి' అని దర్శకుడు కృష్ణచైతన్య తెలిపారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 5న విడుదల చేస్తున్నాం' అని నిర్మాత ఎన్.సుధాకర్‌రెడ్డి తెలిపారు. నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రాశ్రీను, మధునందన్, ప్రగతి, సత్య, పమ్మిసాయి, రాజశ్రీ నాయర్, ఆశురెడ్డి, వెన్నెల రామారావు, కిరీటి, రణధీర్, నీలిమ భవాని, బేబీ హాసిని, బేబీ కృతిక, మాస్టర్ జోయ్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్. తమన్, ఛాయాగ్రహణం: నటరాజ సుబ్రమణియన్, ఎడిటింగ్: ఎస్.ఆర్.శేఖర్, స్టంట్స్: స్టంట్ సిల్వా, రవివర్మ, సమర్పణ: నిఖితారెడ్డి, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: కృష్ణచైతన్య.

అమరావతి, నమస్తే తెలంగాణ: గుంటూరు జిల్లా తెనాలి రైల్వేస్టేషన్‌లో అక్రమంగా తరలిస్తున్న మూడున్నర కిలోల బంగారాన్ని రైల్వే పోలీసులు శనివారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. బెంగుళూరు నుంచి కాకినాడ వెళ్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన ఇద్దరు వ్యక్తులు బంగారాన్ని తరలిస్తున్నారనే సమాచారంతో కాపుకాసి పట్టుకున్నారు. వారు చెన్నైలో బంగారు బిస్కట్లు కొనుగోలు చేశారని, ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని రైల్వే ఎస్పీ మోహన్‌రావు తెలిపారు.

అగ్నిప్రమాదంలో వ్యక్తి సజీవ దహనం

అమరావతి, నమస్తే తెలంగాణ: గుంటూరు జిల్లా కొత్తపేటలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ వ్యక్తి సజీవదహనమయ్యాడు. గుడిసెలో ఒక్కసారిగా మంటలు చెలరేగడం తో మూడు పూరిళ్లు దగ్ధమయ్యా యి. ఒక ఇంట్లో ఉన్న మల్ల య్య అనే వృద్ధుడు మంటల్లో చిక్కుకుని మృతిచెందగా అతడి భార్య దేవకమ్మను స్థానికులు కాపాడారు. స మాచారం అందిన వెం టనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

కవులు, కళాకారుల పూదోట సిద్దిపేట

- కోమటిచెరువు కళాక్షేత్రం సిద్దిపేట ప్రజలకు అంకితం
- భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు
- తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులకు సన్మానం



వేడుకల్లో కళాకారుల నృత్యప్రదర్శన



సిద్దిపేటలో నిర్వహించిన కోమటి చెరువు కళాక్షేత్రం ముగింపు ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో సీఎం కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, రసమయి బాలకిషన్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ హరికృష్ణ, కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: 'కవులు, కళాకారులు, సాహితీ వేత్తలకు సిద్దిపేట పూదోట.. సిద్దిపేట కోమటి చెరువు కళాక్షేత్రాన్ని ప్రజలకు అంకితం చేస్తున్నాం.. మరో మూడు వేదికలను మూడు నెలల్లో నిర్మిస్తాం. కళాక్షేత్రంలో రోజూ ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తాం' అని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో నిర్మించిన కోమటి చెరువు కళాక్షేత్రం కళాఉత్సవాలు శనివారం ముగిశాయి. మూడు రోజులపాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణ ఉద్యమకారులను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించగా, వాగ్గేయకారుడు జయరాజు, గాయకుడు సాయిచంద్‌కు ఆత్మీయ సత్కారం చేశారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సాంస్కృతిక కళావేదికగా సిద్దిపేట వేదిక కావాలని, సిద్దిపేట ప్రజల కోసం ఈ కళాక్షేత్రం నిత్యం ఆధ్యాత్మిక సభలు, సాంస్కృతిక కార్యక్రమాలకు నెలవు కావాలని ఆకాంక్షించారు. కోమటి చెరువు చుట్టూ నెక్లెస్ రోడ్‌తోపాటు కళాభవన్, బాబూజగ్జీవన్‌రామ్, ఉపాధ్యాయ భవన్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ మాట్లాడుతూ సిద్దిపేట ప్రజల కలల స్వప్నం కోమటి చెరువు కళాక్షేత్రంగా మారిందన్నారు. కేసీఆర్ చెప్పిన ప్రతిమాటను మంత్రి హరీశ్‌రావు నిజం చేస్తున్నారన్నారు. ప్రముఖ కవి వాగ్గేయకారుడు జయరాజు మాట్లాడుతూ కళాకారుల కోసం చక్కటి కళా వేదికను నిర్మించడం ఆనందంగా ఉన్నదన్నారు.

కేరింతలతో మార్మోగిన కళాక్షేత్రం

కోమటి చెరువు కళాక్షేత్ర కళా ఉత్సవాలకు జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కళాక్షేత్ర వెనుక వైపు రెండు భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ల ను ఏర్పాటు చేశారు. యువకులు ఈలలు.. కేరింతలతో కళాక్షేత్రం మార్మోగింది. మంత్రి హరీశ్‌రావు పాటో కార్యులతో టీహెచ్‌ఆర్ యువసేనతోపాటు చిన్నారులు సందడి చేశారు. వందేమాతరం శ్రీనివాస్ బృందం కవేరి ఆకట్టుకోగా, గాయకుడు సాయిచంద్ 'సిద్దిపేట సిద్దిపేట సిద్దిపేటరో'.. ఇది ఉద్యమాలకు పెట్టని కోటరో.. అనే ఉర్రూతలూగించింది. ఈ వేడుకల్లో సీఎం కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, ఉమ్మడి మెదక్ జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి తదితరులు పాల్గొన్నారు.



వనపర్తి జిల్లా నాగవరంలో శివాలయానికి భూమి పూజ చేస్తున్న శృంగేరి పీఠాధిపతి

జీవితాన్ని సేవలకు అంకితం చేయాలి

శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీస్వామి

వనపర్తి రూరల్ /మహబూబ్‌నగర్ సాంస్కృతిక విభాగం : జీవితాన్ని సేవలకు అంకితం చేయాలని శృంగేరి పీఠాధిపతి విధుశేఖరభారతీస్వామి భక్తులకు సూచించారు. శనివారం ఉదయం వనపర్తి జిల్లా నాగవరం గ్రామ శివారులోని అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో నూతన శివాలయ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఆయన అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. విధుశేఖరభారతీ స్వామి విజయయాత్ర శనివారం రాత్రి మహబూబ్‌నగర్ పట్టణానికి చేరుకోగా, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షురాలు రాధ ఘనస్వాగతం పలికారు. అనంతరం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ నుంచి కన్యకా పరమేశ్వరీ మాత ఆలయం దాకా శోభాయాత్ర నిర్వహించారు. పంచావటి విద్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులనుద్ధేశించి స్వామిజీ సందేశం ఇచ్చారు. కార్యక్రమానికి కలెక్టర్ రొనాల్డ్‌రోస్ దంపతులతోపాటు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



ఖమ్మం జిల్లా అనాసాగరంలో డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రారంభిస్తున్న తుమ్మల

అభివృద్ధిలో ముందుంచుతా: మంత్రి తుమ్మల

నేలకొండపల్లి : జిల్లా, పాలేరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతానని, అది తన బాధ్యత అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అనాసాగరంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను శనివారం ఆయన ప్రారంభించి, లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. రానున్న ఖరీఫ్, యాసంగి పంటలకు రైతులకు ఎకరానికి రూ.8 వేలను ప్రభుత్వం అందించబోతుందన్నారు. ఇంటింటికి తాగునీరు అందించబోతున్నామన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నుంచి కూడా ఎంతో మంది టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జడ్పీ అధ్యక్షురాలు గడిపల్లి కవిత, డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.




మహబూబ్‌నగర్ జిల్లా అప్పన్నపల్లిలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గ్రామాభివృద్ధిలో సర్పంచులే కీలకం

మంత్రులు జూపల్లి కృష్ణారావు, పట్నం మహేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్ : గ్రామాభివృద్ధిలో సర్పంచులే పాత్ర కీలకమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అప్పన్నపల్లి సమీపంలోని వైట్‌హౌస్ కన్వెన్షన్‌లో పంచాయతీరాజ్ కమిషనర్ నీతుప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం తొమ్మిది జిల్లాల సర్పంచుల సమ్మేళనం నిర్వహించారు. దీనికి మంత్రులు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. జూపల్లి మాట్లాడుతూ గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పి అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చాలని సూచించారు. ప్రతీ పంచాయతీలో ప్రజావాణి నిర్వహించాలని ఆదేశించారు. మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కేటాయించని విధంగా టీఆర్‌ఎస్ సర్కారు గ్రామానికి రూ.20 నుంచి రూ.30 కోట్లు అభివృద్ధి కోసం కేటాయించిందన్నారు.



అన్నారం బ్యారేజ్ వద్ద ఓయూ విద్యార్థుల బృందం

'కాళేశ్వరం' అధ్యయనానికి ఓయూ విద్యార్థులు

కాళేశ్వరం : రాష్ట్ర సర్కారు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు అధ్యయనానికి శనివారం ఉస్మానియా సివిల్ ఇంజినీరింగ్‌కు చెందిన 45మంది విద్యార్థులు, ప్రొఫెసర్లు వచ్చారు. ముందుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో అన్నారం బ్యారేజీని సందర్శించారు. అక్కడి నుంచి కన్నెపల్లిలోని మేడిగడ్డ పంప్‌హౌస్‌కు చేరుకున్నారు. డీఈఈ ప్రకాశ్ వారికి ప్రాజెక్టు గురించి వివరించారు. పంప్‌హౌస్‌వద్ద జరుగుతున్న పనులను చూసి ఆశ్చర్యపోయారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి నేటితరం విద్యార్థులకు తెలియాల్సిన అవసరం ఉందనీ, అందుకే విద్యార్థులను అధ్యయానికి తీసుకొచ్చినట్లు ప్రొఫెసర్లు చెప్పారు.

ఎన్‌కౌంటర్ మృతులపై సందిగ్ధతకు తెర

చనిపోయిన మావోయిస్టుల్లో ఏడుగురు మహిళలు • పదిమందిలో తొమ్మిదిమంది ఛత్తీస్‌గఢ్ వాసులు

ఒకరు వరంగల్ నగరవాసి • హైకోర్టు ఆదేశాల ప్రకారం భద్రాద్రిలో పోస్టుమార్టం



మావోయిస్టుల మృతదేహాలు

భద్రాచలం, నమస్తే తెలంగాణ/ జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని పుజారికాంకేర్ ప్రాంతంలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్ మృతులపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ఈ ఎదురుకాల్పుల్లో మొత్తం పది మంది మావోయిస్టులు చనిపోగా గ్రేహౌండ్స్‌కు చెందిన కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ మరణించిన విషయం తెలిసిందే. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం దట్టమైన అటవీ ప్రాంతం కావటంతో పోలీసులు శుక్రవారం గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ మృతదేహంతోపాటు ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను మాత్రమే హెలీక్యాప్టర్‌లో భద్రాచలం తరలించారు. శనివారం ఉద యం ఎన్‌కౌంటర్ స్థలం నుంచి మిగతా ఎనిమిది మంది మృతదేహాలను భద్రాచలంలోని మార్చురీ గదికి తీసుకొచ్చారు.

పోస్టుమార్టం పూర్తి..

ఫోరెన్సిక్ నిపుణులు, సీనియర్ డాక్టర్ల సమక్షంలో పోస్టుమార్టం చేయాలని, వీడియో చిత్రీకరించాలని, మృతదేహాలను గుర్తించి వారి బంధువులకు అప్పగించేంతవరకు భద్రపరచాలనే హైకోర్టు ఆదేశాలను అధికారులు పాటిస్తున్నారు. ఆ మేరకు ఎంజీఎం దవాఖాన వైద్యులు డాక్టర్ కృపాల్ సింగ్, గాంధీ మెడికల్ డాక్టర్ లావణ్య, కేఎంసీ వరంగల్ వైద్యులు ఖాజామోహీయొద్దీన్ తదితరులు పదిమంది మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. కొత్తగూడెం ఎస్పీ అంబర్‌కిషోర్‌ఝా నేతృత్వంలో పోలీస్ ఉన్నతాధికారులు, భద్రాచలం ఇంచార్జి సబ్ కలెక్టర్ డాక్టర్ రాజేందర్‌కుమార్ పర్యవేక్షణలో నలుగురు తహసీల్దార్లు, వీఆర్వోలు, ఫింగర్ ప్రింట్స్ బృందం సభ్యులు ఈ పోస్టుమార్టంను పర్యవేక్షించారు. పోస్టుమార్టం తరువాత వాటిని ఫ్రీజర్లలో భద్రపరిచారు. మొత్తం పది మందిలో ఏడుగురు మహిళలు ఉన్నట్టు ఎస్పీ తెలిపారు. దడబోయిన స్వామి మృతదేహన్ని పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు.

మృతదేహాల గుర్తింపు..

పదిమందిలో ఏడుగురి మృతదేహాలను గుర్తించినట్టు పోలీసులు శనివారం అధికారికంగా వెల్లడించారు. వరంగల్ అర్బన్ జిల్లా రాంపేటకు చెందిన పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్‌తోపాటు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దళసభ్యులు ఐతు, భుద్రి, రమ, కోసి, సుకి, మల్లేశ్ ఉన్నట్టు తెలిపారు. ఇందులో మల్లేశ్ సెక్షన్ కమాండర్. ఇతను ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతికి చెందిన మావోయిస్టు పార్టీలో ఎ-సెక్షన్ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించారు. రమ ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమ జిల్లాలో ఏరియా కమిటీ మెంబర్ హోదాలో పార్టీ డాక్టర్స్ టీంలో పనిచేశారు. ఇతరులు దళసభ్యులుగా బాధ్యతలు నిర్వహించారు.

కీలక నేతలు లేనట్టే..

ఎదురుకాల్పుల్లో మృతిచెందిన పది మంది మావోయిస్టుల్లో పార్టీ అగ్రనేతలు యాప నారాయణ అలియాస్ హరిభూషణ్, ఆయన భార్య శారద, కీలక నేతలు బడే చొక్కారావు అలియాస్ దామోదర్, కొయ్యడ సాంబయ్య అలియాస్ గోపన్న ఉన్నట్టు ప్రచారం జరిగింది. మృతులపై అనేక రకాల ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. ఈ ఉత్కంఠకు పోలీసులు శనివారం తెరదించారు.



బీదర్‌లో కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ భౌతిక కాయం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న డీజీపీ

అధికార లాంఛనాలతో సుశీల్ అంత్యక్రియలు

హాజరైన డీజీపీ మహేందర్‌రెడ్డి

జహీరాబాద్, నమస్తే తెలంగాణ: ఎన్‌కౌంటర్‌లో మరణించిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్(32) అంత్యక్రియలు శనివారం కర్ణాటకలోని బీదర్ పట్టణంలో అధికార లాంఛనాలతో నిర్వహించారు. డీజీపీ మహేందర్‌రెడ్డి హెలీకాప్టర్‌లో బీదర్‌కు చేరుకొని సుశీల్‌కుమార్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. అతని తల్లిదండ్రులు శారద, విజయ్‌కుమార్, భార్య శశికళను ఓదార్చి, ప్రభుత్వపరంగా అదుకుంటామని భరోసా ఇచ్చారు. డీజీపీ వెంట నిఘా విభాగం అధిపతి నవీన్‌చంద్, సంగారెడ్డి జిల్లా ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, బీదర్ కలెక్టర్ మహదేవ్, బీదర్ ఎస్పీ దేవరాజ్, జహీరాబాద్ డీఎస్పీ నల్లమల రవి, గ్రేహౌండ్స్ అధికారులు ఉన్నారు.

భారీగా తరలివచ్చిన జనం..

సుశీల్‌కుమార్ అంతిమయాత్రలో స్థానికులు, అతని బంధువులు, స్నేహితులు, పోలీసు అధికారులు,సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి పాత మార్కెట్ క్రైస్తవ శ్మశాన వాటిక వరకు అంతియయాత్ర జరిగింది. చర్చి ఆవరణలో పోలీసులు గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. అనంతరం క్రైస్తవ మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు జరిపి, క్రైస్తవ సంప్రదాయం ప్రకారం అంతిమ సంస్కారాలు నిర్వహించారు.



కర్ణాటకలోని బీదర్‌లో సుశీల్‌కుమార్ అంతిమయాత్ర

2001లో ఉద్యమంలోకి వెళ్లిన స్వామి



స్వామి(ఫైల్)

నయీంనగర్/కాజీపేట(వరంగల్): ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్(53) వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట మండలం రాంపేటవాసి. మహంకాళీ-మెట్టురాములు ఇతని తల్లిదండ్రులు. స్వామి వీరికి మూడో సంతానం. స్వామి పెద్దన్న ఉప్పలయ్య రైల్వేలో ఉద్యోగం చేసి మృతి చెందాడు. రెండో అన్న సమ్మయ్య రైల్వేలో పనిచేసి ఇటీవలే ఉద్యోగ విరమణ పొందాడు. ఇతను పదోతరగతి వరకు సోమిడిలో చదివాడు. అనంతరం వరంగల్ సీకేఎం కళాశాలలో ఇంటర్, డిగ్రీ ఎల్‌బీ కళాశాలలో పూర్తి చేశాడు. హన్మకొండలో బీఈడీ పూర్తి చేశాడు. కడిపికొండలోని విశ్వశాంతి పాఠశాలలో ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తూనే ట్యూషన్ చెప్పేవాడు. మరో పక్క కాంగ్రెస్ పార్టీ సేవాదళ్‌లో చురుకైన కార్యకర్తగా కొనసాగాడు. మావోయిస్టు పార్టీకి ఆకర్షితుడైన స్వామి 2001లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. 1993లో వేలేరు మండలం శాలపెల్లికి చెందిన రేణుకను వివాహం చేసుకున్నాడు. స్వామి అజ్ఞాతంలోకి వెళ్లిన అనంతరం రేణుక తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. 2001నుంచి పార్టీలో వివిధ హోదాల్లో పని చేసిన స్వామి అలియాస్ ప్రభాకర్ మావోయిస్టు పార్టీ నార్త్ జోన్ తెలంగాణ స్పెషల్ కమిటీ మెంబర్‌తోపాటు యాక్షన్ టీం కమాండర్‌గా పనిచేస్తూవచ్చాడు.

ఉలిక్కిపడిన రాంపేట..

ఎన్‌కౌంటర్‌లో స్వామి మృతి చెందినట్టు తెలియడంతో రాంపేట ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గ్రామస్థులు శోక సముద్రంలో మునిగిపోయారు. ఎన్‌కౌంటర్ గురించి తెలుసుకోవడానికి ఆతృత కనబరిచారు. స్వామి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు అతని అన్నావదిన సమ్మయ్య-కనకలక్ష్మితోపాటు పలువురు కుటుంబీకులు, గ్రామస్థులు భద్రాచలానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న వెంటనే స్వామి భార్య రేణుక తన తల్లిదండ్రులతో కలిసి రాంపేటకు చేరుకున్నట్టు తెలిసింది.

దేశానికి ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రం

- ఏప్రిల్ 20 నుంచి సాగు పెట్టుబడి పంపిణీ
- జగిత్యాలలో వ్యవసాయ శాఖ మంత్రి పోచారం
- విత్తనోత్పత్తిలో జగిత్యాల ఆదర్శం కావాలి : ఎంపీ కవిత



జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి పోచారం, చిత్రంలో ఎంపీ కవిత, జెడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఫైనాన్స్ కమిషన్ అధ్యక్షుడు రాజేశంగౌడ్

జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ మార్గదర్శనంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌లో రూ.7కోట్లతో నిర్మించనున్న విత్తనశుద్ధి కర్మాగారానికి శనివారం నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవితతో కలిసి మంత్రి పోచారం శంకుస్థాపన చేశారు. అనంతరం జగిత్యాల జిల్లా కేంద్రంలో సబ్సిడీ ట్రాక్టర్ల పంపిణీ, రైతు సమన్వయ సమితి సభ్యుల అవగాహన తరగతులు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ అధ్యక్షుడు గొడిశెల రాజేశంగౌడ్ అభినందన కార్యక్రమం పాల్గొన్నారు. మంత్రి పోచారం మాట్లాడుతూ సాగునీటిని పొలాల్లోకి మళ్లించేందుకు రూ.1.50 లక్షల కోట్లు వెచ్చించి ప్రాజెక్టులు నిర్మిస్తున్నారన్నారు. మార్చి 11న రాష్ట్రంలోని 72 లక్షల మంది రైతులకు భూరికార్డు పత్రాలు (పట్టాదారు పాస్‌పుస్తకాలు) అందజేస్తామన్నారు. ఏప్రిల్ 20 నుంచి మే 15దాకా సాగు పెట్టుబడిని ఇస్తామన్నారు. యాసంగిలో నవంబర్ 18 నుంచి డిసెంబర్ వరకు పంటపెట్టుబడి రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ మాదిరిగానే ఆయన కూతురు ఎంపీ కవిత సైతం రైతు సంక్షేమం కోసం తపిస్తున్నారన్నారు. ప్రతి మండలానికి 10 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 5,500 సీడ్ ట్రాన్స్‌ప్లాంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికి రూ. 550 కోట్లు కేటాయించినట్టు తెలిపారు.

విత్తనోత్పత్తిలో దేశానికే జగిత్యాల ఆదర్శం: ఎంపీ కవిత

విత్తనోత్పత్తిలో జగిత్యాల దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని నిజామాబాద్ ఎంపీ కవిత అన్నారు. ఆదర్శ రైతులు ఉన్న లక్ష్మీపూర్‌కు విత్తనశుద్ధి కర్మాగారం అవసరం ఉన్నదని చెప్పగానే రూ.7 కోట్లు కేటాయించిన మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. లక్ష్మీపూర్ సీడ్ ప్లాంట్‌తో జగిత్యాల ప్రజలకు, రైతులకు లాభం చేకూరుతుందన్నారు. ఈ గ్రామానికి ఇప్పటివరకు రూ.17 కోట్ల సాయం అందజేశామని, తాజాగా రూ.8 కోట్ల విలువగల పనులు మంజూరు చేశామన్నారు. లక్ష్మీపూర్‌కు 200 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో మండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ సీఎండీ కోటేశ్వర్‌రావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీఆర్‌ఎస్‌లో జోరుగా చేరికలు



హైదరాబాద్‌లో మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరిన మహబూబ్‌నగర్ జిల్లా అమ్మపల్లి యువకులు



రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎంపీ చామకూర మల్లారెడ్డి

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లో వివిధ పార్టీల నుంచి వలసలు జోరుగా సాగుతున్నాయి. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం అమ్మపల్లి గ్రామానికి చెందిన 20మంది యువకులు హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో, నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన 580 మంది టీఆర్‌ఎస్‌లో చేరారు. వికారాబాద్‌లోని గ్రంథాలయ ఆవరణలో మర్పల్లి మండలం సిరిపురం గ్రామానికి చెందిన టీడీపీ, కాంగ్రెస్ నాయకులు మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజీవరావు, ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ డివిజన్‌లో ఎంపీ చామకూర మల్లారెడ్డి సమక్షంలో రంగనాయకులగుట్టకాలనీకి చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో టీఆర్‌ఎస్‌లో చేరారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూర్ గ్రామంలోని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన 200 మంది కాంగ్రెస్, టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో 50 కుటుంబాలతోపాటు రిటైర్డ్ ఎస్సై సంకు సత్తిరెడ్డి టీఆర్‌ఎస్‌లో చేరగా, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం మారంపల్లిలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 50మంది ఆర్మూరు ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

150 కోట్లతో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

- నేడు ఆరెపల్లి వద్ద శంకుస్థాపన చేయనున్న మహారాష్ట్ర గవర్నర్

వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో క్యాన్సర్ రోగులకు వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రముఖ ప్రతిమ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ నేతృత్వంలో వరంగల్ రూరల్ జిల్లాలో రూ.150 కోట్లతో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు ఆదివారం ఉదయం 9.30గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, గిరిజన శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్, ఎంపీలు పసునూరి దయాకర్, బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ భాస్కర్, కొండా సురేఖ, వరంగల్ నగర మేయర్ నన్నపునేని నరేందర్, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి తదితరులు హాజరవుతారని హాస్పటల్స్ చైర్మన్ బోయినపల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్ డాక్టర్ రమేశ్ తిప్పని తెలిపారు. వరంగల్ రూరల్ జిల్లాలోని దామెర మండలం ఆరెపల్లి వద్ద జాతీయ రహదారిని ఆనుకొని పదెకరాల విస్తీర్ణంలో ఈ దవాఖానను నిర్మించనున్నారు. అధునాతన సౌకర్యాలు, అమెరికా స్థాయి వైద్యం, జాతీయస్థాయి ప్రమాణాలతో చికిత్స అందించేలా ప్రతిమ సంస్థలు కార్యాచరణను రూపొందించాయి. ఇందులో గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంతోపాటు రేడియేషన్ యూనిట్ (లినియస్ యాక్టివేటర్) మెడికల్ అంకాలజీ, సర్జికల్ అంకాలజీ విభాగాలుంటాయి. ఇది ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌గా అవతరించనున్నది. దీన్ని 12 నుంచి 18 నెలల్లోగా పూర్తి చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. 300 పడకలతో ప్రారంభించి 500 పడకలకు పెంచుతామని హాస్పటల్స్ డైరెక్టర్ డాక్టర్ రమేశ్ తిప్పని తెలిపారు. కార్యక్రమ ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, డైరెక్టర్ రమేశ్, ఈస్ట్‌జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, ఏసీపీ సుధీంద్ర పరిశీలించారు.

వడదెబ్బతో ఒకరి మృతి



లక్ష్మయ్య మృతదేహం

నర్మెట: జనగామ జిల్లా చిల్పూరు మండలం శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన పల్లపు లక్ష్మయ్య(55) వడదెబ్బతో శనివారం మృతి చెందాడు. బండ కొడుతూ జీవనం సాగించే లక్ష్మయ్య, ఎండల తీవ్రతతో అనారోగ్యానికి గురికాగా, అతని భార్య వెంకటమ్మ నర్మెటలోని ప్రైవేటు దవాఖానలో వైద్య పరీక్షలు చేయించింది. తిరిగి గ్రామానికి వెళ్లేందుకు బస్సు కోసం వేచి చూస్తుండగా అక్కడే కుప్పకూలాడు.

కదులుతున్న రైలులోనుంచి దూకి..

పసిగుడ్డుతో సహా తల్లి ఆత్మహత్య

నవీపేట: ఐదు నెలల పసిగుడ్డుతో సహా ఓ తల్లి నడుస్తున్న రైలులో నుంచి బాసర గోదావరిలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా.. నాందేడ్ జిల్లా ఉమ్రి మండల కేంద్రానికి చెందిన హంగిర్గ రాజు, అతని భార్య సునీత (25), కొడుకులు శివశంభు(5 నెలలు), కేశవ్‌తో కలిసి ఉపాధి కోసం నిజామాబాద్‌కు ప్యాసింజర్ రైలులో వస్తున్నారు. రైలు బాసర గోదావరి నది వద్దకు చేరుకోగానే భర్త గాఢ నిద్రలో ఉండగా సునీత, శివశంభుతో కలిసి గోదావరిలో దూకింది. గమనించిన తోటి ప్రయాణికులు వెంటనే రాజును నిద్ర నుంచి లేపి, విషయాన్ని చెప్పారు. పైనుంచి దూకడంతో తల్లీకుమారుడు మృతిచెందారు. భర్త రాజు ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రూ.50లక్షల విల్లా డాక్యుమెంట్లను బహుమతిగా అందిస్తున్న సువర్ణవాణి ఎస్టేట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సురేందర్ కుమార్

50 లక్షల విల్లా..రూ.20 లక్షలు ప్రభుత్వ నజరానా

జిమ్నాస్ట్ అరుణారెడ్డికి ఘన సత్కారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: ప్రపంచకప్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో దేశానికి తొలి పతకం అందించిన తెలంగాణ బిడ్డ బుడ్డా అరుణారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం తరపున క్రీడల మంత్రి పద్మారావు ఘనంగా సత్కరించారు. శనివారం లాల్‌బహదూర్ స్టేడియంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ(సాట్స్), తెలంగాణ ఒలింపిక్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అరుణారెడ్డికి రూ.20లక్షల చెక్‌ను క్రీడలమంత్రి టీ పద్మారావు అందించగా.. విశ్వవేదికపై భారత కీర్తిపతాకను ఎగరేసినందుకు సువర్ణవాణి ఎస్టేట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరపున ఆ సంస్థ ఎండీ సురేందర్ కుమార్, శంషాబాద్ సమీపంలోని కొత్తూరులో సిటీ గేటెడ్ కమ్యూనిటీలో నిర్మించిన రూ.50లక్షల విల్లాను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా మంత్రి పద్మారావు మాట్లాడుతూ హైదరాబాదీ అరుణ సాధించిన విజయం యావత్ భారతానికి స్ఫూర్తినందిస్తుందన్నారు. క్రీడలను ప్రోత్సహించడంతో ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని..క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పతకాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ ఏ వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర క్రీడల కార్యదర్శి బుర్ర వెంకటేశం, తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కే రంగారావు, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఆర్ ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



అరుణారెడ్డికి రూ.20లక్షల చెక్‌ను అందిస్తున్న క్రీడలమంత్రి టీ పద్మారావు, క్రీడల కార్యదర్శి బీ వెంకటేశం తదితరులు



గాయంతో షకీబల్ ఔట్

ఢాకా: ముక్కోణపు టీ20 సిరీస్‌కు ముందు బంగ్లాదేశ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. చేతి వేలు గాయంతో కెప్టెన్ షకీబల్ హసన్ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు(బీసీబీ) శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. షకీబల్‌కు బదులుగా లిటన్ దాస్‌ను ఎంపిక చేయగా, మహ్మదుల్లా రియాద్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. గత నెలలో శ్రీలంక, జింబాబ్వేతో జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌లో షకీబల్ చేతివేలుకు గాయమైంది. చికిత్స నిమిత్తం థాయ్‌లాండ్‌కు వెళ్లగా పూర్తిగా కోలుకునేందుకు మరింత సమయం అవసరమని డాక్టర్లు సూచించారు. ఈ నేపథ్యంలో పూర్తి ఫిట్‌నెస్ లేని కారణంతో సిరీస్‌కు షకీబల్ దూరమైనట్లు జట్టు కోచ్ వాల్ష్ శనివారం మీడియా సమావేశంలో పేర్కొన్నాడు.

'దేవధర్' దక్కేదెవరికో?

■ భారత్ 'ఎ', భారత్ 'బి' మధ్య తొలిపోరు నేడు

ధర్మశాల: దేవధర్ ట్రోఫీకి రంగం సిద్ధమైంది. ఆదివారం భారత్ 'ఎ', భారత్ 'బి' జట్ల మధ్య తొలి పోరుతో టోర్నీకి తెరలేవనుంది. మూడో జట్టుగా విజయ్ హజారే ట్రోఫీ విజేత కర్ణాటక బరిలోకి దిగుతున్నది. మ్యాచ్‌లన్నీ ధర్మశాల స్టేడియం వేదికగా జరుగనున్నాయి. భారత్ 'ఎ', భారత్ 'బి' మ్యాచ్ విషయానికొస్తే..ఇరు జట్లు సమవుజ్జీలుగా కనిపిస్తున్నాయి. 2019 ప్రపంచకప్‌నకు సమయం సమీపిస్తున్న తరుణంలో టీమ్‌ఇండియాలో చోటు కోసం తీవ్ర పోటీ ఏర్పడింది. ముఖ్యంగా ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమీ తిరిగి జట్టుకు ఎంపికయ్యేందుకు దేవధర్ ట్రోఫీని వేదికగా మలుచుకోవాలనుకుంటున్నారు. ఇటీవలి దక్షిణాఫ్రికాతో వన్డే, టీ20 సిరీస్‌లకు ఉమేశ్‌కు బదులు శార్దుల్ ఠాకూర్‌ను సెలెక్షన్ కమిటీ ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఇంగ్లండ్ వేదికగా జరిగే ప్రపంచకప్‌నకు మరో ఏడాది గడువే ఉన్నందున మెరుగైన ప్రదర్శనతో జట్టులో చోటు దక్కించుకోవాలన్న తలంపుతో ఉన్నారు. మరోవైపు ఇటీవలి అండర్-19 ప్రపంచకప్‌లో మెరిసిన పృథ్వీషా, శుభ్‌మన్ గిల్ తమ సత్తాచాటేందుకు సిద్ధమవుతున్నారు. షమీ, నవదీప్‌సైనీ, బాసిల్ థంపీ, నదీమ్, కృనాల్ పాండ్యా లాంటి ఆటగాళ్లతో భారత్ 'ఎ' పటిష్టంగా కనిపిస్తున్నది. మరోవైపు శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్సీలోని భారత్ 'బి'లో మనోజ్ తివారీ, అభిమన్యు ఈశ్వరన్, సిద్దేశ్ లాడ్, ఉమేశ్, సిద్ధార్థ్ కౌల్, హర్షల్ పటేల్ ఉన్నారు.



భారత్ పరాజయం

■ సుల్తాన్ అజ్లాన్ షా హాకీ కప్

ఇఫో(మలేసియా): ఓ వైపు దంచికొట్టిన వర్షం..మరోవైపు అనుభవలేమి..వెరసి ఒత్తిడికి లోనైన యువ భారత హాకీ జట్టు సుల్తాన్ అజ్లాన్ షా హాకీ కప్ ఆరంభ మ్యాచ్‌లో ఓడింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఒలింపిక్ చాంపియన్ అర్జెంటీనా 3-2 స్కోరుతో విజయాన్ని నమోదు చేసి టోర్నీలో శుభారంభం చేసింది. అర్జెంటీనా జట్టు పెనాల్టీ కార్నర్ స్పెషలిస్ట్ గొంజాలో మూడు పెనాల్టీలను గోల్స్‌గా మలిచి హ్యాట్రిక్ సాధించడంతో భారత పోరాటం వృథాగా మారింది. భారత ఆటగాడు అమిత్ రోహిదాసె రెండు గోల్స్ చేసినా.. అకాలవర్షంతో మ్యాచ్ నాలుగో క్వార్టర్ రద్దు కావడంతో భారత్‌కు నిరాశే ఎదురైంది. అంతగా అనుభవం లేని భారత జట్టును సీనియర్ సర్దార్ సింగ్ అద్భుతంగా నడిపించాడు. జట్టు యువ ఫార్వర్డ్ ఆటగాళ్లు తల్విందర్ సింగ్, అరంగేట్రంలోనే సుమిత్ కుమార్ ఆకట్టుకున్నారు. తొలి క్వార్టర్‌లో వీరిద్దరి ధాటికి అర్జెంటీనా గోల్‌కీపర్ జువాన్ వివిలాడి తడబడ్డాడు. తొలి పదినిమిషాలపాటు అర్జెంటీనా డిఫెండర్లను ముప్పు తిప్పలు పెట్టినా గొంజాలో గోల్స్‌తో భారత జట్టు ఒత్తిడికి గురైంది. అర్జెంటీనా స్టార్ గొంజాలో మ్యాచ్ 13, 24 నిమిషాల్లో లభించిన పెనాల్టీకార్నర్లను గోల్స్‌గా మలిచి 2-0తో జట్టుకు తిరుగులేని ఆధిక్యాన్ని కట్టబెట్టాడు. దీంతో తేరుకున్న భారత హాకీ జట్టు మళ్లీ ఎదురుదాడికి దిగింది. మ్యాచ్ 26వ నిమిషంలో లభించిన పెనాల్టీని అమిత్ గోల్‌గా మార్చడంతో 2-1 తేడాతో తొలి అర్ధభాగం ముగిసింది. ఇక రెండో అర్ధభాగం 31వ నిమిషంలో అమిత్ మళ్లీ పెనాల్టీని సద్వినియోగం చేసి గోల్ కొట్టడంతో స్కోరు2-2గా మారింది. కానీ ఈ సంతోషం ఎంతోసేపు నిలువలేదు. మూడో గోల్‌తో గొంజాలో 3-2తో అర్జెంటీనాను ఆధిక్యంలో నిలిపాడు. ఈ సమయంలో భారీవర్షంతో మ్యాచ్ నాలుగో క్వార్టర్ పూర్తిగా రద్దు కావడంతో భారత్ పరాజయం పాలైంది. నేడు ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌లో భారత్ తలపడనుంది.



శనివారం జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్, అంబర్‌పేట్‌లోని స్విమ్మింగ్‌పూల్‌ను వేసవిసెలవుల సందర్భంగా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తూ పున:ప్రారంభిస్తున్న రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు..



■ గాయం నుంచి కోలుకున్న సెర్బియన్
■ ప్రాక్టీస్ మొదలుపెట్టిన మాజీ నంబర్‌వన్
■ మైండ్‌సెట్ మారితే అతనిదే హవా

జొకో పుంజుకునేనా?

ఫెడరర్‌కు సవాలు విసిరాడు.. నాదల్‌ను నట్టేట్లో ముంచాడు.. ముర్రేకు ముచ్చెమటలు పట్టించాడు.. అప్పట్లో అతని ఆట ఓ సంచలనం.. బరిలోకి దిగాడంటే ఎంతటి ప్రత్యర్థి అయినా వణుకాల్సిందే.. ప్రత్యర్థిని వెక్కిరించాలన్నా.. తొడగొట్టి పడగొట్టాలన్నా అతనికి అతనే సాటి.. దాదాపు ఐదారేండ్లు టెన్నిస్ ప్రపంచాన్ని మకుటం లేని మహారాజుగా ఏలిన సెర్బియన్ స్టార్ నొవాక్ జొకోవిచ్ ఇప్పుడు మళ్లీ ఆటలోకి పునరాగమనం చేస్తున్నాడు. ఓవైపు గాయాలు.. మరోవైపు ఫామ్‌లేమితో తీవ్ర ఇబ్బందులుపడ్డ ఈ ప్రపంచ మాజీ చాంపియన్ మళ్లీ పూర్వవైభవందిశగా అడుగులు వేసేందుకు సిద్ధమవుతున్నాడు. అయితే ఇది సాధ్యమవుతుందా? ఫెడరర్, నాదల్ జమానాకు తెరదించి కొత్త శకాన్ని తీసుకొస్తాడా? ప్రస్తుతం టెన్నిస్‌లో ఆసక్తికరంగా నడుస్తున్న చర్చ ఇది..!

(నమస్తే తెలంగాణ స్పోర్ట్స్‌డెస్క్)

గతేడాది గాయాల కారణంగా జొకోవిచ్ కనీసం ఒక్క టైటిల్ కూడా గెలువలేకపోయాడు. జనవరిలో దోహా టోర్నీలో ముర్రేని ఓడించిన అతను తర్వాత అన్‌సీడెడ్ క్రీడాకారుల చేతుల్లోనూ పరాజయం చవిచూశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రపంచ 117వ ర్యాంకర్ డెనిస్ ఇస్టోమిన్ చేతిలో మొదలైన ఓటమి ఏడాది మొత్తం కొనసాగింది. 2007 తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకోలేకపోయిన అపప్రదను మూటగట్టుకున్నాడు. మెక్సికన్ ఓపెన్, ఇండియానా వేల్స్, మాంటేకార్లో, ఇలా వరుస టోర్నీలో పరాజయం చవిచూశాడు. అయితే రోమ్ మాస్టర్స్‌లో రన్నరప్‌గా నిలిచి కాస్త ఫామ్ చూపెట్టినా.. వెంటనే మోచేతి గాయంతో మళ్లీ వెనుకబడ్డాడు. కొత్త కోచ్ ఆండ్రీ అగస్సీతో కలిసి ఫ్రెంచ్ ఓపెన్‌లో బరిలోకి దిగినా.. క్వార్టర్స్‌లోనే వెనుదిరిగాడు. ఇక వింబుల్డన్‌లో బెర్డిచ్‌తో జరిగిన మ్యాచ్‌లో గాయం కారణంగా మధ్యలోనే వైదొలిగాడు. గాయం తీవ్రత పెరుగడంతో యూఎస్ ఓపెన్‌తో సహా మిగిలిన సీజన్ మొత్తానికి దూరంగా ఉన్నాడు. దాదాపు ఏడాదిన్నరగా మోచేతి గాయంతో ఇబ్బందిపడ్డ జొకోవిచ్ ఈ ఏడాది జనవరిలో చిన్న శస్త్రచికిత్సతో దానిని సరి చేసుకున్నాడు. టెన్నిస్‌లోకి పునరాగమనం చేశాక ఒకటి, రెండు ఎగ్జిబిషన్ మ్యాచ్‌లు గెలిచినా కీలకమైన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండోరౌండ్‌లోనే ఓడిపోయాడు.

మైండ్‌సెట్ మారితేనే..

మోచేతికి శస్త్రచికిత్స తర్వాత మళ్లీ రాకెట్ పట్టిన జొకోవిచ్ దృష్టి ఇప్పుడు ఫ్రెంచ్ ఓపెన్‌పైనే ఉంది. అయితే సెర్బియన్ మునుపటి ఫామ్‌ను సంతరించుకోవాలంటే అతని మైండ్‌సెట్ మారాలని మాజీ ఆటగాడు బోరిస్ బెకర్ అంటున్నాడు. కెరీర్‌లో 12 గ్రాండ్‌స్లామ్‌లు సాధించిన జొకోవిచ్ మానసికంగా ధృడంగా కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నాడు. 2014-16 మధ్య కాలంలో బెకర్ కోచ్‌గా ఉన్నప్పుడు జొకోవిచ్ ఆరు గ్రాండ్‌స్లామ్‌లు గెలిచాడు. అయితే ఇప్పటికిప్పుడు అంతటి సక్సెస్ రాదన్నది బెకర్ అభిప్రాయం. 'మానసికంగా కుదురుకోవడం జొకో ముందున్న అతిపెద్ద సవాలు. ఈ సీజన్ చివరి వరకు అతను ఇదే పట్టుదలతో పోరాడితే అప్పుడు గాడినపడుతాడు' అని బెకర్ వివరించాడు.



బోరిస్ బెకర్

కెరీర్‌లో 12 గ్రాండ్‌స్లామ్స్.. 6 ఆస్ట్రేలియన్ ఓపెన్.. 3 వింబుల్డన్.. 2 యూఎస్ ఓపెన్.. 1 ఫ్రెంచ్ ఓపెన్.. వీటికి తోడు 5 ఏటీపీ ఫైనల్స్ టైటిల్స్... 30 మాస్టర్ సిరీస్ టైటిల్స్.. 12 ఏటీపీ వరల్డ్ టూర్.. 500ల టోర్నీలు.. 223 వారాల పాటు నంబర్‌వన్ ర్యాంక్.. అరుదైన 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' సాధించిన 8వ ఆటగాడిగా రికార్డు.. ఈ గణాంకాలు చాలు జొకోవిచ్ ఎంత మేటి ఆటగాడో చెప్పడానికి. కానీ ఏడాది కిందటి వరకు వీటిని చూసే జడుసుకున్న ప్రత్యర్థులు.. ఇప్పుడు అతడంటే ఏమాత్రం భయపడటం లేదు. ఎలాంటి టోర్నీలోనైనా జొకోతో పోటీపడితే విజయం తమదేనన్న ధీమాతో ఉన్నారు. కారణం ఫామ్‌లేమి, గాయాలు.. ఒత్తిడి. తాజాగా ఇప్పుడు కొత్త తరహా జొకోవిచ్ మళ్లీ టెన్నిస్ రాకెట్ పట్టాడు. మొన్నటి నుంచి ప్రాక్టీస్ మొదలుపెట్టిన ఈ సెర్బియన్.. ఫ్రెంచ్ ఓపెన్ లక్ష్యంగా తన కసరత్తులు మొదలుపెట్టాడు.

ఆ ఇద్దరే అడ్డంకి..

పురుషుల టెన్నిస్‌లో నంబర్‌వన్ ర్యాంక్ ఎక్కువగా నలుగురితోనే దోబుచులాడుతున్నది. రెండేండ్ల కిందట స్విస్ స్టార్ ఫెడరర్, నాదల్ వైభవం తగ్గడంతో ముర్రే, జొకోవిచ్ దానిని పంచుకున్నారు. కానీ ముర్రే ఆటలో నిలకడ లేకపోవడం అతనికి ప్రతికూలంగా మారింది. గాయాల కారణంగా జొకోవిచ్ ఏడాదిన్నరగా ఆటకు దూరంగా ఉండటంతో ఇప్పుడు 13వ ర్యాంక్‌కు పడిపోయాడు. అయితే ఇప్పుడు ముర్రే మినహా ఫెడరర్, నాదల్ టెన్నిస్‌లోకి వచ్చేశారు. ఇద్దరూ మంచి ఫామ్‌లో కూడా ఉన్నారు. ఈ సమయంలో జొకోవిచ్ నంబర్‌వన్‌కు చేరే అవకాశం ఉందా? వయసు పరంగా చూస్తే ఫెడరర్‌కు 36, నాదల్ 31, జొకోవిచ్‌కు 30. ఇప్పటికే కెరీర్‌లో 20 గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన స్విస్ స్టార్ మహా అయితే ఏడాది ఆటలో ఉంటాడు. రెండో ర్యాంక్‌లో ఉన్న నాదల్ విషయానికొస్తే గాయాలు అతనికి శాపంగా మారాయి. ప్రస్తుత ఫామ్ ప్రకారం ఓ ఏడాది పాటు నాదల్ హవా ఉండొచ్చు. ఆ తర్వాత కచ్చితంగా జొకోవిచ్ జోరు నడుస్తుందన్నది విశ్లేషకుల వాదన.

ఫ్రెడ్డీ స్ఫూర్తిగా..

36 ఏండ్ల వయసులో ఫెడరర్ మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను సాధించాడు. రెండేండ్లు ఫామ్‌లో లేకపోయినా.. ఒక్క టైటిల్ గెలువకపోయినా.. పోరాట స్ఫూర్తితో అతను అనుకున్నది సాధించాడు. కాబట్టి అతన్ని స్ఫూర్తిగా తీసుకుంటే జొకోవిచ్ అగ్రపీఠం దక్కించుకోవడం పెద్ద కష్టం కాదు. ఎట్లా లేదన్నా మరో ఐదారేండ్లు ఈ సెర్బియన్ టెన్నిస్‌లో కొనసాగుతాడు. కానీ నడుం నొప్పి జొకోకు కాస్త ప్రమాదకరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఫెడరర్, నాదల్, ముర్రే, జొకో ఏడాదికి 70, 80 మ్యాచ్‌లు ఆడుతారు. ఈ సంఖ్యను తగ్గించుకుంటే కెరీర్‌ను సుదీర్ఘంగా కొనసాగించొచ్చు. కానీ ఇప్పుడున్న పోటీ పరిస్థితుల్లో అది సాధ్యం కాకపోవచ్చు.


కాంస్య విజేతలు భజ్‌రంగ్, వినోద్

బిష్కెక్ (కిర్గిస్థాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు మరో రెండు పతకాలు లభించాయి. శనివారం జరిగిన పురుషుల 65 కేజీల క్వార్టర్‌ఫైనల్ బౌట్‌లో భజ్‌రంగ్ పూనియా 5-7తో దైచి టకాటని (జపాన్) చేతిలో ఓడాడు. కానీ ప్రత్యర్థి ఫైనల్‌కు చేరుకోవడంతో అతనికి రెప్‌చేజ్ ఆడే అవకాశం వచ్చింది. రెప్‌చేజ్ తొలి రౌండ్‌లో భజ్‌రంగ్ 12-2తో అబ్దుల్‌కోసిమ్ ఫైజివ్ (తజకిస్థాన్)పై గెలిచాడు. కాంస్య పతక పోరులో 10-4తో అలిబాకర్ ఎమ్మామిచ్ గోహె (ఇరాన్)పై నెగ్గి పతకాన్ని ఒడిసిపట్టుకున్నాడు. ఇదే కేటగిరీలో జరిగిన క్వార్టర్స్‌లో వినోద్ కుమార్ 3-6తో ఇక్తియార్ నువరుజోవ్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓడినా.. రెప్‌చేజ్‌లో కాంస్యం గెలిచే అవకాశాన్ని దక్కించుకున్నాడు. ఎలామన్ డోగ్డుబెక్ (కిర్గిస్థాన్)తో జరిగిన కాంస్యపతక పోరులో 3-3తో స్కోరు సమమైనా.. రిఫరీలు వినోద్‌ను విజేతగా ప్రకటించారు.

ఏసీయూ హెడ్ అజిత్ సింగ్!

న్యూఢిల్లీ: బీసీసీఐ అవినీతి నిరోధక హెడ్‌గా రాజస్థాన్ మాజీ డీజీపీ అజిత్‌సింగ్ షెకావత్‌ను నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మాజీ చీఫ్ నీరజ్ కుమార్ స్థానంలో అతను బాధ్యతలు తీసుకోనున్నాడు. వచ్చే నెల 7 నుంచి జరుగనున్న ఐపీఎల్‌కు ముందే అతను ఈ పదవిని చేపట్టనున్నాడు. 'ఏసీయూ చీఫ్‌గా అజిత్‌సింగ్ నియామకం దాదాపుగా ఖరారైంది. అవినీతి నిరోధక కార్యకలాపాలను నియంత్రించడంలో అతనికి చాలా అనుభవం ఉంది. బీసీసీఐ కోరుకుంటున్నట్లుగా ఈ పదవికి అతను అన్ని విధాలుగా సరిపోతాడు' అని బోర్డు అధికారి ఒకరు పేర్కొన్నాడు. రాజస్థాన్ ఏసీబీ అడిషనల్ డైరెక్టర్‌గా పని చేసిన రోజుల్లో అజిత్‌సింగ్.. 600 కేసులు నమోదు చేసి విచారణ జరిపాడు. 1982వ బ్యాచ్‌కు చెందిన అతను జహల్వార్, సవాయ్ మాదోపూర్, జోధ్‌పూర్, జైపూర్, సిరోహి జిల్లాలకు ఎస్పీగా పని చేశాడు. జైళ్ల శాఖ డీజీగా కూడా పని చేసిన అనుభవం ఉంది. అయితే బీసీసీఐ ఏసీయూలో సిబ్బంది కొరత వేధిస్తున్నది. ప్రస్తుతం ముగ్గురు సభ్యులు మాత్రమే ఇందులో పని చేస్తున్నారు. ఓవరాల్‌గా ప్రతి ఏడాది ఐపీఎల్, సీనియర్ టోర్నీలతో కలిపి బీసీసీఐ దాదాపు 1500ల మ్యాచ్‌ల వరకు నిర్వహిస్తుంది. ఈ మ్యాచ్‌ల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా జరిపించాలంటే శాశ్వతంగా ఓ 15 మంది సిబ్బంది ఉండాలి. వీరికి అదనంగా తాత్కాలికంగా కొంత మందిని వినియోగించుకోవచ్చు.

వెంకీ స్థానంలో అశీష్ కపూర్




న్యూఢిల్లీ: జాతీయ సెలెక్షన్ ప్యానెల్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్ స్థానాన్ని అశీష్ కపూర్‌తో భర్తీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. రానున్న ఐపీఎల్‌లో కింగ్స్ లెవన్ పంజాబ్ జట్టుకు ప్రసాద్ బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించే అవకాశాలు ఉన్నాయి. అయితే ఇది పరస్పర విరుద్ధ ప్రయోజనాల(కాన్‌ఫ్లిక్ట్ ఆఫ్ ఇంట్రెస్ట్) కిందకు రానునండటంతో ప్రసాద్ తన పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తున్నది. దీనికి తోడు ఇటీవల అండర్-19 ప్రపంచకప్ గెలిచిన జట్టు సభ్యులకు, చీఫ్ కోచ్, సహాయక బృందానికి నజరానాలు ప్రకటించిన బీసీసీఐ సెలెక్షన్ ప్యానెల్‌ను కనీసం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో చేసేది ఏమీ లేక కాసుల వర్షం కురిపించే ఐపీఎల్ వైపు ప్రసాద్ మొగ్గుచూపినట్లు వినికిడి. ఇదిలా ఉంటే భారత్ తరపున నాలుగు టెస్టులు, 17 వన్డేలు ఆడిన 46 ఏండ్ల అశీష్ కపూర్ సెలెక్షన్ ప్యానెల్ బాధ్యతలు స్వీకరించనున్నాడు. కపూర్‌తో పాటు పంజాబ్ మాజీ క్రికెటర్ అమిత్‌శర్మ ప్యానెల్లో సభ్యునిగా చేరే అవకాశముందని బీసీసీఐ సీనియర్ అధికారి పేర్కొన్నాడు.

విలియమ్సన్ పోరాడినా..

ఇంగ్లండ్ చేతిలో ఓడిన కివీస్

వెల్లింగ్టన్: ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య వన్డే సిరీస్ హోరాహోరీగా సాగుతున్నది. శనివారం ఆఖరి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన పోరులో ఇంగ్లండ్ 4 పరుగుల తేడాతో కివీస్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. ఐదు వన్డేల సిరీస్‌లో ఇంగ్లండ్ 2-1తో ఆధిక్యంలో కొనసాగుతున్నది. ఇంగ్లండ్ నిర్దేశించిన 235 పరుగుల లక్ష్యఛేదనలో కివీస్ 50 ఓవర్లలో 230/8 స్కోరుకు పరిమితమైంది. కెప్టెన్ విలియమ్సన్(112 నాటౌట్) అజేయ సెంచరీతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం దక్కలేదు. ఇంగ్లండ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఓ దశలో 103 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన కివీస్‌ను విలియమ్సన్, సాంట్నర్(41) గాడిలో పడేశారు. వీరిద్దరు కలిసి ఏడో వికెట్‌కు 96 పరుగులు జోడించారు. అయితే ఆఖరి ఓవర్లో విజయానికి 15 పరుగులు అవసరమైన దశలో కివీస్..వోక్స్ సూపర్ బౌలింగ్‌తో 10 పరుగులే చేసి ఓటమివైపు నిలిచింది. స్పిన్నర్లు మొయిన్ అలీ(3/36), రషీద్(2/34) రాణించారు. తొలుత కెప్టెన్ మోర్గాన్(48), స్టోక్స్(39) బ్యాటింగ్‌తో ఇంగ్లండ్ 50 ఓవర్లలో 234 పరుగులకు ఆలౌటైంది. సోధీ(3/53), బౌల్ట్(2/47) ఆకట్టుకున్నారు.



విలియమ్సన్ (112 ★)

ఆస్ట్రేలియా ఆధిక్యం 402



బాన్‌క్రాఫ్ట్(53)

డర్బన్: ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య తొలి టెస్ట్ రసవత్తరంగా సాగుతున్నది. తొలి రెండు రోజులు ఆసీస్ ఆధిపత్యం కొనసాగిన టెస్ట్‌లో మూడో రోజు ఆతిథ్య దక్షిణాఫ్రికా తిరిగి పుంజుకున్నది. సఫారీలను 162 పరుగులకు కుప్పకూల్చిన ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 402 ఆధిక్యంలో కొనసాగుతున్నది. ఓపెనర్లు బాన్‌క్రాఫ్ట్(53), వార్నర్(28) మెరుగైన శుభారంభం అందించారు. అయితే మహారాజ్(3/93), మోర్కెల్(3/42), రబాడ(2/28) విజృంభించడంతో ఆసీస్ బ్యాట్స్‌మెన్ నిలదొక్కుకోలేకపోయారు. వెలుతురులేమి కారణంగా మ్యాచ్‌ను నిర్ణీత సమయం కంటే ముందే అంపైర్లు ఆపేశారు. కమ్మిన్స్(17), హాజిల్‌వుడ్(4) క్రీజులో ఉన్నారు. మరో రెండు రోజులు మిగిలున్న టెస్ట్‌లో ఆసీస్ బౌలింగ్‌ను నిలువరించడం దక్షిణాఫ్రికాకు కత్తిమీద సామేనని చెప్పొచ్చు.

షార్‌లో సైంటిస్టు పోస్టులు

బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ అభ్యర్థులకు అవకాశం ▪ అకడమిక్ ప్రతిభ ఆధారంగా ఎంపిక ▪ మంచి జీతభత్యాలు, ప్రతిభ ఆధారంగా పదోన్నతులు

సీఎస్ఐఆర్ - సీఐఎంఎఫ్ఆర్‌లో



ధన్‌బాద్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్ రిసెర్చ్ (సీఐఎంఎఫ్ఆర్)లో కింది పోస్టుల (తాత్కాలిక ప్రాతిపదికన) భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

సీఐఎంఎఫ్ఆర్ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) పరిధిలోని సంస్థ

- లెవల్ – I ప్రాజెక్టు అసిస్టెంట్ – 2 ఖాళీలు
- **అర్హతలు:** డిప్లొమా ఇన్ మైనింగ్ ఇంజినీరింగ్ లేదా డిగ్రీ (జియాలజీ) ఉత్తీర్ణత.
- **స్టయిఫండ్:** నెలకు రూ. 15,000/–
- లెవల్– III ప్రాజెక్టు అసిస్టెంట్ – 3 ఖాళీలు
- **జీతం:** నెలకు రూ. 25,000/–
- **అర్హతలు:** బీఈ/బీటెక్‌లో మైనింగ్ ఇంజినీరింగ్ లేదా జియాలజీ/అప్లయిడ్ జియాలజీ/ఫిజిక్స్‌లో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణత.
- లెవల్ –III ప్రాజెక్టు అసిస్టెంట్ – 1 ఖాళీ
- **జీతం:** నెలకు రూ. 28,000/–
- **అర్హతలు:** ఎమ్మెస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ లేదా ఎంటెక్ (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్)
- **వయస్సు:** 28 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూతేదీ:** మార్చి 12 ▪ **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **వెబ్‌సైట్:** www.cimfr.nic.in

సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లో సైంటిస్ట్, మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) పరిధిలో షార్ పని చేస్తుంది. షార్ శ్రీహరికోటలో ఉంది. ఇక్కడ రాకెట్ల మోటార్ స్టాటిక్ టెస్ట్, లాంచ్ కాంప్లెక్స్ ఉన్నాయి. ఇక్కడి నుంచి పలు రకాల రాకెట్లను ఇస్రో ప్రయోగిస్తుంది.

- సైంటిస్ట్/ఇంజినీర్ 'ఎస్‌సీ' (కెమికల్ ఇంజినీరింగ్)
- ఖాళీల సంఖ్య – 10
- **అర్హతలు:** కనీసం 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్‌లో కెమికల్ ఇంజినీరింగ్ ఉత్తీర్ణత.
- సైంటిస్ట్/ ఇంజినీర్ 'ఎస్‌సీ' (క్వాలిటీ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్) – 1 పోస్టు
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్‌లో క్వాలిటీ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ ఉత్తీర్ణత. లేదా బీఈ/బీటెక్‌లో కెమికల్ ఇంజినీరింగ్/మెకానికల్ ఇంజినీరింగ్‌లో కనీసం 65 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- సైంటిస్ట్/ఇంజినీర్ 'ఎస్‌సీ' (థర్మల్ ఇంజినీరింగ్) – 2 ఖాళీలు
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్‌లో థర్మల్ ఇంజినీరింగ్ లేదా బీఈ/బీటెక్‌లో మెకానికల్ ఇంజినీరింగ్‌లో కనీసం 65 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- సైంటిస్ట్/ఇంజినీర్ 'ఎస్‌సీ' (మెషిన్ డిజైన్) – 1
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్‌లో మెషిన్ డిజైనింగ్ ఉత్తీర్ణత. లేదా 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత.
- సైంటిస్టు/ఇంజినీర్ 'ఎస్‌సీ' (ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్) – 2 ఖాళీలు
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్‌లో ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ ఉత్తీర్ణత. లేదా 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ ఉత్తీర్ణత.
- సైంటిస్టు/ఇంజినీర్ 'ఎస్‌సీ' (ఇండస్ట్రియల్ సేఫ్టీ) – 4 ఖాళీలు
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్‌లో ఇండస్ట్రియల్ సేఫ్టీ లేదా కనీసం 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్‌లో కెమికల్ ఇంజినీరింగ్ లేదా మెకానికల్ ఇంజినీరింగ్ /ఫైర్ & సేఫ్టీ ఇంజినీరింగ్ ఉత్తీర్ణత.
- సైంటిస్టు/ఇంజినీర్ 'ఎస్‌సీ' (స్ట్రక్చరల్ ఇంజినీరింగ్) – 1 ఖాళీలు
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్‌లో స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ లేదా కనీసం 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్‌లో సివిల్ ఇంజినీరింగ్ ఉత్తీర్ణత.
- సైంటిస్టు/ఇంజినీర్ 'ఎస్‌సీ' (ఎమ్మెస్సీ ఆర్గానిక్/ అనలిటికల్ కెమిస్ట్రీ) – 2 ఖాళీలు
- **అర్హతలు:** ఎమ్మెస్సీ ఆర్గానిక్/అనలిటికల్ కెమిస్ట్రీలో కనీసం 65 శాతం మార్కులతో ఉత్తీర్ణత. లేదా ఫస్ట్‌క్లాస్‌లో బీఎస్సీ కెమిస్ట్రీ (మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ ఏవేని రెండు సబ్జెక్టులు) ఉత్తీర్ణత.
- సైంటిస్టు/ఇంజినీర్ 'ఎస్‌సీ' (కెమికల్ ఇంజినీరింగ్) – 1 ఖాళీ
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో ఎంఈ/ఎంటెక్‌లో కెమికల్ ఇంజినీరింగ్ లేదా 65 శాతం మార్కులతో బీఈ/బీటెక్‌లో కెమికల్ ఇంజినీరింగ్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- మెడికల్ ఆఫీసర్ 'ఎస్‌సీ' (ఆర్థోపెడిక్స్) –1 పోస్టు
- **అర్హత:** ఎంబీబీఎస్ + ఎంసీఐ గుర్తింపు పొందిన డిప్లొమా ఇన్ ఆర్థోపెడిక్స్ (రెండేండ్ల కాలవ్యవధి) లేదా తత్సమాన కోర్సు.
- **పేస్కేల్:** సైంటిస్ట్/ఇంజినీర్ 'ఎస్‌సీ' పోస్టుకు లెవల్ 10 ప్రకారం రూ. 56,100 – 1,77,500 + ఇతర అలవెన్సులు ఇస్తారు.
- మెడికల్ ఆఫీసర్ పోస్టుకు లెవల్ 11 ప్రకారం రూ. 67,700 – 2,08,700 + ఇతర అలవెన్సులు ఇస్తారు.
- **వయస్సు:** 2018, మార్చి 23 నాటికి సైంటిస్ట్/ఇంజినీర్ పోస్టులకు 18 – 35 ఏండ్ల మధ్య ఉండాలి. మెడికల్ ఆఫీసర్ పోస్టుకు ఎటువంటి గరిష్ఠ వయోపరిమితి లేదు.
- **ఎంపిక విధానం:** దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అకడమిక్ ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూలకు పిలుస్తారు. ఇంటర్వ్యూలో కనీసం 60 శాతం మార్కులు సాధించాలి. ఇంటర్వ్యూలో వచ్చిన మార్కుల ఆధారంగా తుది ఎంపిక చేస్తారు.
- ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులకు సెకండ్ క్లాస్ రైల్వే చార్జీలను షార్ ఇస్తుంది.
- ఎంపికైన అభ్యర్థులకు మొదట షార్, శ్రీహరికోటలో పోస్టింగ్ ఇస్తారు. అవసరాన్ని బట్టి ఇస్రో ఇతర యూనిట్లు/కేంద్రాలకు బదిలీ చేస్తారు.
- ఈ పోస్టులు సైంటిఫిక్, టెక్నికల్ పోస్టులు. పీరియాడికల్ మెరిట్ బేస్డ్ పర్‌ఫార్మెన్స్ రివ్యూ సిస్టమ్ ద్వారా పదోన్నతులు కల్పిస్తారు.



- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 23 (సాయంత్రం 5 గంటల వరకు)
- **వెబ్‌సైట్:** http://www.shar.gov.in

గ్రాడ్యుయేట్, ఐటీఐ అప్రెంటిస్

మినీరత్న హోదా కలిగిన ఎన్‌హెచ్‌పీసీ లిమిటెడ్ వివిధ ట్రేడ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఐటీఐ, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

ట్రేడ్‌ల వారీగా ఖాళీలు:

- ఎలక్ట్రీషియన్ – 1, ఫిట్టర్ – 1, సెక్రటేరియల్ అసిస్టెంట్ – 1, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ –3
- **అర్హతలు:** ట్రేడ్ అప్రెంటిస్‌కు పదోతరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత.
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు సంబంధిత బ్రాంచీలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **వయస్సు:** 18– 30 ఏండ్ల మధ్య ఉండాలి.
- **స్టయిఫండ్:** నెలకు రూ. 4984/–
- **దరఖాస్తు:** అభ్యర్థులు మొదట నేషనల్ అప్రెంటిస్‌షిప్/ఎంహెచ్ఆర్‌డీ వెబ్‌సైట్లలో రిజిస్టర్ చేసుకోవాలి. తర్వాత ఎన్‌హెచ్‌పీసీలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు దాఖలుకు చివరితేదీ:** మార్చి 19
- ఎంపిక: అకడమిక్ ప్రతిభ ఆధారంగా ▪ **వెబ్‌సైట్:** www.nhpc.gov.in

ఐటీఆర్‌లో టెక్నీషియన్ అప్రెంటిస్

చాందీపూర్, బాలసోర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్)లో టెక్నీషియన్ అప్రెంటిస్‌షిప్ కోసం నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

ఐటీఆర్ అనేది డిఫెన్స్ రిసెర్చ్ & డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) పరిధిలో పని చేసే సంస్థ. ఇది ఒడిశా రాష్ట్రంలో ఉంది.

- టెక్నీషియన్ (డిప్లొమా) అప్రెంటిస్
- ట్రేడ్‌ల వారీగా: కంప్యూటర్ సైన్స్ &ఇంజినీరింగ్/ఐటీ – 7, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ – 8, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ – 5, మెకానికల్ ఇంజినీరింగ్ – 5, సివిల్ ఇంజినీరింగ్ – 5 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత ట్రేడ్/బ్రాంచీలో డిప్లొమా ఉత్తీర్ణత. డిప్లొమా ఉత్తీర్ణులైన మూడేండ్లలోపు వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
- **శిక్షణా కాలం:** 12 నెలలు ▪ **స్టయిఫండ్:** నెలకు రూ. 3542/–
- **ఎంపిక:** మార్చి 28న నిర్వహించే రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- అభ్యర్థులు www.mhrdnats.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** https://www.drdo.gov.in

'లా' క్లర్కులు

న్యూఢిల్లీలోని నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌క్లాట్)లో లా క్లర్కు, రిసెర్చ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- పోస్టు: లా క్లర్కు కమ్ రిసెర్చ్ అసిస్టెంట్.
- ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తారు. మొదట ఆరునెలల కాలపరిమితికి ఈ పోస్టులను భర్తీ చేస్తారు. తర్వాత ఉద్యోగంలో చూపిన ప్రతిభ ఆధారంగా కాంట్రాక్టును పొడగిస్తారు.
- **జీతం:** నెలకు రూ. 30,000/–
- **అర్హతలు:** లా డిగ్రీ పాసై ఉండాలి.
- **వయస్సు:** 2018, జనవరి 1నాటికి 30 ఏండ్లు మించరాదు.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చిరునామా:** Registrar, National Company Law Appellate Tribunal, C.G.O. Complex, Lodhi Road, New Delhi–i 10003.
- **చివరితేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** http://www.nclat.nic.in